22-2Pg1FB.qxd:22-2Pg1FB.qxd 01/01/01 10:32 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 21 పేజీలు: 12 వెల: 6.50

మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు

ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్ 9లో

## ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా? 9లో


### రాష్ట్రంలో ఇక ప్రజలందరికి
# 25లక్షల ఆరోగ్యబీమా

ఈ ఉచిత పథకం ఏప్రిల్ లేదా మే నుంచి అమలు

30 రకాల స్పెషాల్టీలతో కలిపి 3,257 రకాల చికిత్సలు

కొత్త విధానంలో 6 గంటల్లోనే చికిత్స ఆరంభం

ప్రతి కుటుంబం తరపున ప్రభుత్వం రూ.2,500 దాకా ప్రీమియం చెల్లింపు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య సేవల విషయంలో ప్రజలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందుకు వీలుగా ప్రభుత్వం రూ.25లక్షల ఆరోగ్యబీమాను అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ఆలోచనా విధానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రజలందరికీ త్వరలోనే ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రజలందరికి బీమాకు వర్తింపచేసి, తద్వారా ఆరోగ్యబీమా(హెల్త్ ఇన్సురెన్స్)ను రూ.25లక్షల వరకు వైద్యసేవలు అందిస్తారు. ఈ విధానం అమలు కోసం పలు ప్రతిపాదనలను చేసారు. వీటిలో కీలక ప్రతిపాదనను అమలులోకి తీసుకుని వస్తారు. ఈ విధానం అమల్లోకి వస్తే చికిత్స కోసం ఎక్కువ సమయం ఇబ్బంది పడాల్సి ఉండదన్నారు. బీమా విధానంలో 6గంటల్లోనే చికిత్స ప్రారంభ అనుమతి లభిస్తుంది. చికిత్సకు ఆమోదం తెలిపేందుకు బీమా సంస్థ నిరాకరిస్తేవెంటనే అప్పీలు చేసుకునే వెసులు బాటును కల్పిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి. ఎంపిక చేసిన బీమా కంపెనీ మూడేళ్ల పాటు సర్వీసును అందించాలి. ప్రతిఏడాది పని తీరును సమీక్షిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు అనుబంధ ఆసుపత్రులు బీమా విధానంలోనూ కొనసాగుతాయి. వైద్యమిత్రల సేవలనుకొనసాగిస్తారు. ఎంపిక చేసిన బీమా సంస్థలకు ప్రతి మూడునెలల కొకసారి ప్రభుత్వపరంగా ముందుగానే చెల్లింపులు చేస్తారు. దీనివల్ల బిల్లుల చెల్లింపుల సమస్యలు తలెత్తవు. రోగులకు చికిత్స వివరాలు అందిన తర్వాత బీమా సంస్థలు సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు చేసేలా నిర్దేశిత గడువును కూడా టెండరు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం 30రకాల స్పెషాల్టీలతో కలిపి 3వేల 257రకాల చికిత్సలు అందు బాటులో ఉన్నాయి. వీటిని అలాగే కొనసాగిస్తారు. ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన కింద అందే 19వందల49రకాల చికిత్సలూ ఇందులో ఉన్నాయి. బీమా ప్రీమియం కింద ప్రభుత్వం చెల్లించే మొత్తం కంటే తక్కువగా ఖర్చు అయితే అందులో నిర్వహణ వ్యయ మొత్తాన్ని కంపెనీలు మినహాయించుకుని మిగిలిన దానిని వెనక్కి ఇచ్చేయాలి. ఎక్కువైతే మాత్రం బీమా కంపెనీ భరించాలన్న విధంగా ప్రతిపాదనలు సిద్ధమ >>2

# మిర్చిపై కేంద్రంతో చర్చలు

గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు

15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలు

గత పాలకుల నిర్వాకంతో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి, వృద్ధి రేటు మొదలైందన్నారు. మిర్చిరైతులకు గిట్టుబాటు ధర కల్పించే దిశలో కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలకు కేంద్రం నుంచి నిధులు విడుదల అంశంలో మంచి సహకారం లభిస్తుందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల24న జరుగుతున్నాయి. ఈ నెల28న అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ క్రమంలో బడ్జెట్ అంశాలతో పాటు, వివిధ విషయాలపై సీఎం చంద్రబాబు వర్చువల్‌గాను, మౌఖికంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుందనే విశ్వాసం వారిదన్నారు. వారికి ఎన్నికల సందర్భంలో ఇచ్చిన సందర్భంగా ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామన్నారు. బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే రీతిలో నిధులు కేటాయింపు ఉంటుం దన్నారు. మంచి అభివృద్ధి కార్యక్రమాలు అమలుతోనే సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు. అభివృద్ధివల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాపవచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చినేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో.

## కెఆర్‌ఎంబి ప్రత్యేక సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు, ఇతర అం శాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్‌ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందు గానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాల్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమా వేశాన్ని కేఆర్‌ఎంబీ సోమవారానికి వాయి దా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూ డున్నర గంటలకు హైదరాబాద్‌లో జల సౌధలో సమావేశం జరగనుంది.



శుక్రవారం విజయవాడలో ఏపీ,తమిళనాడు రాష్ట్రాల చేనేత, జౌళిశాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య చేనేత వస్త్రాల అమ్మకాలపై ఒప్పందం దృశ్యం

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

తమిళనాడు, ఎపి మంత్రుల సమక్షంలో ఎంఒయు

రూ.9.20 కోట్ల వస్త్రాల విక్రయాలు లక్ష్యం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం మరో కీలక ముందుకు వేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో,కోఆప్టెక్స్ ఏజెన్సీలు తమషోరూమ్‌ల్లో రెండురాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా >>2

## తెలంగాణ డిజి అంజనీకుమార్ ఎపికి మార్పు

24 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్రహోంశాఖ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి21:** తెలంగాణలో ఉన్న ముగ్గురు ఐపిఎస్ అధికారులకు కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో రోడ్ సేఫ్టీ డీజీగా కొనసాగుతున్న అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ కేడర్ ఐపిఎస్ అధికారిగా ఉన్న అంజనీకుమార్‌తో పాటు అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి సైతం ఏపీకి కేటాయించబడిన అధికారులు. అయితే వారు ఏపికి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండిపోయారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా మహంతి విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురిని ఏపీ కేడర్‌లో 24గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది.

# టమాటా కొనుగోళ్లు చేపట్టిన ప్రభుత్వం

మంత్రి అచ్చెన్ననాయుడు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** టమాటాకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టమాటా రైతులకు సరైన గిట్టుబాటుధర వచ్చేలా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం (ఎంఐఎస్)లో ఎన్ఎఫ్ఇడి, ఎన్‌సిసిఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఉన్న టమాటాలను అన్ని ఆపరేషన్‌ల ఖర్చులను వారే భరించే విధంగా, టమాటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణా, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలలో విక్రయించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో కిలో టమాటా ధర సుమారు 10 నుండి 15 రూపాయల వరకు రైతులకు అందుతుందన్నారు. రైతులను ఆదుకొనేందుకుగాను తీసుకునే చర్యలలో భాగంగా, టమాటాధర చాలా తక్కువగా పలుకుతున్న అనంతపురంజిల్లా నుండి ప్రభుత్వమే టమాటాను సుమారు కిలో 8 రూపా యలకు కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని రైతు బజార్లకు సరఫరా చేస్తున్నారు. ఈరోజు 1000 క్వింటాళ్ల టమాటాను అనంతపురం, కర్నూలు, విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించారు. వీటిలో విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించిన టమాటాలను విశాఖపట్టణం, రాజమండ్రి జిల్లాల్లోని రైత బజార్లలోనూ అనంతపురం, కర్నూలుజిల్లాల్లో సేకరించిన టమాటాలను విజయవాడ, గుంటూరుజిల్లాల రైతుబజార్లలో అమ్మకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు.



ఆక్రమిత భూముల్లో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

నేడు జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఉమ్మడి కడప జిల్లాలో 100 ఎకరాలు ఆక్రమించిన అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాధ్ రెడ్డికి జాయింట్ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. శనివారం జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు కావాలని తాఖీదులు పంపారు. ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ అక్రమ వ్యవహారంలో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు బయటపడింది. వివరాలలోకి వెళితే రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామ రెవెన్యూ పొలంలో ఈ ఆక్రమణ జరిగినట్లు రాజంపేట టీడీపీ గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్యానాయుడు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మందపల్లె సర్వే నెంబర్ 815/1లో 3.79ఎకరాలు, సర్వే నెంబర్ 814/4లో 4ఎకరాలు, ఆకేపాడు సర్వే నెంబర్ 56/8లో 5.68ఎకరాలు, 56-1లో 5ఎకరాలు, 56-9లో 2.35ఎకరాలు, 56-1లో ఒకటిన్నర ఎకరా, మందపల్లె సర్వే నెంబర్ 816-2లో 4.31ఎకరాలు, 814-3లో 4ఎకరాలు, 815-2లో 5ఎకరాలు, 814-1లో ఎకరా భూమి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైన పేర్కొన్న భూముల విస్తీర్ణం 39.58 ఎకరాలుగా పేర్కొన్నారు. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో జిరాయితీ పట్టా, అనువంశికంగా వచ్చినట్లు ఆన్‌లైన్ చేశారు. అంతేకాకుండా తిరుమలతిరుపతి దేవస్థానానికి ఆకేపాడు సర్వేనెంబర్ 56-1లో 1.50ఎకరాలు రిజిష్టర్ కూడ చేసి ఉన్నారు. ఇకపోతే పైన పేర్కొన్న సర్వే నెంబర్‌లలో అమర్‌నాధ్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి జ్యోతమ్మ, సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఆయన భార్య సుజన పేర్లతో రాజంపేట సబ్ రిజిస్ట్రార్ 1761-2023, 1768, 1769, 1770, 1771, 1772, 1773, 1774, 1775, 2346 డాక్యుమెంట్లుగా >>2



VIJAYAWADA: MITHRA AUTO AGENCY: 8886063544 | VARUN MOTORS: 9885701729 | ENIKEPADU: VARUN MOTORS: 9885104222 | KANURU: SANTOSH AUTO: 7799787944 | ELURU: NOVELTY REDDY & REDDY MOTORS: 9533290285 | BHIMAVARAM: NOVELTY REDDY & REDDY MOTORS: 9948828555 | GUNTUR: JAYALAKSHMI AUTOMOTIVES: 7396669031 | NELLORE: VISHNU CARS: 7995088876 | BHARGAVI AUTOMOBILES: 9848357778 | ONGOLE: JAYALAKSHMI AUTOMOTIVES: 9949033433 | ANDHRA PRABHA COLONY: MITHRA AUTO AGENCY: 7337540033.

22-2pg2exHMNWJQE.qxd:22-2pg2exHMNWJQE.qxd 01/01/01 10:02 AM Page 1





ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

>> ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది రూ.9.20 కోట్ల మేర వస్త్రాలు విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ మేరకు విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో శుక్రవారం జరిగిన బయ్యర్, సెల్లార్ మీట్ లో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖ మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధితో పాటు చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెట్ సదుపాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ నగరాల్లో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వస్తోంది. చేనేత కార్మికులకు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు, దుస్తుల తయారీపై శిక్షణ ఇస్తూ, తయారైన చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించాలన్న ఆశయంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల చేనేత సంస్థలతో కూడా ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మార్కెట్ విస్తరణలో భాగంగా తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తో ఆప్కో ఒప్పందం చేసుకుంది. ఏపీ, తమిళనాడుకు చెందిన చేనేత,జౌళిశాఖ మంత్రులు సవిత, గాంధీ సమక్షంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, కో ఆప్టెక్స్ ఎండీ దీపక్ జాకబ్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇరు రాష్ట్రాలకు చేనేత సంస్థలు రూ.9.20 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందంతో తమిళనాడుకు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. కో ఆప్టెక్స్, ఆప్కో మధ్య రూ.20 లక్షలు, ట్రిచీ, మదురై, తిరుచెన్‌గోడ్ సర్కల్, అరబిందో టైక్స్ టైల్స్ మధ్య రూ.1.25కోట్లు, సాలెమ్ సర్కిల్, శ్రీ సుదర్శన్ సిల్క్ మధ్య రూ.కోటి, ఈరోడ్ సర్కిల్, బళభద్ర నర్సింహమూర్తి సంస్థ మధ్య రూ.50 లక్షల మేర ఒప్పందం కుదిరాయి.వాటితో మరిన్ని ఏపీ, తమిళనాడుకు చెందిన సంస్థల మధ్య ఒప్పందాలు కుదిరియి. త్వరలో మిగిలిన రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం చేసుకోడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆప్కో, కో ఆప్టెక్స్ ఒప్పందంతో ఏపీకి చెందిన చేనేత కార్మికులకు ఎంతో లబ్ధి కలుగనుంది. నేతన్నల దగ్గర తయారవుతున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తోంది. కో ఆప్టెక్స్ కు చెందిన చేనేత వస్త్రాలు డబుల్ క్లాత్ బెడ్‌షీట్‌లు (కింగ్ సైజు), టర్కీ టవల్స్ (బ్లీచ్డ్ మరియు డైడ్), డోర్‌మ్యాట్‌లు, ఆరని సిల్క్ చీరలు, పళని టై, డై చీరలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన మంగళగిరి కాటన్, జరీ చీరలు, రాజమండ్రి కాటన్ చీరలు, బందర్ కాటన్ చీరలు,వెంకటగిరి కాటన్ చీరలు, మాధవరం కాటన్ చీరలు, సిల్క్ చీరతో పాటు ఇతర చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీతో పాటు తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కో ఆప్టెక్స్ షో రూమ్ లో రాష్ట్రానికి చేనేత వస్త్రాలను విక్రయించుకునే సౌలభ్యం కలుగుతుంది. దీనివల్ల ఉత్పత్తవుతున్న సరకును ఎప్పటికప్పుడు అమ్మకం కావడం వల్ల నేతన్నలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి కలుగుతుంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న ఉద్దేశం కూడా నెరవేరబోతోంది.

**తమిళనాడు బయ్యర్‌సెల్లార్ మీట్ ను ప్రారంభించిన ఏపీ మంత్రి సవిత..**

విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన బయ్యర్, సెల్లార్ మీట్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం కో ఆప్టెక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి పరిశీలించారు. చీరలు, ఇతర చేనేత వస్త్రాలను నాణ్యతను, ధరలను మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మేఘాశ్వేరి రవికుమార్, ఏపీ చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, చేనేత సొసైటీలు, పలు వాణిజ్య సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 25లక్షల ఆరోగ్యబీమా

>> య్యాయి. ప్రతి కుటుంబానికి తరఫున ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం 2,500 వరకు ఉండొచ్చని అంచనా. జాతీయ స్థాయిలో పిలిచే టెండర్ల ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కం పెనీలు పోటీపడతాయి. తమిళనాడు, ఝార్ఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బీమా సంస్థల ద్వారా అర్హత వారికి వైద్య సేవలు అందుతున్నాయి. డబ్ల్యూహెచ్ఓ అధ్యయన ఫలితాలు, వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం సమీక్షించింది. రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిపై త్వరలో ఉన్నత స్థాయిలో జరిగే సమీక్ష సమావేశంలో చర్చించి అధికారిక నిర్ణయాన్ని తీసుకోనున్నారుఆరోగ్యబీమాను. షరతులతో నిమిత్తం లేకుండా: దీనికి అనుగుణంగా ఉమ్మడి శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక యూనిట్, గుంటూరు నుంచి రాయలసీమ జిల్లాల వరకు మరో యూనిట్గా గుర్తించి టెండరు పిలువబోతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు కింద ఏడాదికి 25 లక్షల విలువైన చికిత్సలను ఉచితంగా ప్రస్తుతం అందిస్తున్నారు. కొత్త బీమా విధానంలో వార్షిక పరిమితి, ఇతర షరతులతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు వీలుగా టెండరు డాక్యుమెంట్ సిద్ధమైంది. ప్రతి కుటుంబానికి ఇప్పుడున్న 25లక్షల వార్షిక పరిమితి వైద్య సేవలు అలాగే కొనసాగుతాయి. అయితే ఏడాదికి రెండున్నర లక్షల రూపాయల వైద్య సేవలు ఉచితంగా అందించేలా టెండరు పిలుస్తారు. ఆపైన చికిత్సకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు భరిస్తుంది. ప్రస్తుతం ఏడాదికి రెండున్నర లక్షల్లోపు వ్యయమయ్యే చికిత్సలు పొందేవారి సంఖ్య రాష్ట్రంలో 97 శాతం ఉంది. సీఎం చంద్రబాబు సమక్షంలో నిర్ణయం జరిగిన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నుంచి బీమా విధానం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పనపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. ఆ మేరకు ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం వార్షిక ఆదాయం 5 లక్షలలోపు ఉన్న వారికి ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. ఈ పరిధిలో కోటీ 43 లక్షల కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి ఎనిమిదిన్నర లక్షల మంది ఉన్నారు. బీమా పథకం కింద ఏడాదికి ఒక్కో ఉద్యోగి, పెన్షనర్ సుమారు 7వేల వరకు చెల్లిస్తున్నారు. జర్నలిస్టులు కూడా ప్రీమియం చెల్లిస్తున్నారు. ప్రీమియం చెల్లించే జాబితాలో ఉన్న వారికి మినహాయించి, మిగిలిన వారందరికీ బీమా విధానాన్ని వర్తింపచేసేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.నిర్దేశించిన రెండు యూనిట్లకు కలిపి ఒక టెండరు పిలుస్తారు. తక్కువ మొత్తాన్ని కోట్‌చేసి, ఎల్1గా ప్రైవేట్ కంపెనీ వస్తే.. అదే ధరకు సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ రంగ సంస్థను ఆహ్వానిస్తారు. దీనికి ప్రభుత్వ రంగ సంస్థ ఆమోదం తెలిపితే మరో యూనిట్ బాధ్యత అప్పగిస్తారు. ఒకవేళ ప్రభుత్వ రంగ సంస్థే ఎల్1గా వస్తే రెండు యూనిట్ల బాధ్యతను అప్పగిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సేవలు కొనసాగించేలా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం ట్రస్టు ద్వారా రోగి చికిత్సకు ముందస్తు అనుమతి లభించేందుకు 24 గంటల వరకు సమయం పడుతోంది. ఆరోగ్య బీమా అమలులోకి వస్తే ఈ పరిస్థితి మారుతుంది.

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

>> రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్ని ప్రభుత్వ భూములు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎలా రిజిష్టర్ చేశారని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇది కాకుండా ఆకేపాటి ఎస్టేట్‌లో మరో 60ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో మొత్తం డాక్యుమెంట్లను అందజేశారు. అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియా దేవి, రాజంపేట తహసీల్దార్ పీర్ మున్నీ ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ ఫిర్యాదుపై అమర్‌నాథ్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు, ఫిర్యాదు దారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ నెల 17న అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జేసీ కోర్టులో హాజరు కావాలని నోటీసులు పంపారు. అంతేకాకుండా నోటీసులో ఆక్రమణలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రావాలని రాజంపేట తహసీల్దార్‌ను కూడ ఆదేశించారు. ఆక్రమిత భూములుగా ఫిర్యాదులో పేర్కొన్నందువల్ల అడంగల్, పాత ఫసలి 10(1) ఆర్ఓఆర్-1 రిజిష్టర్ 1బి రిజిష్టర్, ఎఫ్ఎంబీలు తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో పరస్పరం ఒకరికి ఒకరు విక్రయం చేసుకున్నట్లు డాక్యుమెంట్లను చూస్తే తెలుస్తోంది. ఈ వ్యవహారం రాజంపేట నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల్లో ఎస్టేట్ కట్టడం అందులో ప్రభుత్వ నిధులు పెద్దఎత్తున ఖర్చు చేసి రోడ్ల నిర్మాణం చేపట్టడం కూడ వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ కోర్టులో ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.



శుక్రవారం రాష్ట్రపతి ముర్మును కలిసిన ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలను కలిసిన ఢిల్లీ సీఎం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీనూతన ముఖ్యమంత్రిగాప్రమాణస్వీకారం చేసిన రేఖాగుప్తా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మునుమర్యాదపూర్వకంగా కలిసారు. అదేవిధంగా ఆమె ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా కలిసారు. ఇరువురు రాజ్యాంగ నేతలకు ఆమె పుష్పగుచ్ఛాలిచ్చి తనను తాను పరిచయం చేసుకన్నారు. ముందు రాష్ట్రపతిని కలిసిన రేఖాగుప్తా వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసారు. ఇద్దరితోను కొద్దిసేపు సీఎం ఇష్టాగోష్టి జరిపారు. ఈ ఫోటోలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి కార్యాలయాలు తమతమ సోషల్ మీడియాలో పోస్టు చేసాయి.

# మార్చి 5న గోదావరి బోర్డు సమావేశం

**విజయవాడ,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు 17వ సర్వసభ్య సమావేశం మార్చి 5న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలోగోదావరి బోర్డు చైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రెండు రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు దీనికి హాజరుకానున్నారు.

# చైనాలో మరో ప్రాణాంతకవైరస్

## హెచ్‌కెయు5-కోవ్-2గా గుర్తింపు



**బీజింగ్, ఫిబ్రవరి 21:** చైనాలో కొవిడ్ తరహాలోనే ఉన్న మరో కొత్తవైరస్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. జంతువులనుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈకొత్త వైరస్‌ను హెచ్‌కెయు5-కోవ్-2గా వెల్లడించారు. కొవిడ్19కి కారణమైన సార్స్‌కోవ్-2ను పోలి ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని హాంకాంగ్‌కుచెందిన సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టు తన కథనంలో ప్రస్తావించింది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేసి బ్యాట్ ఉమన్‌గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు ఝంగ్‌లీ ఈ పరిశోదన బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గ్యాంగ్‌ఝౌ ప్రయోగశాల, గ్యాంగ్‌ఝౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్,వుహాన్ యూనివర్సిటీతోపాటు వుహాన్ వైరాలజీ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రి సెల్‌జర్నల్‌లోసమీక్షకు పోస్టుచేసారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్(మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సింద్రోమ్) ఉపరకానికి చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది హెచ్‌కెయు5 కరోనా వైరస్‌సంతతికి చెందినదేనని, ఈవైరస్ తొఉలత హాంకాంగ్‌లోనిజపనీస్ పిపస్ట్రెల రకం గబ్బిలాల్లో గుర్తించినట్లు చైనా పరిశోధకులు వెల్ల డించారు. ఇపుడు చేస్తున్న అధ్యయనాల ప్రకారం హెచ్‌కెయు5-కోవ్-2 నేరుగా లేదా మాధ్యమ జీవుల సాయంతోమనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువని అన్నారు. అయితే కొవిడ్‌తోపోలిస్తే ఈవైరస్ సామర్థ్యం తక్కువేనని చెప్పారు.

# పవార్‌కు గ్లాసులో నీళ్లుపోసి అందించిన ప్రధానిమోడీ!




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న 98వ అఖిలభారత మరాఠి సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. విజ్ఞాన్‌భవన్ వేదికగా జరుగుతున్న సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్ పవార్‌నడుమ ఆసక్తికర సన్నివేశాలు జరిగాయి. పవార్‌కుర్చీలో కూర్చోడానికి మోడీసాయం చేయడంతోపాటు తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లునింపి పవార్‌కు అందించారు. దీనితో అక్కడున్నవారంతా చప్పట్లతో హర్షం వ్యక్తంచేసారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కూడా ఈకార్యక్రమంలోపాల్గొన్నారు. మరాఠి భాషకు కొన్నినెలలక్రితం కేంద్రం శాస్త్రీయభాషా హోదా కల్పించింది. ఈ క్రమంలోసుమారు 71 ఏళ్లతర్వాతఢిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సునిర్వహించారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో మరాఠా సదస్సును నిర్వ హించారు. పవార్ ఈ సందర్భంగా మోడీని ప్రశం సించారు. కార్యక్రమానికి ఆహ్వానిస్తే కాదనకుండా అంగీకరించారన్నారు.మరాఠికి ఉన్నతభాష హోదా ఇవ్వడంతో ప్రధానిమోడీ పాత్ర కీలకం అన్నారు. తనప్రసంగంముగించి వచ్చి కుర్చీలో కూర్చునే క్రమంలో ఈ అరుదైన సందర్భాలు కనిపించాయి.

# ప్రభుత్వాన్నే కూల్చేసినోణ్ణి... నన్ను తేలిగ్గా తీసుకోవద్దు: షిండే హెచ్చరికలు

**ముంబయి, ఫిబ్రవరి 21:** మహారాష్ట్రలోని అధికార మహాయుతికూటమిలో విభేదాలు తీవ్రం అయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే కీలక వ్యాఖ్యలు మరోసారి దుమారంరేపాయి. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. సీఎం దేవేంద్రఫడ్నవిస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న షిండే 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా ప్రస్తావించారు. షిండే హయాంలో ఆమోదించిన ఒకప్రాజెక్టునుప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో సేవసేన నేత పైవ్యాఖ్యలుచేసారు. నేను ఒక సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతిఒక్కరూ అర్థంచేసుకోవాలి.

2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నపుడు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా అని మీడియాతోనే ఏక్‌నాథ్‌షిండేఅన్నారు. తర్వాత విధానసభలోచేసిన మొదటిప్రసంగంలో ఫడ్నవిస్‌కు 200 కంటే ఎక్కువసీట్లు వస్తాయని చెప్పానని 232 సీట్లువచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని ఇది ఎవరిని ఉద్దేశించి చెపుతున్నాననో వారు అర్థంచేసుకుంటారని భావిస్తున్నట్లు షిండే అన్నారు. సీఎం ఫడ్నవిస్ సమావేశాలకు షిండే హాజరుకాకపోవడం, షిండేవర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడం, సచివాలయంలో వైద్యసహాయ కేంద్రాలు ఇద్దరు వేరువేరుగా ఏర్పాటుచేసుకోవడం వంటి సంఘటనలు వీరిమధ్య దూరాన్ని పెంచాయని తెలుస్తోంది. అభివృద్ధిని అడ్డుకునేవారితో నాపోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 22-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
నవమి మ.1.20
జ్యేష్ఠ సా.5.39
వర్జ్యం : రా.2.00-3.40
దు.ఉ.6.39 - 8.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఖర్చులు అధికమవుతాయి.

**కర్కాటకం:** సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుకొంటారు. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కన్య :** కొత్త వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఔషధ సేవనం. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు చాలా అవసరం.

**తుల :** శ్రమాధికం. బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**వృశ్చికం:** సోదరుల నుండి కొన్ని విషయాలు తెలుసుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. అనుకోని విధంగా ఖర్చులు ఎదురవుతాయి.

**మకరం:** ఉద్యోగాలలో ఆకస్మిక బదిలీలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** రుణబాధలు తీరి ఊరట చెందుతారు. మిత్రులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలుగుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మిర్చి రైతులను ఆదుకోవాలని కోరాం

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

### మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలి, మిర్చి ఎగుమతులపైనా చర్చ



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తితో ఏపీ మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతెలిపారు. శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన రామ్మోహన్ నాయుడు అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిర్చికి రూ.11,600 కు పైగా ధర ఇవ్వాలని కోరామన్నారు. మిర్చి ఎగుమతులపైనా చర్చిం చామన్నారు. ఎగుమతి దారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కల్పించి ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరగా, సమస్య చెప్పిన వెంటనే శివరాజ్‌సింగ్ స్పందించారని తెలిపారు. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుల మధ్య వ్యత్యాసం ఇస్తామని చెప్పారన్నారు. మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.మిర్చి ఉత్పత్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం లెక్కిస్తే రూ. 11,600 వచ్చిందని.. అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు మిర్చి ఎగుమతులు జరగడం లేదన్నారు. మిర్చి ఎగుమతులు పెంచడం గురించి కూడా ఇవాళ్టి సమావేశంలో చర్చించామన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతులు, ఎగుమతిదారులతో సదస్సు పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సదస్సు ద్వారా వచ్చిన సలహాలు, సూచనల ఆధారంగా మిర్చి ఎగుమతులు పెంచడంపై దృష్టి పెడతామన్నారు. మిర్చి రైతుల ఆదాయం ఎలా పెంచాలన్నదే అందరం ఆలోచిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు నేరుగా ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెచ్చారన్నారు. రైతుల కష్టం తెలిసిన వ్యక్తి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అని నిన్న ఢిల్లీలో లేనప్పటికీ మధ్యప్రదేశ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ సీఎంతో మాట్లాడారని తెలిపారు. ఈరోజు ఢిల్లీ వచ్చిన వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారన్నారు. మార్కెట్ రేటుకు, రైతుల పెట్టుబడి వ్యయానికి మధ్య ఉన్న గ్యాప్‌ను కేంద్రం నుంచి నిధులు తెచ్చి ఆదుకోవాలని చూస్తున్నామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని రూ. 11,600 కంటే ఎక్కువగా నిర్ణయించాలని ఐసీఏఆర్‌ను కోరినట్లు చెప్పారు. మిర్చి ఎక్స్‌పోర్ట్స్ గతంలో జరిగినట్లు ఇప్పుడు జరగడం లేదని అన్నారు. మిర్చి పంట సేకరణను అత్యవసరంగా చేయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీం కింద 75 వరకు పొడిగిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఏపీలో మిర్చికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద క్వింటాల్‌కు రూ.11600 లేదా ఉత్పత్తి వ్యయం జోడించి రూ.12,000 పైచిలుకు ధరను అందించాలని అడిగామన్నారు. ధర విషయంలో ఐసీఏఆర్ అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలిచ్చారని.. ఎగుమతులను స్థిరీకరించే అంశంపైన సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. ఎగుమతుల సమస్యను పరిష్కరిం చడానికి ఎగుమతి దారులతో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మిర్చి రైతుల విషయంలో వీలైనంత త్వరగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# భారతీయ భాషలమధ్య శతృత్వం లేనేలేదు: మరాఠీ సాహిత్యసమ్మేళన్‌లో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** జాతీయ విద్యావిధానం కింద హిందీని బలవంతంగారుద్దేప్రయత్నం జరుగుతున్నదంటూ తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య మాటలయుద్ధంజరుగుతున్న క్రమంలోప్రధానమంత్రి నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేసారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠి సాహిత్య సమ్మేళన్‌లోప్రధాని మాట్లాడుతూ భారత భాషలమధ్య ఎప్పుడూ శతృత్వంలేదని స్పష్టంచేసారు. భారతీయ భాషలన్నీ ఒకదానికకటి సుసంపన్నం చేసుకున్నాయి. భాషాప్రతిపదికగా విభజనలు తెచ్చేప్రయత్నాలు జరిగినా భారత దేశ ఉమ్మడిభాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చింది. ఇలాంటి అపోహలకు దూరంగా ఉంటూ అన్నిభాషల సమున్నతికి పాటుపడటం ఒక సామాజిక బాధ్యతగా మనం గుర్తించాలని ఆదిశగానే ఈరోజు మరాఠి భాషతోసహా దేశంలోని అన్నిప్రధానభాషల్లోను మనం విద్యను ప్రమోట్‌చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. మహారాష్ట్ర యువత మరాఠీలోనే ఉన్నతవిద్య, ఇంజనీరింగ్, వైద్య విద్యలు చదువుతున్నారరన్నారు లిటరేచర్ అనేది సమాజానికి అద్దంలాంటిదని సమాజానికి ఒక నిర్దేశకత్వంచూపుతుందని వివరించారు. లిటరరీ సదస్సులు సంస్థలు ఈదిశగా కీలకపాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. భారతదేశంప్రపంచంలోని అతిపెద్ద భాషా వైవిధ్యం కలిగి ఉందని భాషా వైవిధ్యం మన ఐక్యతకు ప్రాథ మిక ఆధారమని మోడీ అన్నారు. జాతీయ విద్యావిధానంతో త్రిభాషా సూత్రాన్ని విధించేప్ర యత్నంలో తమపై హిందీని రుదే ప్రయత్నం చేస్తున్నారంటూ తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, డిప్యూటి సిఎం ఉదయనిధి విమర్శ లుచేస్తున్న క్రమంలో ప్రధాని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# పూర్తిస్థాయిలో ఖర్చుకాని ఎస్‌ఎస్‌ఎ నిధులు

### గత ఏడాది రూ. 1913 కోట్లకి పీఏబీ ఆమోదం

### ఈ ఏడాది రూ. 1600 కోట్లకే ప్రతిపాదనలు పంపాలని సూచన

### తెలంగాణలో పూర్తిస్థాయిలో ఖర్చు చేయక పోవడంతోనే ప్రతిపాదనల తగ్గింపు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పాఠశాల విద్య శాఖలో అమలవుతున్న సమగ్ర శిక్ష పథకం కింద కేంద్రం ఇస్తున్న నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టకపోవడంతో.. ఈ ఏడాది కేటాయించాల్సిన నిధుల్లో కోత పెట్టినట్టు తెలుస్తోంది. గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఏ కింద రాష్ట్రానికి రూ.2347.50 కోట్లు కావాలని పాఠశాల విద్య కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనలను పరిశీలించిన అందులో రూ. 1913 కోట్లకు ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు(పీఏబీ)లో కేంద్రం ఆమోదం తెలిపింది. అందులో రూ. 1148.34 కోట్లు కేంద్రం వాటా కాగా.. రాష్ట్ర వాటా రూ. 765.56 కోట్లుగా పేర్కొంది. అయితే పీఏబీలో కేంద్రం ఆమోదం తెలిపిన మొత్తాన్ని కూడా రాష్ట్రంలో ఖర్చు చేయకపోవడంతో.. ఈ ఏడాది రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులకి సంబంధించి రూ. 1600 కోట్ల వరకే ప్రతిపాదనలను సమర్పించాలని కేంద్రం సూచించినట్టు తెలుస్తోంది. అందుకే గతేడాది పీఏబీ ఆమోదించిన బడ్జెట్ కంటే ఈ ఏడాది ప్రతిపాదనల్లోనే కోత పెట్టినట్టు తెలుస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్ఎస్ఏ పథకాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో పథకానికి సంబంధించిన నిధులను కేంద్రం మంజూరు చేస్తూ ఉంటుంది. ఈ పథకంలో కేంద్రం 60 వాటా శాతం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ప్రధానంగా పాఠశాల విద్యలో మౌలికవసతుల కల్పన, నాణ్యమైన బోధనకు వీలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా నిధులను ఖర్చు చేస్తారు. కేజీబీవీలు, టీచర్ల ట్రైనింగ్స్, యూనిఫారాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు సహా మౌలిక వసతుల కోసం ఈ పథకం ద్వారా నిధులను ఖర్చుచేస్తారు. 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్రానికి పీఏబీ రూ. 1,913కోట్లకు ఆమోదం లభించింది. అందులో కేంద్రం వాటా రూ. 1,148.34 కోట్లు కాగా.. రాష్ట్రవాటా రూ. 765.56కోట్లు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులను నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో విడుదల చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం సైతం నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో నిధులను కలిపి విడుదల చేస్తుంది. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కేంద్రం మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. వాటిలో రెండు ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ కింద కేంద్రం రూ. 242 కోట్లను విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 161 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటికీ విడుదల చేయనట్టు తెలిసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు ఖర్చు కాకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు రావడం ప్రశ్నార్థకంగా మారాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెల మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు నాన్ రికరింగ్ నిధుల విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఇచ్చిన నిధులు ఖర్చుచేయకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధుల విడుదలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరంలో పీఏబీలో రూ. 300కోట్లకు కోతపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పీఏబీ సమావేశాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

22-02Pg3exHMNWJQELR.qxd:22-02Pg3exHMNWJQELR.qxd 01/01/01 10:23 AM Page 1



# పిఎంజెవికె కింద రాష్ట్రానికి రూ.600 కోట్లు కేటాయించండి

## కేంద్రానికి రాష్ట్ర మైనార్టీసంక్షేమశాఖ మంత్రి ఫరూక్ లేఖ

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మైనారిటీల సామాజిక ఆర్థిక పరస్థితులను మెరుగుపరచడానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్ కు కేంద్రం వాటాగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.600 కోట్లు కేటాయించాలని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు గురువారం లేఖ రాశారు. 2025-26 లో ఈ పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు నివేదించాం. ఈ పథకం కింద రాష్ట్రవాటా రూ.400 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్రం వాటాగా రూ.600 కోట్లు కేటాయించాలి అని లేఖలో పేర్కొన్నారు . అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూముల స్వాధీనానికి ప్రణాళికాబద్దంగా ముందుకు వెళుతున్నట్లు ఫరూక్ వెల్లడించారు. ఇక మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ లో మంత్రి ఫరూక్ ను వక్ఫ్ బోర్డు సభ్యులు డాక్టర్ ఆఫీయా, షేక్ ఖాజా తో పాటు పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు కు సంబంధించిన పలు అంశాలు, వక్ఫ్ బోర్డు ద్వారా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి బోర్డు సభ్యులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించుకోవడం పై ఒక ప్రణాళికబద్ధమైన కార్యాచరణ సిద్ధం చేసి మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చర్యలు చేపట్టడం జరుగుతున్నదని మంత్రి అన్నారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. 20252026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వబోతున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. రంజాన్ మాసం లో ప్రత్యేక వసతులు కల్పించాలనికోరిన ఎంహెచ్ పిఎస్‌రంజాన్ మాసంలో మసీదులు, ఈద్గాలు, దర్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఎంహెచ్ పిఎస్ నాయకులు కోరారు మంత్రి పేషీ లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ తదితరులు మంత్రిని కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలని, టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని మసీదులకు మరమ్మత్తుల కొరకు ప్రతి ఏటా ఇచ్చే రూ.25వేలు మంజూరు చెయ్యాలని, శిక్ష అనుభవిస్తున్న ముస్లిం ఖైదీలకు సహరీ, ఇఫ్తార్ ఏర్పాటు కొరకు జైళ్ల శాఖకు ఆదేశించాలని, ప్రభుత్వం తరపున రంజాన్ ఉత్సవాలు (జష్నే రంజాన్) నిర్వహించాలని కోరారు. వచ్చే బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.3296 కోట్లు మంజూరు చెయ్యాలని మంత్రిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ ఉలేమా వింగ్ అధ్యక్షులు మోలానా అబ్దుల్ రషీద్, నాయకులు సగీర్, ఖాజా, అర్షద్, భాష తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవిత సమక్షంలోఎస్పీఏవీతో ఏపీహెచ్డీసీ ఒప్పందం

# సాంస్కృతిక వారసత్వాలకు చిహ్నంగా లేపాక్షి : మంత్రి సవిత

> సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణాలు
>
> రాష్ట్ర వ్యాప్తంగా అన్ని షోరూమ్‌ల్లోనూ మరమ్మతులు
>
> ఎస్పీఎవితో ఎపి హెచ్‌డిసి ఒప్పందం, మంత్రి సమక్షంలో ఎంవోయూపై సంతకాలు

**విజయవాడ.ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదనం, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపట్టేలా లేపాక్షి నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత సమక్షంలో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ శుక్రవారం ఎం వోయూపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ఉట్టిపట్టేలా ఆకర్షణీయంగా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న లేపాక్షి షోరూమ్‌లకు మరమ్మ తులు చేపట్టి, ఆకర్షణీయమైన ఆకృతుల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. షో రూమ్ ల బయట, లోపల కూడా మరమ్మతులు చేపట్టనున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేలా షోరూమ్ లను రూపొందించడం వల్ల వివిధ కళా రూపాల అమ్మకాలు పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో ఏపీలోని పలు ప్రాంతాల సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవిత సమక్షంలో ఎంవో యూపై ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ ఎంవో యూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మూడేళ్లు అమలులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్డీసీ, ఎస్పీఏవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్‌భవన్‌లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం ఆవిర్భావ వేడుకలు



అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతాలు వారిగా అభిరుచులు, సాధారణ జీవన విధానంలో భిన్నంగా ఉన్నట్లు కన్పించిన భారతీయ సాంస్కృతిక వికాసం ఏకత్వాన్ని ప్రబోదిస్తుందని ఏపీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. కళలు, వివిధ సాంస్కృతిక జీవన ప్రక్రియలు పురాతన నాగరిక జీవన విధానాన్ని తెలియ జేస్తాయన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకలను విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. అరుణాచల్‌ప్రదేశ్ సూర్యుడు ఉదయించు భూమిగా పర్వతాలు సరస్సులు సంస్కృతికి ప్రసిద్ధి. బహుభాషా గిరిజన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. 1987 లో రాష్ట్ర హోదా పొందిన మిజోరాంలో ప్రజలు తమ సంస్కృతి, విలువలను కాపాడుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు అని గవర్నర్ పేర్కొన్నారు. ఇవి మన భారతీయ సాంస్కృతిక, సహజీవన విధానాలకు నిర్వచనాలుగా నిలిచే ప్రదేశాలన్నారు. విజయవాడలో చదువు కుంటున్న ఆ రాష్ట్రాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

# మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు,పటిష్టమైన పాలనకు 30సూత్రాల అజెండా

## - సిఎం ఆలోచనల మేరకు రూపొందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**సచివాలయం,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు, వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణ, పరిపాలనను పటిష్ఠం చేసే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ 30అంశాలతో కూడిన ఏజెండాను రూపొందించారు. ఆయా అంశాలపై నిర్ధిష్ట కాలపరిమితుల మేరకు నిరంతరం ప్రయాస, పనితీరు, ఫలితాల సమీక్షలుజరపాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును మంత్రి ఆదేశించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆరోగ్యశాఖకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వివిధ సమీక్షా సమావేశాల్లో ఇచ్చిన ఆదేశాలు, ఆలోచనలు, వైద్యసేవలు, మంత్రిత్వ శాఖ పనితీరుపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌చేసిన సమీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా మంత్రి ఈ ఎజెండాను రూపొందించారు. ఆరోగ్యరంగానికి సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ పత్రంలోని లక్ష్యాల్ని, మార్గాల్ని ప్రజలకు తెలిపి లక్ష్య సాధన ప్రయత్నంలో సంబంధిత అందర్నీ భాగస్వాములను చేయడం. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు త్వరిత గతిన నిర్ణయాల్ని తీసుకునేందుకు అవసరమైన వికేంద్రీకరణ వైద్యసేవల్లో కృత్రియ మేథ పూర్తి వినియోగ అవకాశాల్ని గుర్తించి ఆ మేరకు చర్యల్ని చేపట్టడం డిజిటల వైద్యసేవల్ని విస్తృతం చేయడం. వైద్యులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వ సాయాన్ని రాబట్టడం. వివిధ విభాగాధిపతులు, వైద్యులు, అధికారుల పనితీరును నిష్పక్షపాతంగా ఫలితాల ప్రాతిపదికన మదింపుచేయడం వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం కోసం పటిష్టచర్యలు, పర్యవేక్షణ అవినీతిని అరికట్టడానికి పటిష్ట చర్యలు, విభాగాధిపతులు, వివిధ పథకాల నోడల్ అధికారులు పథకాల అమలు, పనితీరుపై నెలవారీ నివేదికల్ని అందించడం వాటిని సమీక్షించడం. ప్రజల్లో సరైన శుభ్రత, ఆరోగ్యపు అలవాట్లను పెంచడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం. రాష్ట్రం, దేశ విదేశాల్లో ఆరోగ్య సేవలు తీరును మదింపు చేసి సేవల నాణ్యత, తీరు పెంచడానికి మంత్రిత్వ శాఖకు సలహాలిచ్చేందుకు వైద్య, ఆరోగ్య రంగ నిష్ణాతులతో సలహా/సంప్రదింపుల కమిటీ ఏర్పాటు. ఆగష్టు నెలలో విడుదల చేసిన 30సూత్రాల ప్రణాళిక మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రగతిని నిరంతరం సమీక్షించడం అన్ని (175) అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్పెషాలిటి ఆస్పత్రుల ఏర్పాటు, హైబ్రిడ్ విధానంలో రూ.25లక్షల బీమాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా త్వరలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

# మినుము సాగుపై దృష్టి పెట్టాలి

## వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మినుము సాగు, ఉత్పత్తి పెంపుపై ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఏడు జిల్లాలకు సంబంధించి గురువారం విజయవాడలో జరిగిన జాతీయ ఆహార పోషక భద్రత మిషన్ సదస్సులో మాట్లాడారు. అధిక దిగుబడినిచ్చే వంగడాల రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

# యువ శాస్త్రవేత్తల కోసం యువికా 2025కు ఆహ్వానం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో యువ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది కూడా యువికా కార్యక్రమం ప్రారంభిస్తోంది. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం యువికా 2025 కోసం ఉత్సాహవంతులైన యువతీ యువకులను ఇస్రో దరఖాస్తులు చేసుకోవాలని ఆహ్వానించింది. ఈ నెల 24 నుంచి మార్చి 23 దాకా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇస్రో ప్రకటించింది. ఈ కార్యక్రమంలో అంతరిక్ష విజ్ఞానంపై యువతీ యువకులకు శిక్షణ ఇస్తారు. రెండురోజులు పాటు రెసిడెన్షియల్ ప్రోగ్రాం కూడా ఉంటుంది. దేశంలోని కొన్ని ఇస్రో ప్రధాన కార్యాలయాల్లో కూడా ఎంపిక చేయబడిన విద్యార్థుల పర్యటన ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ఆన్‌లైన్ వివరాలు కూడా ఇస్రో పేర్కొంది. గతంలో కూడా యువికా కార్యక్రమం కింద అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులు వెలుగులోకి వచ్చారు. ఈసారి ఈ అవకాశాన్ని ముఖ్యంగా స్టుడెంట్లు సద్వినియోగం చేసుకోవాలని ఇస్రో శాస్త్రవేత్తలు పిలుపు నిచ్చారు.

# మాజీ సిఎం వైఎస్ జగన్‌కు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి

## - ప్రధానికి వైఎస్సార్సీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వైయస్సార్సీపీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ రాసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని లేఖల్లో విజ్ఞప్తిచేసారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్ పర్యటనలు సందర్భంలో ఎటువంటి భద్రత కల్పించడం లేదన్నారు. జగన్ పర్యటనలో తీవ్రమైన భద్రత వైఫల్యం తలెత్తింది. జెడ్ ప్లస్ సెక్యూరిటీ కేటగిరి లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు వెంటనే కేంద్ర బలగాలతో రక్షణ కల్పించండి, ఇటీవల వైఎస్ జగన్ నివాసం వద్ద కొన్ని ఘటనలు జరిగాయి .ఇవి భారీ ఎత్తున పన్నిన కుట్రలో భాగంగా జరుగుతున్న ఘటనలు. వైఎస్ జగన్ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా భద్రత వైఫల్యం కనిపిస్తోంది కూటమి ప్రభుత్వం విధానాల వల్ల మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. ప్రజాస్వామ్య విధానాలకు తూట్లు పొడిచేలా ప్రమాదకర ధోరణికి తెరలేపుతోందన్నారు. ప్రభుత్వం ఉద్దేశం పూర్వకంగా జగన్ విషయంలో సున్నిత పరిస్థితులను సృష్టించడం ద్వారా ఆయనకు ఇబ్బంది కలిగించాలని చూస్తోందని మిథున్‌రెడ్డి తన లేఖలో స్పష్టంచేసారు. జగన్‌కు భద్రతను పెంచాలని కోరారు.

# రైళ్లలో నేరాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం

## - క్రైమ్ సమీక్షా సమావేశంలో రైల్వే ఐజీ మోహన్‌రావు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఐజీ మోహన్‌రావు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 21,ప్రభాతవార** రైళ్లలో ప్రయాణికుల రక్షణ, భద్రతాలకై ప్రతిఒక్కరు సమన్వయంతో కలిసి పనిచేయాలని రైల్వే ఐజీ మోహన్‌రావు అన్నారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు దక్షిణ మద్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో నిర్వహించిన రైల్వే అంతర్ రాష్ట్ర జీఆర్‌పి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా, డిఎస్ఆర్‌పి హర్షిత, మురళీధర్‌లతో కలిసి డివిజన్ పరిధిలో క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదికను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో పెరిగే రైళ్ల, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌పిఎఫ్, డివిజన్ పరిధిలోని కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలోని జీఆర్‌పి పోలీసు అధికారులతో ఆయా రాష్ట్రాలలో జరిగే నేరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా రాష్ట్రాల జీఆర్‌పి, రైల్వే రక్షక దళంతో కలిసి నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, రామాంజనేయులు, అశోక్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి, మౌలా, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, రైల్వే ఎస్‌పి కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో జీఆర్‌పి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను ఎపికి బదలీచేయండి

## - అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నై ఎగ్మూర్ మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను రాజధాని అమరావతికి బదిలీ చేయాలంటూ అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ఈ మేరకు విజ్ఞప్తి లేఖను ఈమెయిల్ ద్వారా తమిళనాడు సీఎంకు పంపారు. 1797లో బ్రిటిషు ప్రభుత్వ పురావస్తుశాఖ గుంటూరు జిల్లాలోని అమరావతి, దాని సమీప ప్రాంతాల నుంచి 400కు పైగా పురాతన చిహ్నాలు, రాజవంశాలకు చెందిన శిల్పాలను వెలికి తీసింది. వాటిని ఎగ్మూర్ మ్యూజియంలో భద్రపరిచింది. ఇప్పుడు అమరావతిలో సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించడానికి, పురాతన ప్రాంతీయ సంస్కృతిని భావితరాలకు అందించడానికి కృషి జరుగుతోంది. ఆ పురాతన సంపదను అమరావతికి బదిలీ చేయడానికి అనుమతించాలి అని ఆ లేఖలో కోరారు.

# ఎపి విజ్ఞప్తితో కేఆర్ఎంబి ప్రత్యేక సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్‌లో జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.

# ధ్వజారోహణంతో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)** పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తుడు కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఏర్పాట్లకు సంబంధించి స్థానిక శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గతంలో కన్నా భిన్నంగా భక్తుల మనోభావాలకు అనుగుణంగా విజయవంతంగా నిర్వహించుటకు విధి నిర్వహణకు కొత్త అయినా ఇఒ ఏర్పాట్లు సమీక్షించారు.. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను బడ్జెట్‌తో ముడిపెట్టక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాట్లును చేపట్టారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మహాశివరాత్రి రోజు భక్తులకు సుదర్శనంతో సంతృప్తి పరచుటకు చర్యలు తీసుకుంటామని ఇఒ వివరించారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా బ్రహ్మోత్సవాలు అంటే పది రోజుల పాటు నిర్వహించటం జరుగుతోందని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించటం సంప్రదాయమని వివరించారు. మొదటి ఉత్సవాన్ని భక్తజన వల్లభుడు భోళాశంకరుడు వాయులింగేశ్వరుడు 'భక్తకన్నప్ప' ధ్వజారోహణానికి ఇవ్వటం గమనించదగ్గ విషయం అన్నారు. స్థానిక నాయకులు, భక్తుల సూచనల మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. గత ఏడాది లక్ష మంది భక్తులు వచ్చినట్లు అంచనా కట్టారని ఈ ఏడాది రెండులక్షలు పైగా వస్తారని అంచనా వేసి ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు సాదాసీదాగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి.



ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఐదు వేల మంది భక్తులకు అన్నదానంలో అవకాశం కల్పించుటకు చర్యలు తీసుకున్నామని శివరాత్రి జనజాగరణ రోజు పదివేల మందికి అన్నదానం నిర్వహించుటకు ఏర్పాట్లు చేసామన్నారు. వచ్చే యాత్రికులకు బస సదుపాయం కల్పించామన్నారు. వారికి కనీస సదుపాయాలు చేపట్టామన్నారు. తాత్కాలిక స్నానఘట్టాలను సువర్ణముఖి నదిలో ఏర్పాటు చేసామన్నారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఉత్సవాల్ని ఎలాంటి వివాదాలు, విమర్శలకు అవకాశం లేకుండా నిర్వహించుటకు అందరు సహకరించాలన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ జరిగింది. మొదటి పూజలు భోళాశంకరుడు తన భక్తుడు తిన్నడు అనే భక్తకన్నప్పకు ప్రసాదించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం భక్తకన్నప్ప కొండపై శాస్త్రోక్తంగా పూజలుజరిపి ధ్వజారోహణ కార్యక్రమాల్ని జరిపారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసి కొండపైకి తీసుకెళ్ళారు. అక్కడి ఆలయం వద్ద ప్రతిష్టించి ఆలయప్రధానార్చకులు డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్ గురుకుల్ కలశస్థాపన చేయగా వేదపండితులు వేదమంత్రాల్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం ధ్వజస్థంభంపై వస్త్రాన్ని అధిరోహించారు. ఈ కార్యక్రమాల్లో హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు చేస్తూ ధ్వజారోహణ జరిపారు. ఈ పూజలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం భక్తకన్నప్పను పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుని మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కోలా.ఆనంద్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, మల్లీశ్వరమ్మ, సుమతి, ఆలయ ఇఒ బాపిరెడ్డి, డెప్యూటీ ఈఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్, ప్రోటోకాల్ ఇన్‌చార్జి నాగభూషణం, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, అభిషేక గురుకుల్ వరదగురుకుల్, పారోహితులు అర్ధగిరిలు పర్యవేక్షించారు. తదితరులు హాజరయ్యారు. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

# జోన్ల వారీగా మధ్యాహ్న భోజనం కొత్త మెనూ అమలు

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజనం కొత్త మెనూను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పథకం అమలు కోసంనాలుగు జోన్ల వారీగా దీన్ని రూపొందించారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక వంటలు విద్యార్థుల అభిరుచులు, పోషకాలను పరిగణనలోకి తీసుకొని కొత్త మెనూను విద్యాశాఖ రూపొందించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనం మెనూ మార్చేందుకు వంట ఏజెన్సీలతో రాష్ట్ర స్థాయి కార్యాశాల నిర్వహించింది. విద్యార్థులు ఆసక్తిగా తినేలా, పోషకాలు ఉన్న మెనూ ఎంపిక చేసింది. దీన్ని ఈ విద్యా సంవత్సరం ముగింపు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని విద్యాశాఖ సూచించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు జోన్ 1 లో ఉండగా కాకినాడు తూర్పుగోదావరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు పశ్చిమగోదావరి కృష్ణా , ఎన్టీఆర్ జిల్లాలు జోన్ 2 గా పేర్కొంది. గుంటూరు పల్నాడు బాపట్ల ప్రకాశం, నెల్లూరు జోన్ 3 లో ఉండగా రాయలసీమలోని జిల్లాలు నాలుగో జోన్‌లో ఉన్నాయి.

# వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పు వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పును విజయవాడ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు వాయిదా వేసింది, సోమవారం తీర్పు వెలువరించనున్న ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు. వంశీ బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ వాయిదా పడింది. ఈ కేసుల్లో కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు గడువు కోరడంతో విచారణ మంగళవారానికి వాయిదా వేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు. గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కేసులో ఒక వ్యక్తిని వంశీ కిడ్నాప్ చేసిన బ్లాక్‌మెయిల్ చేసారన్నది ఆరోపణ. ఈ కేసులో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసారు. మరి కొన్ని సెక్షన్లు ఆపాదించారు. ఈ కేసులో అరెస్టయి విజయవాడ సబ్‌జైల్‌లో వంశీ ఉన్నారు. తన అనారోగ్య కారణంగా జైలులో మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోర్టులో ఫిర్యాదు చేసారు. వంశీని 10 రోజుల కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసారు.

# లోకాయుక్త ఆదేశాలతో వైద్యులను తొలగించిన రాష్ట్రప్రభుత్వం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 55 మంది ప్రభుత్వ వైద్యులనువిధుల నుంచి తొలగించింది అదేశాలతో విధులకు డుమ్మా కొట్టిన వైద్యులనుప్రభుత్వం టెర్మినేట్ చేసింది. లోకాయుక్తకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక పంపింది. తొలగింపునకు గురైన వైద్యుల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మాజీ సర్పంచ్ జంపన శ్రీనివాస్ గౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి, సెలవు లేకుండా ఏడాదికి పైగా వైద్యులు గైర్హాజరవుతున్నారని, వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. దాంతో లోకాయుత ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై తక్షణం స్పందించాలని, సంబంధిత నివేదికను పంపించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలల్లో భాగంగానే ఎస్వీ మెడికల్ కళాశాలలో 9 మంది వైద్యులు తొలగించారు. ఎం. వెంకట రావు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్,. వి.సరస్వతి. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, బి.కిరణ్ కుమార్. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, కె. మధురిమ నాయుడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్,. పి .నలిని. అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్, బి. చంద్రశేఖర్. అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలజీ, కె .లావణ్య. అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్. ఏ. కార్తీక్.అసిస్టెంట్ ప్రొఫెసర్ రేడియో డయాగ్నసిస్.ఈ. శ్రీకాంత్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కార్డియాలజీలను ప్రభుత్వం ఉద్యోగాలనుంచి తీసివేసింది.

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

-జార్జి ఎలియట్

# వణకుతున్న ఊళ్లు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు...' చోటును ఎంపిక చేసుకొని ఉండమన్నారు సుమతీశతకకారుడు. వేసవికాలం వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యం, ముందుచూపు లేకపోవడం, ప్రకృతి సహాయనిరాకరణ తోడుకావడంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు గుక్కెడు మంచినీటికి పడరాని పాట్లుపడక తప్పడం లేదు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు.దాదాపు ముప్పై ఆరు రకాల రోగాలు కేవలం జలకాలుష్యం వల్లనే వస్తున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు మంచినీటి సమస్య దేశవ్యాప్తంగానే తీవ్రంగా ఉన్నట్లు చొప్పొచ్చు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అది సాధించాం, ఇది సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీసం అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని మంచినీటి కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని చెప్పడం లేదు.గత ఏడున్నర దశాబ్దాల్లో కేవలం మంచినీటి కోసమే లక్షలాది కోట్లు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు పనిచేస్తూనే ఉన్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధులు ఏమేరకు కిందిస్థాయికి వెళ్లి ప్రజల అవసరాలు తీరుస్తున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అన్నింటిలో మంచినీటి సమస్య తీవ్రంగానే ఉంటుంది. బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. యేటా తెలుగు రాష్ట్రాల్లోనే పరిశీలించినా వేలాది బోరుబావులు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. భూగర్భజలాల వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. అదే స్థాయిలో నీటి వృధాకూడా పెరుగుతున్నది. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఉచిత విద్యుత్ కూడా ఈ నీటి వృధాను పెంచుతున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల నీటి మట్టాలు పడిపోతున్నాయి. తెలంగాణలో ఇంకా ఎండాకాలం మొదలుకాకుండానే నీటి మట్టాలు భారీగా తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. డిసెంబరులో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర భూగర్భ సగటు జలమట్టం జనవరిలో 7.46 లోతుకు తగ్గిపోయింది. ఈ స్థాయిలో ఇప్పుడే భూగర్భజలాలు అడుగంటితే ఏప్రిల్, మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులతోపాటు సామాన్య ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా ఈసారి భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పంటల దిగుబడిపై ఆ ప్రభావం పడుతుందనివ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో యేటా దాదాపు 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏవో నామమాత్రపు నిబంధనలున్నా పట్టించుకోకపోవడంతో వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. వాస్తవంగా దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులు అవసరానికి మించి భూగర్భజలాలు వాడుతున్నారు. బోరుబావుల సంఖ్య యాభైయేళ్లలో 120 రెట్లకుపైగా పెరిగి దాదాపు మూడున్నర కోట్లకు పైగా బోరుబావులు చేరుకున్నాయి. దీంతో సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులు కొంతమేరకు లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి పెరిగితే ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. దేశంలో భూగర్భజలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం అధికంగా భూగర్భ జలాలు వాడుకుంటున్నట్లు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో యేటా యాభైనాలుగు లక్షలకోట్ల లీటర్లకుపైగా భూగర్భ జలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం ఏనాడో ప్రకటించింది. పాతాళంలోకి దిగ జారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వినియోగం పెరిగిపోతుంది. మంచి నీటికొరతను ఆసరాగా చేసుకొని కొందరు దళారులు మంచినీటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా నీటి వ్యాపారం వేల కోట్లల్లోకి చేరుకున్నది. వేసవి వస్తున్నదంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాలు ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలే కాదు శివారు పల్లెలకు కూడా నీటివ్యాపారం విస్తరించింది. ఏ కోణంలో చూసినా మంచినీటి పరిస్థితి రానురాను ప్రశ్నార్థకంగా మారుతున్నది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏమాత్రం క్షేమం కాదు. మరొక పక్క కోట్లాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీటిని దేశంలో వివిధ నదుల ద్వారా పొంగి పొర్లి సముద్రం పాలవుతున్నది. ప్రజల్లో అవగాహన లోపించడం ఫలితంగానే భూగర్భజలాల సమస్య రానురాను తీవ్ర రూపం దాలుస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా నేతలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి.

క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండువైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.



ఇ. గిబ్బన్

నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్న వాడిగా ఎప్పుడూ వ్యవహరించకు.



విలియం రోజర్

## ప్రజావాక్కు



### ఉరుము ఉరిమి ఉక్రెయిన్ మీద పడింది

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రాకతో ప్రపంచ దేశాల భౌగోళిక రాజకీయ సంబంధాలు పెద్ద కుదుపుకి లోనవుతున్నాయి.ఒక్కోచోట పిడుగులు, ఒక్కోచోట కుంభవృష్టి. అమెరికాతన ప్రయోజనాల్ని సాధించుకోడానికి ఏ దిశగా, ఎంత వేగంగా ప్రయత్నిస్తుందో చెప్పడం కష్టమోతుంది. తాజాగా ఆ దేశం వ్యూహం రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. అదీ తను ఇందాకా పక్షంవహించిన ఉక్రెయిన్ ఆశలకు విరుద్ధంగా.రష్యా, ఉక్రెయిన్ నడుమ యుద్ధం మూడేళ్లుగా కొనసాగుతోంది. బలమైన రష్యాతో, బలహీనమైన ఉక్రెయిన్ తలపడడానికిముఖ్యకారణం తన వెనుకబలంగా నిలిచిన అమెరికా, యూరోప్ దన్ను చూసుకునే.వారి నుండి అందుతున్న ఆర్థిక, సైనిక, ఆయుధ సాయంతోనే.

-డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### వైద్య సౌకర్యం కల్పించాలి

ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలి.నూతనంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలో ఇటీవలకాలంలో 9210 నూతనంగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పిజిటి, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్స్ వివిధ సొసైటీలలో జాయిన్ కావడం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 20 వేలమంది గురుకుల సిబ్బందికి ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి. గురుకులాలలో నిత్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ఈఎస్ఐ ఆరోగ్య కార్డు ఇచ్చి ఉద్యోగితోపాటుగా వారి కుటుంబ సభ్యులకు వారి తల్లిదండ్రులకు ఉచిత ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి.

-రాపాక రవీందం, జనగాం

### లోక్అదాలత్ నిర్వహణ

ప్రతి జిల్లాలో న్యాయసేవల సాధికార సంస్థ నిర్ణీత కాలంలో లోక్ అదాలత్ నిర్వహణ జరుగుతోంది. చట్టం అనుమతించే రాజీమార్గం ఉన్న కేసుకు సత్వర న్యాయం లభిస్తుంది.ఎందరో పేద కుటుంబాలువారికి జరిగిన అన్యాయాలకు ఆర్థిక స్తోమత లేనప్పుడు మొదట పత్రాలతో సంబంధిత అధికారులు లేదా పర్యవేక్షకులను సంప్రదిస్తే దానివిధానం తెలియజేస్తారు.దీనివల్లపరిష్కారం ఏ ఖర్చు లేకుండా పొందవచ్చు. వస్తుంది.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### జరిగిన నష్టం రాబట్టాలి!

ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి ఆ సంస్థలో పని చేస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులపనితీరు పూర్తిగా లోపభూయిష్టంగా, బాధ్యతారాహితంగా ఉండటంతో తొలగించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయం. తొలగించడమే కాకుండా, వారి బాధ్యతారాహిత్యం వలన సంస్థకు జరిగిన నష్టం వారి నుంచి రాబట్టాలి. ఒక్కఫైబర్ నెట్‌మాత్రమే కాదు, ప్రతి శాఖలో, ప్రభుత్వ సంస్థల్లో అన్ని స్థాయిల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పాలకులు ప్రజలకు జవాబుదారీ. మంత్రులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు పని చేయని అధికారులను గుర్తించితక్షణమే తొలగించాలి. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### పెరిగిన టారిఫ్

డోనాల్డ్ ట్రంప్ మహాశయుడు అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికయిన తరువాత అనేక పరిశోధనలు చేస్తున్నారు. మన టారిఫ్ తో సమానంగా వారి టారిఫ్‌ను పెంచడం ఈ విషయాన్ని ఖరాఖండిగా మన ప్రధాని మోడి గారితోనే నిష్కర్మగా నిర్మోహమాటంగా చెప్పానని ట్రంప్ చెప్పారు. భారత దేశానికి డబ్బుఅవసరం ఏ మాత్రంలేదని చెప్పారు. ఎందుకంటే భారత్ ధనిక దేశమట. పన్నుల రూపేణా అధికంగా సంపాదిస్తోందట.ధనిక దేశమే అయితే కోటిలక్షల కోట్లు అప్పు చేయడమెందుకో. కొంతమంది ఐ.పి.ఎస్. 95 స్కీములో రిటైరయిన వారు రెండు దశాబ్దాల పైగా తమకొచ్చే వెయ్యిరూపాయల ఫించన్ను పెంచమని మొత్తుకుంటుంటే తమ ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని బీద అరుపులు అరుస్తోంది.కోట్లాది మంది భారతీయులు ఇంకా దారిద్రరేఖ దిగువన నివసిస్తున్నారు. మరి భారత్ ధనిక దేశం ఏలా అయిందో ట్రంప్ విడమరచి చెప్పాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మాతృభాషలోనే విద్యాబోధన

విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి.ప్రతి తరగతికి ఒక గదిఉండాలి. అన్ని పాఠశాలలకు ర్యాంకింగ్స్ ఇవ్వాలి. ఉపాధ్యాయులను బోధనే తర కార్యక్రమాలకు ఉపయోగించకూడదు.అన్నిపాఠశాలల్లో మౌలిక వసతులుకలిపించాలి. పాఠశాలల ముందు స్కూల్ జోన్ బోర్డు ఉండాలి.మాతృభాషలో విద్యాబోధన ద్వారా విద్యార్థులు పాఠాలు త్వరగా నేర్చుకోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి: ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సహకారా'నికి తూట్లు పొడవొద్దు

**దేశంలో యాభైరెండు శాతంపైగా రైతులు అప్పుల ఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సహకారవ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదో ఒక రూపేణ ఈవ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్,మైక్రోఫైనాన్స్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలు వసూలుచేస్తున్నారు. రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి. ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరును ద్విజుడున్, చొప్పడిన ఊరనుండుము, చొప్పడ కున్నట్టిఊరు చొరకుము సుమతీ' అంటూ కొత్త ప్రదేశాల్లో స్థిరపడాలనుకునేవారికి సుమతీ శతకకారుడు కొన్నిసూచనలు ఇచ్చారు. అందులోనూ మొట్టమొదటిది అన్నిం టికంటే ముఖ్యమైనది అప్పు. ఆ అప్పుకు ఎంతటి ప్రాధా న్యత ఇచ్చారో ఆనాటి పెద్దలు.ఆరోగ్యం, నీరుకంటే అప్పిచ్చు వారికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిందికాదు, కొత్తగా చెప్పేది కాదు. ఎంతో అనుభవంతో కాచివడబోసి వెల్లడించిన సుమతీశతకం ఇది. పూర్వీకుల నుంచి గ్రామీణ రంగంలో రైతులను ఆదుకునేందుకు అప్పులు అందించే వ్యవస్థ ఏదోఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. రాజుల కాలం కానీ, ఆ తర్వాత కానీ ఆ గ్రామాల అవసరాలను బట్టి రైతులకు రుణసహాయం అందించేవారు. ఆనాడు లాభాపేక్ష ఉండేది కాదు. రైతులకు అప్పులు ఇచ్చేవారి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవి. ఎంతో మానవతా విలువలు ఉండేవి. ఒకరినొకరు ఆదుకోవాలనే తపన,ఆరాటం ఉండేది. కానీ దిగజారిపోతున్న మానవ విలువలతో పాటు ఆ వ్యవస్థ కూడా లాభాపేక్ష ధ్యేయంగా మారి అధిక వడ్డీలు, అపరాధవడ్డీలు అంటూ అమాయకులను దోపిడీ చేయడం ఆరంభించింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని 'నాగు'లంటూ పంటకాలానికి బస్తాకు రెట్టింపు వసూలు చేసేవిధానం కూడా చోటు చేసుకుంది. ఈ నాగులు, అపరాధ వడ్డీలు చెల్లించలేక ఎన్నో కుటుంబాలు వీధినపడ్డాయి. దీని నుంచే వెట్టిచాకిరి ఆవిర్భవించిందని చెప్పొచ్చు. ఈ దోపిడీని వ్యతిరేకించిన వారిలో కొందరు యువకులు ఆనాటి బ్రిటిష్ పాలకులు కూడా ఎదురొడ్డి నిలిచారు. పోరాట బాటపట్టారు. ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఇదొక సమస్యగా రూపాంతరం చెందింది. అప్పుల భారం భరించలేక, వ్యవసాయానికే మంగళం పాడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అటు వడ్డీ వ్యాపారులను కట్టడి చేయలేక, ఇటు రైతులను ఆదుకోలేక ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సతమతమైంది. ఎన్నో కమిటీలు, సుదీర్ఘ అధ్యయనం అనంతరం గ్రామీణ పరిస్థితులను అర్థం చేసుకున్న బ్రిటిష్ పాలకులు 1904లో సహకార వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1911 మార్చి17వ తేదీన గుంటూరులో జిల్లాస్థాయి సహకార బ్యాంకు ఆవిర్భవించింది. ఆ తర్వాత అయ్యదేవర కాళేశ్వర రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య లాంటి పెద్దలు కలిసి విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. అందులోనుంచి విడిపోయిన పట్టాభి సీతారామయ్య భూములను తనఖా పెట్టుకొని దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే భూ తనఖా బ్యాంకులను భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా కృష్ణజిల్లా గుడ్ల వల్లేరులో 1925 అక్టోబరు 31వ తేదీన శ్రీకారం చుట్టడంతో గ్రామీణరంగంలో రుణవసతులు కల్పించడంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నా యి. అందరి రైతులకు కాకపోయినా కొందరికి కొంతమేరకు ఊరట లభించింది. ఈ వ్యవస్థను నీరుకార్చేందుకు కొందరు భూస్వాములు వడ్డీవ్యాపారస్తులు ఎవరి వంతు వారు కృషి చేశారు. అయినా రైతుల విశ్వాసం చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1964లో సహకార చట్టం వచ్చింది. రైతుల కష్టాన్ని వడ్డీ, చక్రవడ్డీ రూపంలో దోచుకుంటున్న కొందరి వ్యాపారులకు పెత్తందారులకు ఇది ఇబ్బంది కలిగించినా రైతులకు మాత్రం వరప్రసాదంగా పరిణమించింది. వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన వ్యక్తులు డబ్బులు వసూలు చేయడంలో ఎంత కర్కశంగా వ్యవహరించేవారో ఇప్పటికీ కథలుకథలుగా చెప్పుకుంటారు. వారికి వాయిదాల ప్రకారం డబ్బు చెల్లించకపోతే

ఒక్క మాట

డబ్బు కట్టేవరకు ఇంట్లో పొయ్యి వెలిగించకుండా నీళ్లుపోసేవారట. అంటే తమకు డబ్బు చెల్లించకుండా ఆ ఇంట్లో ఎవరూ ఆకలి తీర్చుకునే అవకాశం లేకుండా చేసేవారు. వంటపాత్రలను ఎత్తుకెళ్లేవారు. వ్యవసాయ పశువులను తోలుకుపోయేవారు. ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లడం, వ్యవసాయ పనిముట్లు జప్తు చేసుకువెళ్లడం లాంటివి చేసి సమాజంలో అవమానపరిచేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని అమలు చేసేవారు. మొత్తం మీద ఈ సహకార వ్యవస్థతో గ్రామీణరంగంలో ఆ బాధలు తప్పిపోయాయని రైతులు ఆనందించారు. మరొకపక్క రైతుల అవసరాలను బట్టి రుణసహాయం అందిస్తూ వారి ఆదరాభిమానాలు అందుకుంటూ సహకార రంగం శాఖోపశాఖలుగా విస్తరించింది. అంచెలంచెలుగా ఎదిగి కోట్ల రూపాయలు అప్పులిచ్చే స్థాయికి చేరుకున్నది. మరెన్నో సహకార సంఘాలు ఆవిర్భవించి దేశానికి ఆదర్శంగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా ముల్కనూరులో ఏర్పాటైన సొసైటీ కార్యకలాపాలను చూసేందుకు మనదేశం నుంచే కాదు బ్రిటన్ లాంటి దేశాల నుంచి కూడా నిపుణులు వచ్చి అధ్యయనం చేసివెళ్లేవారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ వ్యవస్థలో రాజకీయాలు ప్రవేశించడంతో క్షీణదశ ఆరంభమైందని చెప్పొచ్చు. గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితి రానురాను దిగజారిపోతున్నది. అప్పులు వసూలు చేయడంలో పాత వడ్డీవ్యాపారులు వ్యవహరించిన తీరు కొన్నిచోట్ల అధికారులు పాల్పడుతుండడంతో రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. గతవారంలో తెలంగాణలో ఓ బక్క రైతు అప్పుకట్టలేదని ఆయన ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లారు. ఆ తలుపులతో ఆయన కట్టాల్సిన లక్షలాది రూపాయలు అప్పులో వందోవంతు కూడా తీరదని తెలుసు. కేవలం ఆ రైతును అవమానపరిచేందుకే ఇలాంటి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. రైతుల పరిస్థితి వేదనాభరితంగా మారుతున్నది. అధికారులు పాల్పడుతున్న ఇలాంటి చర్యల పట్ల తెలంగాణ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొన్న బహిరంగంగానే తీవ్ర స్థాయిలో హెచ్చరిం చారు. అయినా కొందరు అధికారుల్లో మార్పురావడం లేదు.పోనీ ఇంత నిర్దాక్షిణ్యంగా రైతుల నుంచి వసూలుచేసి సహ కార వ్యవస్థ పురోభివృద్ధికి ఉపయోగపడుతున్నాయంటే అదీ లేదు. సహకార సంఘాల ఆర్థికపరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. నష్టాలఊబిలో కూరుకుపోతున్నాయి. కొన్ని సహకార సంఘాలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సహకార చట్టంలో ఎన్నిసార్లు మార్పులు చేశారో చెప్పలేం. సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం కూడాఅదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయాల అవసరాల కోసం వీరూవారు అనితేడాలేకుండా అందరూ అన్నివిధాలుగా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడే కాదు ముఖ్యమంత్రులు మారినప్పుడు వారి అధీష్టాలమేరకు నిబంధనలు మారుస్తున్నారు.భూమున్న రైతులేకాదు,భూమిలేని వారు కూడా కేవలం పదిరూపాయలు ఫీజు చెల్లించి సభ్యులుగా చేరవచ్చునన్న సవరణ తెచ్చారు.ఆ తర్వాత మళ్లీదాన్ని సవరించారు. ఎన్నికల్లో ఓట్లకోసం ఇష్టానుసారంగా సభ్యత్వాన్ని పెంచారు. 'ఒకరి కోసంఅందరు, అందరి కోసం కొందరు నిలిచి' అన్న సహకారస్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. సహకారవ్యవస్థ రాజకీయ పునరావాసంగా రూపాంతరం చెందింది.ఆదాయ వ్యయాలు నిమిత్తం లేకుండా అవసరాలకు మించి ఉద్యోగులను నియమించడంతో సహకార సంఘాలకు మోయలేని భారంగా పరిణమించింది. ఇక అవకతవకలకు అంతేలేకుండాపోయింది. రైతులకు తెలియకుండా రైతుల పేరుపై అప్పులు తీసుకొని భోంచేసిన ఉదంతాలు ఎన్నో బయటకు వచ్చాయి. విచారణ పేరుతో ఏళ్లతరబడి కాలంగడుపుతున్నారు. 'కావడి ఎన్ని వంకలు తిరిగినా చివరకు ఇంటికి చేరాల్సిందేనన్నట్లు' ఈ భారమంతా రైతులు మోయాల్సివస్తుందనే వాస్తవాన్ని పాలకులు పట్టించుకోవడంలేదు. దేశంలో వ్యవసాయరంగం కుదేలైపోతుండడానికి కారణాల్లో రైతులకు సకాలంలో అప్పులు దొరక్కపోవడం. దీంతోవారు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. దేశంలో యాభై రెండు శాతం పైగా రైతులు అప్పులఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తు న్నాయి. సహకార వ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదోఒక రూపేణ ఈ వ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్, మైక్రోఫైనాన్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలువసూలు చేస్తున్నారు.రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి.ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# న్యాయస్థానాల్లో తీవ్రజాప్యాన్ని అరికట్టాలి!


బి. మధు

ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య వచ్చే పొరపచ్చలు, ఘర్షణ వాతావరణం, బహిరంగ కొట్లాటలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, పరస్పర దాడులు చేసుకుంటూ తమది న్యాయం అంటే తమది న్యాయం అంటూ చివరకు పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకువెళ్లడం వంటివి సంభవించడం ఒక సర్వ సాధారణ విషయంగా మారిపోవడం ఈ సమాజానికి సంబంధించి ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ముఖ్యంగా ఈ ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎవరికి చెందాల్సిన ఆస్తులు వారికే చెందకుండా అంతా ఆస్తిని తాము ఒక్కరమే అనుభవించాలనే దురాశతో, దుర్బుద్ధితో తమకువచ్చే ఆస్తులు చాలక తన సొంత అన్నదమ్ముల, తోబుట్టువుల ఆస్తులను కూడా దొడ్డిదారిలో కాజేయాలని చూస్తుండటం,హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం చేయడం అందుకోసం ఎలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడటానికి కూడా వెనుకంజ వేయకపోవడం వంటి అనైతిక పోకడల మూలాన ఆస్తుల వ్యవహారాలు ముదిరిపాకాన పడిఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ, దుమ్మెత్తి పోసుకుంటూఅంతిమంగా న్యాయం కోసం ఏ పోలీస్ స్టేషన్ లేదా న్యాయ వ్యవస్థ గడపనో తొక్కడం వంటి చర్యలు అనేకం. ప్రస్తుతం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనే మాట పచ్చి యధార్థం.అయితే ఎక్కువ భాగం ఇలాంటి కేసులలో తమ తల్లిదండ్రులను నయనో భయానో లొంగదీసుకొని లేదా వారిని పక్కదోవ పట్టించి మరీ ఉమ్మడి కుటుంబంలోని కొంతమంది నయవంచకుల వంటి అన్నదమ్ములు తమ సొంత అన్న లేదా తమ్ముడి ఆస్తులను చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆస్తులను అప్పనంగా కొట్టేసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతుండటం, అందుకోసం నీతి,నియమాలకు సైతం తిలోదకాలు ఇచ్చి డబ్బు వ్యామోహం మెండుగా గల కొంతమంది లాయర్లను ఆసరాగా పెట్టుకొని మరీ అందరికి చెందాల్సిన ఆస్తులు తమకే చెందేలా ఆస్తులను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. అంటే నేటి సమాజంలో ఎలాంటి అత్యంత దురదృష్టకరమైన, ఆందోళనకరమైన పరిస్థితులు పొడచూపుతున్నాయో మనకు బాగా విశదమవుతున్నది .అందుకోసం మోసపురితమైన,దగాకోరు పంథాలో తల్లిదండ్రుల నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల పై సంతకాలు తీసుకొని తమకు చెందని ఆస్తులను కూడా కొంతమంది రిజిస్ట్రేషన్ ఆఫీసు అధికారులను,అక్కడ పని చేసే సిబ్బందిని మభ్యపెట్టి వారికి కాసుల ఆశ చూపి తమ పేర లిఖించుకొని ఆన్‌లైన్ చేసుకుంటున్నారు. అంటే మన వ్యవస్థ ఎంతగా భ్రష్టు పట్టిందో, ఏస్థాయిలో దిగజారిపోయిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏదిఏమైన ఇప్పటికైనా ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ ఆస్తుల విషయంలో నిద్రాణావస్థ నుంచి మేల్కొని తమ ఆస్తులు మరొకరి పాలు కాకుండా,అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు, ఒకవేళ తమకు అన్యాయం జరిగిన త్వరితగతిన తమ తల్లి దండ్రులను సంప్రదించి జరిగిన దారుణ మోసాన్ని వారికి బట్టబయలు చేసివారిని (ఎంఆర్ఓ) మండల రెవెన్యూ అధికారి,తహశీల్దారు వంటి ఆఫీసర్ల వద్దకు తీసుకెళ్లి తక్షణమే వారు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసిన భూమిని బ్లాక్ చేయించే విషయంపై అవగాహన పెంచుకొని తమ విలువైన ఆస్తులను అత్యంత సురక్షితంగా కాపాడుకోవాలి. కాబట్టి ఉమ్మడి ఆస్తుల పరిరక్షణే ప్రదాన ధ్యేయంగా ప్రతి ఒక్క ఉమ్మడి కుటుంబ సభ్యులు భావించి తదనుగుణంగా తమ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే మాత్రం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందాన అమూల్యమైన జీవితాలు అధోగతి పాలు కావడం తథ్యం. ●

# చదువుల విప్లవం డిజిటల్ టెక్నాలజీతో సాధ్యం!


డాక్టర్ మోటె చిరంజీవి

కాలం మారుతుంది. కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి.రోజురోజుకు విద్యార్థుల్లో కూడా కాంపెటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతులు కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు.ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది. ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది. ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యాబోధన చేయడానికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవం వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యలోసాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి,అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడుమాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందుకోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు.సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి.ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించడానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి , సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు.గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసం పన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. భారతదేశం డిజిటల్ మయమైంది. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణకేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున, మన నగరాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది. ఈ వినూత్న సెటప్‌లు మన



దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి. దృశ్య అభ్యాస అనుభవాలు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణవిద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లలేకుండా లేవు. పరిమిత మౌలిక సదుపాయాలు, అనియత విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యతకు, అడ్డంకులు అనేకం ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లోకూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యాప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్‌తోపాటు, ట్యాబు ద్వారా, బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐ ఎఫ్ ప్యానల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్‌లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. ఈవిధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులురావడం, కళాశాల విద్యార్థులు నీట్, ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం,డిగ్రీ, పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు. 20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్, ఆటోమేషన్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకుముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యేవారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాలయంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్‌ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్‌కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసివ్ ఓపెన్ ఆన్లైన్‌కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు.రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యా సంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏది ఏమైనప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నటువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నతప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతు న్నారు అధ్యాపకులు. ఈ విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించి,వాటితో బోధించి,ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. ●

అమరావతి వార్త



# భారత భాగ్య విధాత డాక్టర్ అంబేడ్కర్

-దేశ భవిష్యత్తును రాజ్యాంగంగా రూపొందించిన గొప్ప మేధావి

-రాజకీయ ఆర్థిక సామాజిక అభివృద్దే దేశాభివృద్ధి

-అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య గంటా చక్రపాణి వెల్లడి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** భారతదేశానికి దశ,దిశ చూపిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా కీర్తించబడుతున్నారని తద్వారా భారత భాగ్య విధాతగా ఆయన్ను నేటి సమాజం కొనియాడుతుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య గంటా చక్రపాణి అన్నారు.వర్సిటీలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం





అంబేద్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో,పొలిటికల్,ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల యూజీసి జాతీయ సదస్సు ప్రారంభమైంది.ప్రారంభ కార్యక్రమానికి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షతవహించారు. వేశారు.కీలక ఉపన్యాసకులుగా పాల్గొన్న ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా గానీ,సామాజికంగా కానీ,రాజకీయంగా కానీ పతనావస్థకు చేరుకున్న సంఘటనలు మనం నిరంతరం చూస్తూనే ఉన్నామన్నారు.కానీ భారతదేశం అటువంటి సంక్షోభాలకు దూరంగా ఉందని గుర్తు చేశారు.దీనికి ప్రధాన కారణం ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే అన్నారు.రాజ్యాంగానికి ఎక్స్‌పైరీ డేట్ ఉండదని అందులో సవరణలు మాత్రమే ఉంటాయని గుర్తుచేశారు.భారత రాజ్యాంగం అనేది ప్రొగ్రెసివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు.ప్రపంచంలో ఉన్న మూడు ప్రభుత్వ సంస్థలు అంబేద్కర్‌ను విజ్ఞాన భాండాగారంగా అభివర్ణించాయని గుర్తు చేశారు.ఆయన ఒక సోషల్ ఇంజనీర్‌గా గంటా చక్రపాణి పేర్కొన్నారు.గౌరవం లేని కులంలోపుట్టిన వ్యక్తి దేశానికి గౌరవం తెచ్చారని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీఎస్ఎస్ఆర్ విసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగం చాలా గొప్పదన్నారు.ఆ రాజ్యాంగం ద్వారా భారత దేశ కీర్తి కొనియాడబడుతుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా ప్రతి ఒక్కరూ సమానత్వం సాధించినప్పుడే భారత రాజ్యాంగానికి విలువఉంటుందన్నారు .గౌరవఅతిధిగా రెక్టార్ డాక్టర్ రత్నషీలామణి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు.ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం,అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ సెమినార్ డైరెక్టర్ ఆచార్య వై.అశోక్‌కుమార్, సెమినార్ కోఆర్డినేటర్ డాక్టర్ కె అబ్రహాం లింకన్,అంబేద్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలారి శామ్యూల్,హిందీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ కె.సోమశేఖర్,ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి,సూటా అధ్యక్షుడు డాక్టర్ భట్టు నాగరాజు,అధ్యాపకులు పరిశోధకులు,ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు

# నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతంజరగాలి : నగర కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని, రోడ్ల మీద, సేకరణ, మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యదర్శులు, కార్మికులు అత్యవసరం అయితే తప్ప ముందస్తు అనుమతి లేకుండా సెలవులు



కాల్వల్లో వ్యర్ధాలు వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సాయి నగర్, అంకిరెడ్డిపాలెం, ఏటి అగ్రహారం, శ్రీరాం నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తి అయినందున వార్డ్ సచివాలయాల వారీగా పారిశుధ్య పనులను డ్రైవ్ మోడ్ లో చేపట్టాలన్నారు. చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రంపై ఫిర్యాదులు రావాడానికి వీలు లేదని, అందుకు తగిన విధంగా ఉదయం ఇంటింటి చెత్త తీసుకోరాదన్నారు. అంకిరెడ్డిపాలెంలో ప్రజలతో స్థానిక సమస్యలపై మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఏటి అగ్రహారం రిజర్వాయర్ పంప్ హౌస్ ని పరిశీలించి,ర రాన్నున్న వేసవి దృష్ట్యా అన్ని మోటార్లు వర్కింగ్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్ పరిధిలో పైప్ లైన్ లీకుల మరమత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిఈఈలు శ్రీనివాస్, మధుసూదన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అధికార లాంఛనాలతో జవాన్ అంతిమయాత్ర

**పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** జవాన్ మోహన్ వెంకటేష్ అంతిమయ యాత్ర శుక్రవారం అధికారలాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌడపాలెం నకు చెందిన పరిశా శ్రీనివాసరావు శివపార్వతి ల పెద్ద కుమారుడు వెంకట్ రాజస్థాన్లో ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తూ



దురదృష్టవశాస్తూ మృత్యువాత చెందారు. మంగళవారం నాడు ఉదయం 11 గంటలకు రాజస్థాన్ ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్ లో బుల్లెట్ బ్యాక్ ఫైర్ అవడం చేత, అకాల మృత్యువాత చెందారు.శుక్రవారం నాడు పిట్టలవానిపాలెం మండలంలోని గౌడపాలెంలో ఆయన స్వగృహం నకు గురువారం నాడు ఆయన పార్థివ దేహం చేరుకోగా పరిశా మోహన్ వెంకటేష్ భౌతిక కాయాన్ని బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియ,తహసీల్దార్‌వెంకటేశ్వరరావు, కెప్టెన్ సత్యప్రసాద్,ఎడి, డైరెక్టరేట్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, పర్యవేక్షణ అధికారి శ్రీ డి. ఆనందరావులు సందర్శించి నివాళులు అర్పించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్ధించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# మాతృదేశ సేవలో యువతకి ఉపాధి అవకాశాలు పుష్కలం

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** మాతృదేశ సేవలో యువతకు గొప్ప ఉపాది అవకాశాలు ఉన్నాయని,వాటని వినియోగించుకుని యువత ముందుకు వెళ్లాలని,మంచి వేతనంతోపాటు సమాజంలో గౌరవ భావాలు కలిగేఉద్యోగాలు మనదేశ ఆర్మీలో ఉన్నాయని బ్రిగేడియర్ ఆర్కే అవస్థి (డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రిక్రూటింగ్,జోనల్ రిక్రూటింగ్ అధికారి చెన్నై) పేర్కొన్నారు.స్థానిక టిజేపిఎస్ కళాశాలలో ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో భారతదేశ ఆర్మీ లో ఉపాది అవకాశాలు ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది.కళాశాల డిగ్రీ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అధ్యక్షత వహించారు.కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థిదశలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఎన్‌సిసి వంటి వాటిల్లో ప్రవేశించాలని,తద్వారా క్రమశిక్షణ.దేశభక్తి భావంతోపాటు ధైర్యగుణాలు అలవడతాయని అంతే కాకుండా ఉపాది అవకాశాలు త్వరగా వస్తాయన్నారు.కార్యక్రమంలో కల్నల్ పుణిత్‌కుమార్ (డైరెక్టర్ రిక్రూటింగ్,ఆర్మీ రిక్రూటింగ్ అదికారి,గుంటూరు మేజర్ అమర్‌దీప్ కుమార్ (రిక్రూటింగ్ మెడికల్ అధికారి),మేజర్ పి.కుమార్‌రాజ (కళాశాల ఎన్‌సిసి అధికారి మరియు ఇతర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## హాస్పిటల్స్, కమర్షియల్ భవనాల సెల్లార్‌లను

# పార్కింగ్ కోసమే వినియోగించాలి

-నగర కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని హాస్పిటల్స్, కమర్షియల్ భవనాలు సెల్లార్ లను పార్కింగ్ కోసమే వినియోగించాలని, ఇతర



అవసరాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో సెల్లార్ల వినియోగం, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఐఎంఏ ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండు ప్రాంతాలైన హాస్పిటల్స్ రోడ్డు, కమర్షియల్ భవనాలలో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను వేరే అవసరాలకు వాడుతూ, వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయుటం వలన రోడ్లపై ట్రాఫిక్ నకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే నగర పాలక సంస్థ అధికారులు ట్రాఫిక్ పోలీసులతో కో ఆర్డినేట్ చేసుకొని సెల్లార్లను ఖాళీ చేయించి, సదరు ప్రాంతాలను పార్కింగ్ కొరకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన సిబ్బందిని, వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. అంతేకాక చుట్టుగుంట ప్రధాన రహాదారి నుండి పేరేచర్ల వరకు రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురై ఉన్నదని, ఆ రోడ్డు తో పాటు ప్రధాన రహదారుల మార్జిన్లు ఆక్రనలకు గురైన వాటిని గుర్తించి వెంటనే సదరు ఆక్రమణలను తొలగించి మరల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరంలో ఆర్.టి.సి బస్టాండ్ వద్ద బస్సులను యద్దేచ్ఛగా ట్రాఫిక్ నకు అంతరాయం కలిగే రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని, బస్సులను రోడ్లపై పార్కింగ్ చేయకుండా ఆర్.టి.సి ఆర్.యం లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్దీకరించుటకు సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని, సదరు కమిటీలో పోలీస్ డిపార్టుమెంటు, సీనియర్ సిటిజెన్ అసోసియేషన్, రేట్ పెయర్స్ అసోసియేషన్,మెడికల్ షాప్స్ ఓనర్స్, ఐఎంఏ, బిల్డింగ్ అసోసియేషన్ తో ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్దీకరణకు వారి సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి రెహ్మాన్, తూర్పు ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్‌ఫ్లూ పై అవగాహన సదస్సు


**గుంటూరు విద్య,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** స్థానికపట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చికెన్,కోడిగుడ్లు వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ,గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. ప్రజలందరూ ఉడికించిన చికెన్ గుడ్లను తినొచ్చని తద్వారా ఏలాంటి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు.బర్డ్‌ఫ్లూ పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో గుంటూరులో శుక్రవారం సాయంత్రం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఉడికించి చికెన్,గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని ఈ సందర్భంగా వైద్యులు,అధికారులు తెలిపారు.అయితే సోషల్ మీడియాలో జరిగిన అసత్యప్రచారం కారణంగా చికెన్,గుడ్లు వ్యాపారం దారుణంగా దెబ్బతినడం జరిగిందని గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు.ప్రజలందరూ చికెన్ ఉడికించి తినొచ్చన్నారు.ఇందులో భాగంగా ఏర్పాటు మేళాలో చికెన్‌తో కూడిన



భోజనం చేసేందుకు జనం ఎగబడ్డారు.పెద్దసంఖ్యలో ప్రజలు కార్యక్రమంలో పాల్గొని చికెన్ బిర్యాని ని ఆరగించారు.కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ,డాక్టర్ రాయపాటి మమత,డాక్టర్ నిమ్మల శేషయ్య,స్టాండింగ్ కమిటీ మెంబర బాబు,ఎం.కిషోర్‌బాబు,పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ అమరావతిరి ప్రెసిడెంట్ సురేష్,పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ అసోసియేషన్ నాగేశ్వరరావు,రేణుక పౌల్ట్రీ పరిశ్రమ గిరి ,అసోసియేషన్ మెంబర్‌లు పాల్గొన్నారు.

# హోంమంత్రికి ఎమ్మెల్యే వినతి

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** సాయిసాధన చిట్‌ఫండ్ యజమాని పుల్లారావు డిపాజిట్లు, చిట్స్ రూపంలో కోట్ల రూపాయలను వసూలు చేసుకొని మోసం చేశాడని ఎమ్మెల్యే డాక్టర్



చదలవాడ అరవింద్‌బాబు, రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు తెలియజేశారు. బాధితులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ బాధితులు ఆధైర్యపడవద్దన్నారు. ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు చొరవ తీసుకొని ఎప్పటికప్పుడు తమకు సమాచారం తెలియజేశారని పేర్కొన్నారు. పిల్లల చదువుల కోసం, వివాహాల కోసం దాచిన డిపాజిట్లను, చిట్స్ ను మాయం చేయడం దారుణ మన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిట్ బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఫోన్ ద్వారా పోలీస్ ఉన్నతాధికారులకు హోంమంత్రి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కడియాల రమేష్, చేకూరి సాంబశివరావు, బాధితులు ఇ.ఎం.స్వామి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# తెలుగు భాషను మరిస్తే అమ్మను మర్చినట్లే

- ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయరామ్

**ఎ కొండూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు జడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఈ జయరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ తెలుగు భాష గురించి శ్రీ కృష్ణ దేవరాయలు చెప్పిన విధంగా దేశభాషలందు తెలుగు లెస్స అని ఎంత గొప్పగా చెప్పిన తెలుగుభాష ఔన్నత్యాన్ని ఈ సందర్భంగా వివరిచారు. మనం ఏ మీడియంలో చదువుకున్నా తెలుగు భాష మూలాలను మర్చిపోవద్దని తెలుగు భాషను మరిస్తే అమ్మను మర్చినట్లేనని విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రాముఖ్యతను జయరామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘాట్ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

-ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** వినుకొండ రామలింగేశ్వరస్వామి ఆలయం ఘాట్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం



అధికారులతో కలిసి ఘాట్ రోడ్డు పనులు పరిశీలించి సమీక్ష నిర్వహించారు. జీ.వీ మాట్లాడుతూ రూ. 2కోట్ల నిధులతో చేపట్టిన ఘాట్ రోడ్డు పనులు పారదర్శకంగా ఉండాలని చెప్పారు. భవిష్యత్ అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వసతుల విషయంలో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఘాట్ రోడ్డు పనులు పూర్తి కాగానే అనుబంధ రోడ్లు కూడా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. కొండకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, కూటమి నేతలు నాగశ్రీను, లాయర్ సైదారావు, పత్తి పూర్ణ, కమిటీ సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

# డ్రైనేజి పంపింగ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

-విజయవాడ మునిసిపల్ కమిషనరు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** హెచ్‌బి కాలనీలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన ఐరన్ యార్డు,ఎట్కిన్‌సన్ స్కూలు రోడ్,ఊర్మిళా సుబ్బారావు రోడ్,జోజినగర్, గొల్లపూడి బైపాస్ రోడ్,సితార రోడ్, హెచ్‌బి కాలనీ,సివిఆర్ ఫ్లైఓవర్,న్యూ భగత్‌సింగ్‌నగర్, బ్రహ్మయ్య స్ట్రీట్, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌బి కాలనీలోని డ్రైనేజి పంపింగ్ స్టేషన్నుఉ సత్వరమే మరమ్మత్తులు చేయించి,త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిత్యం సైడ్‌డ్రైన్లను పరిశుభ్రపరుస్తుండాలని, ఖాళీ స్థలాల్లో ఎటువంటి వ్యర్థాలు,నీటి నిల్వలు ఉండరాదని, పాడైపోయిన కల్వర్టులన్నీ మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఔట్‌పాల్ డ్రైన్‌లను పరిశీలించి,ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ ప్రక్రియ చేస్తూ ఉండాలని, అవసరమైన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌బి కాలనీ లోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి,క్యాంటీన్‌లోని మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు ఆఫీసర్ పర్యవేక్షిస్తూ ఎటువంటి మరమ్మత్తులు ఉండరాదని, త్రాగునీటి సరఫరా నిరంతరం ఉండేటట్లు చూసుకోవాలని వాడుక నీటిలో ఎటువంటి లీకేజీలు ఉండరాదని,మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తుండాలని,అన్నా క్యాంటీన్‌లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషర్ రమ్యకీర్తన,ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి,శానిటరీ సూపర్‌వైజర్లు శివరాంప్రసాద్,ఓబేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## విధులు బహిష్కరణలో తిరువూరు బార్ అసోసియేషన్

**తిరువూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** అడ్వకేట్స్ సవరణ బిల్లు-2025 న్యాయవాద వృత్తి యొక్క స్వీయ నియంత్రణకు అవసరమైన దాని స్వయం ప్రతిపత్తి మరియు స్వాతంత్ర భావనని కూల్చివేయుటకు ప్రయత్నిస్తున్నందున తిరువూరు బార్ అసోసియేషన్ నాయవాదులందరూ ప్రధాన కార్యదర్శి అయిన వాకదాని లక్ష్మీనారాయణ షేక్ గౌసుద్దీన్ అధ్యక్షతన కోర్టు విధులు బహిష్కరించడమైనది. కార్యక్రమంలో మునగాల అప్పారావు, బిఎల్ గణేష్ సింగ్,



ఎం రామ్మోహన్ రాజు, చింతల వెంకటరెడ్డి, అత్తులూరి శ్రీనివాసరావు, రాజవరపు శ్రీనివాసరావు, మర్సకట్ల కుమార్, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి గోగినేని కృష్ణారెడ్డి సిహెచ్ రాజేంద్రబాబు మేకల రవి కనపర్తి రాంబాబు భూక్యా రామారావు కారుమంచి సునీల్ బి.అవినాష్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతుల సమక్షంలోనే రీ సర్వే చేపట్టాలి

-పల్నాడు జిల్లా కలెక్టరు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సంబంధిత రైతులతో పాటు చుట్టుపక్కల రైతులను కూడా పిలవాలని సూచించారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న భూమల రీ సర్వే



ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. సంబంధిత భూముల రికార్డులను పరిశీలించారు. సర్వే నెంబర్ల ఆధారంగా రైతువారీగా భూ విస్తీర్ణం పై ఆరా తీశారు. గ్రామంలోని భూముల వివరాలను సమగ్రంగా తమకు అందజేయాలని, రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే జరుగుతున్న పనిని పరిశీలించారు. ఈ పర్యటనలో సత్తెనపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి రమణాకాంత్‌రెడ్డి, తహశీల్దార్, ఇతర సర్వే, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని వారు మాట్లాడారు. ఎన్డీఏ బలపరిచిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసారు. పలు ప్రైవేట్ విద్యాసంస్థలతో అధ్యాపకులను కలిసి ఎన్డీఏ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధన్యత ఓటు వేయాలని కోరారు. రాజేంద్రప్రసాద్ విద్యావంతుడని పేర్కొన్నారు. మాజీ మంత్రిగా రాష్ట్రానికి వారు ఎన్నో సేవలందించారని గుర్తు చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాలనను బలపరిచే విధంగా గ్రాడ్యుయేట్ ఎన్నికలలో తీర్పును ఓటర్లు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ క్వారీయింగ్ పై విచారణ

## - గ్రావెల్ క్వారీలను పరిశీలించిన అధికారుల బృందం

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** గత వైస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అక్రమ క్వారీయింగ్‌పై ఎట్టకేలకు అధికారులు విచారణకు శ్రీకారం చుట్టారు. చేబ్రోలు మండల పరిధిలోని వీరానాయకుని



పాలెంలో అక్రమ క్వారీయింగ్‌ను ఉన్నతాధికారుల బృందం పరిశీలించారు. అక్రమ క్వారీయింగ్‌పై పూర్తి సర్వే నిర్వహించి ఏ మేరకు అక్రమంగా మట్టి క్వారీయింగ్ జరిగింది. ఎన్ని క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా మట్టిని తరలించారన్న వివరాలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. చేబ్రోలు మండలంలో జరిగిన అక్రమ మైనింగ్‌లో అడుగడుగునా పర్యావరణ చట్టానికి తూట్లు పొడిచినట్లు జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు గ్రామానికి చెందిన వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ ఫిర్యాదు చేశారు. దీంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ అక్రమ క్వారీయింగ్‌పై పూర్తి వివరాలను అందించాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు పూర్తిస్థాయి విచారణకు శ్రీకారం చుట్టారు. అర్జీదారు వైకాపా పాలనలో కొంతమంది నాయకులు అధికారుల అండదండలతో వీరానాయకునిపాలెం, శలపాడు, శేకూరు, వడ్లమూడి, సుద్దపల్లి తదితర గ్రామాల్లో వందల కొద్ది ఎకరాల్లో అక్రమంగా మైనింగ్ చేసినట్లు, అందుకు సంబంధించిన వివరాలను గ్రీన్ ట్రిబ్యునల్‌కు అందజేసినట్లు తెలిసింది. అక్రమ మైనింగ్ వల్ల సుమారు 700ఎకరాల్లో ఉద్యాన పంటలు కనుమరుగైనట్లు ఆరోపించారు. తాత్కాలిక అనుమతులు పొంది, గడువు ముగిశాక కూడా యదేచ్ఛగా సుమారు 80మీటర్లకు పైగా మైనింగ్ చేసినట్లు ఆధారాలను అందజేశారు. గతంలో విచారణ చేసిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టకపోవడంతో న్యాయం జరగదని, ప్రస్తుత విచారణను సమగ్రంగా చేయాలని శివలింగప్రసాద్ అధికారులను కోరారు. అనంతరం తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా రైతులతో మాట్లాడుతూ సమగ్ర సర్వే నిర్వహించి తవ్వకాల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ అండగా ఉంటుంది : కమిషనరు శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా



ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్సోర్సింగ్ కార్మికులు బండి భవాని కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్ ను మరియు ఈ నెల 18న ప్రమాదంలో మరణించిన గొర్రెముచ్చు కొండమ్మ కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల చెక్కులను శుక్రవారం కమిషనర్ చాంబర్ నందు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న బండి భవాని గత అక్టోబర్ లో అనారోగ్య కారణాలతో మరణించగా, నేడు వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా క్రింద రూ.2 లక్షల చెక్ ను అందించామని, అలాగే ఫిబ్రవరి 18 విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించిన గొర్రెముచ్చు కొండమ్మ కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయల మట్టి ఖర్చుల క్రింద పరిహారం అందించామని తెలిపారు. అలాగే సదరు కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబందిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు. కార్మికులు కూడా తమ సమస్యల పై అర్జీలు లేదా ఫిర్యాదులు తమకు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గాంధీనగర్‌లో శ్రీ పోలేరమ్మ, పోతురాజు స్వామి ప్రతిష్ట మహోత్సవం

**వినుకొండ, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** మండలంలోని హసన్నాయుడుపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని గాంధీనగర్ నందు శ్రీ పోలేరమ్మ అమ్మ వారు, పోతురాజు స్వామి వార్ల ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులు పాల్గొన్నారు. ఈ ఆ సందర్భంగా అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాతో సత్కరించి సన్మానించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో జీ.వీ, మక్కెనలు పాల్గొని అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.





## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**నూజెండ్ల, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దవరం పాఠశాల నందు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని తెలుగుతల్లి వేషధారణలో ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకండి అని కోరుతూ ఆకట్టుకుంది. విద్యార్థుల కు పద్యాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తల సమిష్టి కృషితో పార్టీని పటిష్టం చేద్దాం : దొంతిరెడ్డి వేమారెడ్డి

**మంగళగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత అనుబంధ సంఘాల మీద ఉందని వైసీపీ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. నూతనంగా



నియమితులైన పార్టీ మంగళగిరి నియోజకవర్గ అనుబంధ విభాగాల ఆధ్యక్షులు శుక్రవారం పార్టీ కార్యాలయంలో దొంతిరెడ్డి వేమారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. వైఎస్ జగన్మోహనరెడ్డి ముఖ్య మంత్రిగా కొనసాగి ఉంటే రైతు భరోసా, అమ్మఒడి, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఎప్పుడో వచ్చి ఉండేవన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసు కెళ్ళాల్సిన అసరం ఉందన్నారు. అధికార పార్టీపై 8నెలల్లోనే ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, భవిష్యత్తు మనదేనని, కలసికట్టుగా ముందుకు కదులుతూ జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు పార్టీతోపాటు అధినేత అండగా ఉంటారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు తెలిపారు.

## పట్టభద్రులను మోసం చేస్తున్నారు : కొమ్మాలపాటి

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పిడిఎఫ్ ముసుగులో వైకాపాకు తొత్తుగా మారి పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మోసం చేస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో అవమానాలకు గురయ్యారన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరిచారని విమర్శించారు. గత ఐదేళ్ళ వైకాపాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. అదే విధంగా ఎటువంటి ఉపాధి చూపించే పరిశ్రమలను అప్పటి వైకాపా ప్రభుత్వం తీసుకురాలేదన్నారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలకాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిందన్నారు. అభివృద్ధి జరగాలి అంటే కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. ఖచ్చితంగా తమ అమూల్యమైన ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు.

## సమస్యల సాధన సమ్మెకు మద్దతుగా బ్యాంకు ఉద్యోగుల ధర్నా

**తెనాలి, ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త :** బ్యాంకింగ్ రంగంలో సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా మార్చి 23, 24తేదీలలో నిర్వహించే సమ్మెకు మద్దతుగా యునైటెడ ఫోరం ఆఫ్



బ్యాంకింగ్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 23, 24తేదీలలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధరా ్న నిర్వహించారు. పట్టణ గాంధీచౌక్‌లోని ఎస్‌బిఐ రీజనల్ కార్యాలయం ఎదుట, వివిధ బ్యాంకుల ఉద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ మార్చి నెల 23, 24తేదీలలో నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా, ఉద్యమానికి మద్దతుగా ధర్నా నిర్వహించామన్నారు. తమ సమస్యలను వివరించారు. 12వ వేతన సవరణలో జరిగిన ఒప్పందాలు ఇంత వరకు అమలు కాలేదన్నారు. సిబ ్బందే నియామకం జరగడం లేదనీ, తద్వారా పని భారం పెరుగుతుందని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

## చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శ్రీశారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు ఆళ్ళ వేమనరెడ్డి అద్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పి.వి సుబ్బారావు మాట్లాడుతూ మాతృభాషా గొప్పతనం గురించి వివరిస్తూ మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన భాధ్యత అందరిమీదా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నజ్యోతి, డాక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్ద కార్యాలయంలో




అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంస్ద డైరెక్టర్ ప్రముఖ న్యాయవాది దాసరి చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ అమృతమైన మన మాతృభాషను మృతభాషగా మార్చవద్దు అని అన్నారు. బాల్యం నుండే పిల్లలకు మాతృభాషా సంస్కృతి పట్ల ఆసక్తి కలిగించేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మమ్మీ డాడి కల్చర్‌తో మన మాతృభాష అయిన తెలుగు మరుగున పడిపోవడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ పి.వి సుబ్బారావు, డాక్టర్ దార్ల బుజ్జిబాబులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గేరా యాకోబు, గుంజి వీరాంజనేయులు, వడ్లాన చంద్రం, జె.బుల్లిబాబు, బెజ్జం రవి, షేక్ బాజి భాషాబత్తుల విక్రమ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## షేక్ సలామ్ మృతికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి సంతాపం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** పట్టణంలోని 17వ వార్డుకు చెందిన షేక్ సలామ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సలామ్ నివాసానికి వెళ్ళి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, మద్దుమాల రవి, మిరియాల రత్నకుమారి, పిల్లికోటి తదితరులు పాల్గొన్నారు.



## గత పాలనలో ఉపాధ్యాయ,ఉద్యోగ,నిరుద్యోగ వర్గాలకు తీవ్ర నష్టం

### -ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** గత వైకాపా ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు ఓటర్లను కోరారు. శుక్రవారం న్యాయవాద సంఘాలను కలిసి మద్దతు తెలిపాలని జీ.వీ వారిని కోరారు. పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావు గత వైకాపా పాలనలో ఎటువంటి సమస్యలపై పోరాడలేదన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యువతకు, ఉద్యోగులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న కూటమిని బలపర్చాలని, ఆలపాటిని గెలిపిస్తే ఆ వర్గాలకు మరింత సంక్షేమాభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, న్యాయవాదులు కెఎస్ఎంవి నాయుడు, రామకోటేశ్వరరావు, సైదారావు, జ్ఞానేశ్వరరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, ఎం.వి అప్పారావు, జనసేన నాయకులు నాగశ్రీను, బిజేపీ నాయకులు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేయాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్ధిగా కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రివర్యులు నియోజక వర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గణపవరం గ్రామంలో సచివాలయ ఉద్యోగులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు తెలియజేయాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుండి రంగనాయకులు కళాశాలలోని ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, బిజెపి నియోజక వర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, గంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పల్నాటి ఉద్యమ వీరుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతి

**రెంటచింతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పల్నాటి ఉద్యమ వీరుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతి వేడుకలను స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



ప్రిన్సిపల్ ఎస్.మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించి న ఈ కార్యక్రమంలో విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు పాల్గొని హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమంతు బ్రిటిష్ వారితో ఏ విధంగా పోరాడి పుల్లరి ఉద్యమ నేతగా ఎదిగాడో ఈ సందర్భంగా శ్రీనివాసరావు వివరించారు. హనుమంతు పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంచికల్లు గ్రామ సర్పంచ్ పుల్లారెడ్డి 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపే లక్ష్యం: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

**రెంటచింతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపేలక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాచర్లనియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి రెంటచింతల వచ్చిన ఎమ్మెల్యే స్థానిక తెదేపా నేతలతోకలిసి వైఆర్ఎస్, ఆల్ఫోన్స్, రామకృష్ణ గురుకుల, వివేకా పాఠశాల, సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ముఖాముఖి నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోకూటమి అభ్యర్థిని బలపరచాలని కోరారు. మండలంలో 832 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఎక్కువమంది ఆలపాటికి వేసేలా నేతలఉు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన సాగిస్తుండటంతో తెదేపా అభ్యర్థులపైఓటర్ల సానుకూలత వ్యక్తమవుతోందని దీంతో తెదేపా గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**మాచర్ల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణానికి చెందిన కీర్తి పురస్కార



గ్రహీత, కవి, రచయిత, చంద్రమౌళి రామనాథశర్మ, చరిత్ర పరిశోధకులు, రచయిత పావులూరి సతీష్‌బాబులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ ఆంగ్లభాషపై మోజు కారణంగా తెలుగు భాష ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని పాఠశాలల్లో బోధించడం ద్వారా పిల్లలు తెలుగు భాషకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్య తెలుగులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమిళ, కన్నడ రాష్ట్రాల్లో వారి మాతృభాష లేకుండా వేరే భాషలో ఎక్కడైనా బోర్డులు కనిపిస్తే అక్కడి ప్రజలు ప్రశ్నిస్తారన్నారు. కానీ మన తెలుగు ప్రజల్లో అంతటి చైతన్యం లేదన్నారు. ప్రసార మాధ్యమాలు భాషని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. వాటిలో మార్పు తీసుకురావడం ముఖ్యమని, పత్రికలు, టీవీ, సినిమాల్లో తెలుగు పదాలే వాడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తెలుగుకి తగినంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## వెల్దుర్తి మండలం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**మాచర్ల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డిగూడెం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని యువ నాయకులు జూలకంటి అక్కరెడ్డి రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, తెదేపా స్టేట్ సెక్రటరీ కళ్లం రామాంజిరెడ్డి నిర్వహించారు. మండల పార్టీ నాయకులతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మోడల్ స్కూల్, రైతు భరోసా సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను స్వయంగా కలిసి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఎనిమిది నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఎన్డీయే ఃకూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి మద్ధతు పలకాలని ఓటర్లను కోరారు.

## మంచికి పట్టం కడదాం : స్పెల్టో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పయర్ల నాగయ్య

**పొన్నూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మంచికి పట్టం కట్టేవిధంగా విద్యావంతులు, మేధావులు ఆలోచన చేయాలని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్య అన్నారు. అధ్యాపక, ఉపాధ్యాయ, నిరుద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న మంచి వ్యక్తి కెఎస్ లక్ష్మణరావని, ఆయన మంచి తనానికి పట్టం కడదామన్నారు. సుదీర్ఘకాలంగా అన్ని వర్గాల సమస్యలను తెలుసుకొని పోరాటం చేస్తున్న, ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న నాయకుడు లక్ష్మణరావు అని ఆయన నాయకత్వాన్ని బలపరిచేవిధంగా విద్యావంతులు ఆలోచన చేయాలన్నారు. నాకు పలానా సమస్య ఉంది అని ఆయన దగ్గరకు వెళితే నేనున్నానంటూ సమస్య పరిష్కారం అయ్యేవరకు విశ్రమించని నాయకుడు లక్ష్మణరావు అని, అలాంటి వ్యక్తిని ఎన్నుకొని పెద్దల సభకు పంపాల్సిన బాధ్యత ప్రతి గ్రాడ్యుయేట్‌పై ఉందన్నారు. స్పెల్టో లక్ష్మణరావుకు పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు. లక్ష్మణరావు గెలుపుకోసం నిస్వార్థంగా ప్రచారం చేస్తూ విద్యావంతులను, మేధావులను, పండితులను, స్కాలర్స్‌ను కలుస్తుందన్నారు. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేవిధంగా ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళాశాలల సంఘం అధ్యక్షుడు కావూరి గోవిందరాజులు, కార్యదర్శి యం.రాకేష్, కొండపల్లి విల్సన్ తదితరులున్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించండి సారూ!

### -ఎస్టీయు నాయకుల వినతి

**పొన్నూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మునిసిపల్ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను



పరిష్కరించాలని కోరుతూ ఎస్టీయు ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జిఐఎస్, పిఎఫ్ పెండింగ్ ఉన్నాయని వాటనికి పరిష్కరించేవిధంగా ఆలోచన చేయాలని కమిషనర్‌ను ఉపాధ్యాయులు కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. జిఐఎస్ చెల్లింపుకు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. పిఎఫ్ ఖాతాలు పరిశీలించి సొమ్ము చెల్లింపులకు చర్యలు తీసుకొంటామన్నారు. నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాతృభాష మన హృదయానికి దగ్గరైన భాష

### -విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

**పొన్నూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మాతృభాష మన హృదయానికి బాగా దగ్గరైన భాషని, మాతృభాషని ఎవరూ కూడా మరిచిపోవద్దని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు సూచించారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మాతృభాష విద్యా రంగంలో అనేక ప్రయోజనాలను



అందిస్తుందన్నారు. పిల్లల అభ్యాసం, సృజనాత్మకత, నైపుణ్యాలు పెరిగేలా చేస్తుందన్నారు. పిల్లలు తమ మాతృభాషలో నేర్చుకున్న విషయాలను త్వరగా అర్థం చేసుకుంటారని, సృజనాత్మకత-ఆలోచనా విధానం మెరుగవడం-కొత్త ఆలోచనలను, సమస్య పరిష్కార విధానాలను సులభంగా అభివృద్ధి చేసుకొంటారని చెప్పారు. మాతృభాష బలంగా ఉంటే, ఇతర భాషలు (ఆంగ్లం, హిందీ) నేర్చుకోవడం సులభమవుతుందన్నారు. అధ్యాపకులు మాతృభాషలో బోధించడం వల్ల బోధన నాణ్యత మెరుగవుతుందన్నారు.



విద్యార్థులు వారి సొంత భాషలో చదువుతుంటే, నైతిక విలువలు, సంస్కృతి, సామాజిక బాధ్యత గురించి చక్కగా అర్థం చేసుకుంటారని తెలిపారు. మాతృభాషలో మాట్లాడడం వల్ల వ్యాపారాలు, సామాజిక కార్యక్రమాల్లో సులభంగా భాగస్వామ్యం కాగలదరని చెప్పారు. బహుభాషా నైపుణ్యం ఉన్నవారికి గ్లోబల్ మార్కెట్‌లో మంచి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. మాతృభాషలో అభ్యసించడం వల్ల పిల్లలకు నమ్మకం, ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీధికుక్కల స్వైర విహారంతో ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు

**చిలకలూరిపేట, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** పట్టణంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తూండటంతో తమ కార్యకలాపాలను చేసుకోవాలంటే భయభ్రాంతులకు గురి అవ్వాల్సి వస్తుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల పట్టణంలో కుక్క కాటుకు గురై పలువురు ప్రజలు ఆసుపత్రిపాలైన సంఘటనలు జరగటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం పురుషోత్తమపట్నం, సుబ్బయ్యతోట, అడ్డరోడ్డు సెంటర్‌లో షుమారు 18మందిని కుక్కలు కరిచాయని, తాజాగా శుక్రవారం గుర్రాల చావిడి, కబేళా ప్రాంతంలో కుక్కకాటుకు పలువురు గురయ్యారని ఆ ప్రాంత ప్రజలు తెలియచేస్తున్నారు. పట్టణంలో పగలు, రాత్రులు ప్రజలు రోడ్ల వెంబడి నడవాలంటే ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మీదకు ఎక్కువ సంఖ్యలో వీధికుక్కలు దాడిచేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేవిధంగా తగు చర్యలు తీసుకోవలసినదిగా పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వం డోలి మోతలపై స్పందించాలి

### -గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్



**చిలకలూరిపేటటౌన్, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** గిరిజన గ్రామ ప్రజలకు రోడ్డు సౌకర్యాలు లేక, వైద్యం అందక అనారోగ్యం బారిన పడి గిరిజన ప్రజలు మృతి చెందుతున్నారని ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి శ్రీనునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఆర్‌టి సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా కుక్కనూరు మండలం పెదరావిగూడెం పంచాయితీలోని బండారిగూడెంలో యం దేవమ్మ అనే గిరిజన మహిళ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సరైన సమయంలో వైద్య సహాయం అందక మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. డోలి మోతలు లేని గ్రామాలు చూస్తానన్న కూటమి ప్రభుత్వం దీనికి ఏమని సమాధానం చెప్తుందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం గిరిజన మహిళ మృతిపై స్పందించి తగు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణం గిరిజన గ్రామాలకు రోడ్డుసౌకర్యం కల్పించాలని శీనునాయక్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించే నాయకునికి అండగా నిలవాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** యువత భవిష్యత్, రాష్ట్ర భవిష్యత్ గురించి నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి యువత అండగా ఉండాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈనెల 27 వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం పట్టణంలోని పలు విద్యా సంస్థలు, కార్యాలయాలు సందర్శించి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివిన చదువుకు తగిన ఉపాధి లభించకపోతే తాము బాధపడటమే కాకుండా తమ కుటుంబం కూడా వేదన పడుతుందనే విషయాన్ని యువత గుర్తించాలన్నారు. యువత జీవితం బాగుపడాలంటే రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని అప్పుడే యువతకు ఇబ్బడి ముబ్బడిగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆ విధంగా భవిష్యత్తును ముందే ఆలోచించే నేర్పు దూరదృష్టి కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆలపాటికి మద్దతు తెలియజేయాలని కోరుతూ ఏయంజి, మోదరన్ కళాశాల, రోహిణీ డిగ్రీ కళాశాల, నిఖిల డిగ్రీ కళాశాల, ప్రసన్నలక్ష్మి విద్యాలయాలను సందర్శించి ప్రత్తిపాటి కలిసి ఆలపాటి గెలుపుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి,జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, టీడీపీ నాయకులు కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, మద్దుమాల రవి, నరసింహారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కె రజినీకాంత్ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** పట్టణంలోని 17 వార్డుకి చెందిన కె.రజినీకాంత్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం రజినీకాంత్ గృహానికి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## 23న అవగాహనలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 15సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈ వారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్న జీబిఎస్ వ్యాధిపై మరియు జ్వరాలు,దగ్గులాంటి సీజనల్ వ్యాధులపై అవగాహన ఆరోగ్యసభ జరుగుతుందన్నారు.ఫిబ్రవరి 23న ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలోజరిగే ఆరోగ్యసభలో సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు.ఈ అవకాశాన్ని ఆరోగ్యాభిలాషులందరూ ఉపయోగించుకోవాలసిందిగా అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆలపాటి గెలుపుతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

**-ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్**

**గుంటూరు తూర్పు, ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యువత, ఉద్యోగులకు సీఎం చంద్రబాబు నాయుడు ఎంత మేలు చేశారో గుర్తు చేసుకోవాలని, అదే జగన్ అధికారంలో ఉండగా ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, వేధింపులతో ఉద్యోగులు ఎంత ఇబ్బందులు గురయ్యారో విద్యావంతులు ఒక్కసారి ఆలోచించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆలపాటి రాజాను గెలిపించాలని కోరుతూ బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలు, వాసవి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పట్టభద్రులను కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎనిమిది నెలల కాలంలో జరిగిన ప్రగతి గురించి వారికి వివరించారు. పారిశ్రామికంగా గత వైకాపా కాలంలో రాష్ట్రం ఎంత వెనుకబడింది.. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి పురోగతి సాధించిందనే విషయాలను వారితో చర్చించారు. విద్యావేత్త, సీనియర్ రాజకీయ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ద్వారా గుంటూరు జిల్లా యువత సత్తాను చాటి చెప్పాలని సూచించారు. రాష్ట్రం బాగుండాలంటే, యువతకు ఇంకా ఉద్యోగావకాశాలు రావాలంటే ప్రణాళిక, విజన్ ఉండాలని, సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ ఉన్న నాయకుడని చెప్పారు. 1996లో 2020 విజన్ ను ప్రకటించి హైదరాబాద్ లో హైటెక్ సిటీ నిర్మించారని, ఇప్పుడు యువత ఐటిరంగ జీతాలు తీసుకుంటుందంటే సీఎం చంద్రబాబు ఘనతేనని స్పష్టం చేశారు. మళ్లీ స్వర్ణాంధ్ర 2047 విజన్ తో రాష్ట్రాన్ని ప్రపంచం మన వైపు చూసేలా తీర్చిదిద్దుతున్నారని, దీనికి విద్యావంతులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ఆలపాటి రాజాకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విన్నవించారు ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ చైర్మన్ మరెడ్డి, గుంటూరు ఈస్ట్ అబ్జర్వర్ గంజాం రాఘవేంద్ర, కొనకళ్ళ సత్యం డిప్యూటీ మేయర్ సజీల, పద్మావతి వంగర ఏడుకొండలు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పథకాల అవసరాన్ని పెంచుతున్న పాలకులు,పార్టీలు

**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** వనరులు,ప్రజాచైతన్యం గల మనదేశానికి స్వాతంత్ర్యం లభించిన 75సంవత్సరాల తర్వాత కూడా ఉచిత పథకాల అవసరం కొనసాగుతుండటే ప్రభుత్వాలు,పార్టీలు తామే చేసిన రాజ్యాంగాన్ని,చట్టాలను నిజాయితీగా అమలు పర్చకపోవడమే కారణమని అవగాహన సంస్థ అధ్యక్షులు జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు అన్నారు.సంస్థ కార్యాలయంలో ఉచిత పథకాల దోరణి-మూలం-పరిష్కారం అన్న అంశంపై పాల్గొన్నవారు మాట్లాడారు.సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఉచిత పథకాల గురించి సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో దేశంలో మరోసారి ఈ పథకాలు ఉచితమా? అనుచితమా? అన్న చర్చ జరుగుతుందన్నారు.విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ చాలా దేశాల్లో భూసంస్కరణలు మంచి ఫలితాలు ఇవ్వటమే కాక వ్యవసాయ రంగంలో సంపదసృష్టి జరిగి అది పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగ పడిందన్నారు.సమావేశంలో న్యాయవాది అవధానుల హరి,విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు,తదితరులు ప్రసంగించారు.

## సీపీఐ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం

**మాచర్ల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో శుక్రవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంత వాసుల కలగా మిగిలిన వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి ఈ నెల 27న ప్రారంభం కానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. వెల్దుర్తి మండలం నుంచి ఎంతోమంది ఎమ్మెల్యేలుగా గెలిచి చలమజికి అవుతూ, వరికపూడిసెల నిర్మాణానికి కృషి చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించేలా కూటమి నాయకులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే నియోజకవర్గ ఎమ్మెల్యేలు నైతికంగా పదవులు నుంచి తప్పుకోవాలన్నారు. మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం నుంచి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేసేందుకు అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ మాచర్ల, దుర్గి సెక్రటరీలు మిద్దెపోగు బాబూరావు,శివయ్య, రైతు సంఘం నాయకులు తోట అంజనేయులు, బీఎస్పీ నాయకులు గుండాల సైదులు, గురజాల అప్పారావు, ఎం సీపీఐ నాయకులు బాలు లింకన్, పీడీఎఫ్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లారెడ్డి, వరికపూడిసెల సాధన సమితి సభ్యులు కుర్రి పున్నారెడ్డి, బండారు సుబ్బారావు, నలబోలు శివారెడ్డి, నర్ర రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు మరిచిన కూటమి ప్రభుత్వం

**-ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి**

**కొల్లిపర, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** గడసిన ఎన్నికల్లో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలకు ఏమి చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రశ్నించారు.శుక్రవారం కొల్లిపరలో ఆయన మాట్లాడుతూ జాబ్ కేలండర్ ప్రకటిస్తామని ..నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా మహిళలు..నిరుద్యోగులు..యువకులను పట్టించుకోకపోవటం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



### ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐబిఎం వర్క్‌షాపు

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ సంస్థ ఐబిఎం విద్యార్థినులకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ దరువూరి ద్రావ్య వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఐబిఎం ప్రతినిధి షణ్ముఖ్ రిసోర్స్ పర్సన్‌గా మాట్లాడారు. వర్క్‌షాపులో మొత్తం 150మంది కంప్యూటర్ సైన్స్ విద్యార్థినులు పాల్గొన్నారని వారికి ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌పై వివిధ అంశాలు తెలపాటం జరిగిందన్నారు. విద్యార్థులు తమ స్కిల్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలనితెలిపారు. విద్యార్థినులకు సర్టిఫికేట్‌లను కళాశాల డైరెక్టర్ దరువూరి ద్రావ్య అందించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ జె రవికిరణ్, నవీన్, రాధిక, సీతార తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో కమిషనర్ పర్యటన

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పురపాలక సంఘ పరిధిలో మహాశివరాత్రికి వేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ జశ్వంత్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పురపాలక సంఘ పరిధిలో 3,4 డివిజన్ లలో పారిశుధ్య కార్మికుల మస్టర్‌లను పరిశీలించారు. వర్కర్లు తమకు కేటాయించిన విధులను ఖచ్చితంగా ఉదయం 5.30 గంటల నుండి నిర్వహించాలన్నారు. వార్డు పర్యావరణ కార్యదర్శులు తమకు



కేటాయించిన పరిధిలో విధులను ఎటువంటి లోపాలు లేకుండా చేయాలన్నారు. టైమ్‌స్టాప్ కెమెరాతో తీసిన ఫోటోలను గ్రూపులలో పోస్ట్ చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వర్కర్లు, మేస్త్రీలు రాబోయే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణమంతా పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పార్కులు, ఫౌన్‌టేన్‌లు చక్కగా పని చేసే విధంగా చూడాలని, ఎక్కడా అసౌకర్యాలు కల్పించకూడదని కమిషనర్ జశ్వంత్‌రావు ఆదేశాలిచ్చారు.

## భూముల రీసర్వే వేగవంతంగా పూర్తి చేయాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన భూముల రీసర్వే వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్నగంజాం మండలం మోటుపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను



జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద సర్వే చేపట్టిన గ్రామాల్లో సర్వే పనులు రైతుల సహకారంతో పూర్తి చేయాలని ఆయన చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేయబడిన గ్రామాల్లో సర్వే బృందాలు ఏర్పాటు చేసుకొని సర్వే పనులు చేపట్టాలని ఆయన సూచించారు. చిన్నగంజాం మండలం మోటుపల్లి గ్రామంలో 3వేల960 ఎకరాల భూములు ఉన్నాయని వీటన్నిటినీ రీ సర్వే చేపట్టడం జరుగు తుందన్నారు. మోటుపల్లి గ్రామానికి చెందిన పల్లపోలు శ్రీనివాసరావు అనే రైతు భూమిలో చేపట్టిన రీసర్వే పనులను పరిశీలించారు. రీ సర్వే పనులు ఎలా జరుగుతున్నాయనే విషయాల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోటుపల్లి గ్రామంలోని ప్రసిద్ధ చారిత్రాత్మక వీరభద్ర స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. చినగంజాం గ్రామంలోని సాల్ట్ భూములను ఆయన పరిశీలించారు. చిన్నగంజాం లో సాల్ట్ భూముల్లో పనిచేసే రైతు కూలీలతో ఉప్పు తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. చినగంజాం ఉప్పు భూముల్లో పనిచేసే మహిళ కూలీ వెళ్ల రాణి తాను కూలి పని చేసుకుంటూ గృహన్ని నిర్మించుకున్నానని ఇంటి కోసం అప్పు తెచ్చినదానికి 3రూపాయల వంతున వడ్డీ కడుతున్నానని తనకు సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం నుండి శ్రీనిధి లేదా ముద్ర లోన్ ఇస్తామని తెలియజేశారు. అనంతరం చిన్నగంజాం లోని రామకోటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, చిన్నగంజాం తహసిల్దార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌ల భారం తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది

**- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**

**పెదకాకాని,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారిపై యాప్‌ల భారం విపరీతంగా ఉందని,ఇక ఆ యాప్‌ల భారం తొలగించాలని కూటమిప్రభుత్వం నిర్ణయించింది అని మాజీ మంత్రి తెలుగుదేశం రాష్ట్ర ప్రధానకార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు వివరించారు. పెదకాకాని మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో గల జిల్లా పరిషత్



హైస్కూల్‌వద్ద ఉపాధ్యాయులు పట్టభద్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందజేశామని,డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్నభోజన పథకం తీసుకువచ్చారని.గుర్తు చేశారు.విద్యాశాఖలో రాజకీయజోక్యం ఉండకూడదు అని మంత్రి నారాలోకేష్ వెల్లడించినట్లు అదే విధంగా విద్యాశాఖకు సంబంధించిన ఏకార్యక్రమంలోను తమ ఫోటోలు ఉండవని తమపార్టీ రంగులుఉండవని స్పష్టం చేసినట్లు తెలిపారు.గతంలో విజయవాడలో ఉపాధ్యాయులు దెబ్బకు జగన్ కు మొదటిసారిగా భయం పుట్టిందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఎ.ఎస్.రామకృష్ణ,వలివేటి మురళికృష్ణ,మన్నవ సుబ్బారావు,తిరుమలరెడ్డి, సింహాద్రిశ్రీనివాసరెడ్డి, బుల్లామోజేష్,సి.హెచ్.వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కన్నా సమావేశం

**రాజుపాలెం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాజుపాలెం కేజీబీవీ స్కూల్ నందు టీచర్లతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, ప్రతిభావంతులు, మేధావులు అందరూ జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన అధ్యక్షులు తోట నరసయ్య, గ్రంధి సదాశివరావు, పసుపులేటి వెంకటస్వామి, పూజల కోటయ్య, నర్రా బాబురావు, అంకాల ప్రభుదాస్, పులిబండ్ల సాంబశివరావు, పెద్దింటి శ్రీనివాసరావు, గుర్రాల జగన్‌మోహన్‌రావు, ఒగం రాజా, కేదార్ రమేష్, చొక్కా మల్లికార్జున, ఎస్.ఓ.జ్యోతిర్మయి, వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 23న అంకమ్మతల్లి 56వ తిరునాళ్ల

**రాజుపాలెం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** అంకమ్మతల్లి 56వ తిరునాళ్ళ మహోత్సవాన్ని ఆదివారం రాజుపాలెం - గంగిరెడ్డిపాలెంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలియజేశారు. జగన్ యూత్ ఆధ్వర్యంలో రాత్రి 8 గంటలకు ఏఎస్ ఈవెంట్స్ వారిచే పాటకచేరి జరుగుతుందన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గ్రంధి సదాశివరావు - నాగమణి దంపతులు అమ్మవారి దేవస్థానానికి లైటింగ్ వేయిస్తున్నట్లు తెలిపారు. గంగిరెడ్డిపాలెం గ్రామ ప్రజలు పెదకాపు పగడాల కంభగిరి, రాజుపాలెం గ్రామ ప్రజలు పెదకాపు మర్రి రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారని వారు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని, అమ్మవారి దీవెనలు పొందాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.

## దాతల సాయం మరువరాదు

**-దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాంబిరెడ్డి**

కొల్లిపర,పిబ్రవరి 21 ప్రభాతవార్త: దాతల సాయం మరువరాదని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోర్ల మాణిక్యాలరావు జ్ఞాపకార్థం మోర్ల కోటేశ్వరమ్మ అల్లుడు యాసారపు వినోద్‌కుమార్ ధర్మపత్ని డాక్టర్ రోజారాణి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు



సంభంధించిన మెటీరియల్‌ను అందించారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ దాతలు విద్యార్థులకు అందించిన మెటీరియల్‌ను సద్వినియోగించుకోవాలన్నారు.విద్యార్థులకు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు.విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకుని ఇటు పాఠశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి,నాయకులు కొల్లి కోటిరెడ్డి,కంచర్ల అమృతరాజు,చాగంటి నారాయణరెడ్డి,సుబ్బారెడ్డి,తుమాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుందాం

**-మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి**

**కొల్లిపర,పిబ్రవరి 21 ప్రభాతవార్త:** పట్టభద్రులు..ఉద్యోగులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుందామని మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని తూములూరు హైస్కూల్,కొల్లిపర హోలీక్రాస్ స్కూల్‌లలో కూటమి నాయకులు అందరూ కలసి ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా చిన కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆలపాటి నాయకత్వం అవసరమన్నారు.పట్టభద్రులను..ఉద్యోగులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలన్నారు.కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాంబిరెడ్డి,కంచర్ల అమృతరాజు,రఫీ,బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రాంతాలలో పార్టీని బలోపేతం చేయండి : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పట్టణ ప్రాంతాలలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్ షేక్.రెహమాన్ పల్నాడు జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా రెహమాన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యావంతుడు, మాజీ కౌన్సిలర్‌గా ఉన్న రెహమాన్ పార్టీకి నిబద్ధతతో పని చేశారని తెలిపారు. వారి సేవలకు గుర్తింపుగా జిల్లా మున్సిపల్ విభాగానికి అధ్యక్షునిగా పార్టీ అధిష్ఠానం నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం జిల్లాలో



అన్ని పురపాలక సంఘ పరిధిలో పార్టీని క్షేత్రస్థాయి నుండి పటిష్టం చేయాలన్నారు. రెహమాన్ మాట్లాడుతూ ప్రస్తుత కౌన్సిలర్లను సమన్వయం చేసుకొని రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మరువలేనిది,మధురమైనది మాతృభాష

**కర్లపాలెం, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** మరువలేనిది మధురమైనది మాతృభాష అని కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. శుక్రవారం మాతృభాష దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు మాతృభాషపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలోనికి వచ్చిన తరువాత తల్లి ఒడి నుంచి నేర్చుకున్నది మాతృభాష అన్నారు.



ఒక మనిషి తన భావాన్ని పూర్తిగా మాతృభాషలో మాత్రమే వివరించగలరని ఆయన అన్నారు. అలాంటి మాతృభాషను మనందరం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏం ఇందుమతి. డి ఎల్ ప్రసన్నలక్ష్మి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవలు

**కర్లపాలెం, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం ఎంపీరాజుపాలెం బంగారు రెడ్డిపాలెంకు చెందిన నిరుపేద కుటుంబం కు 10 కేజీల బియ్యం పంపిణీ కార్యక్రమం



నిర్వహించారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగాఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ( ఆర్మీ రిటైర్డ్ ) ,షేక్ ఇబ్రహీం, షేక్ బహదూర్ బాష ,షేక్ ఖాదర్ వలి తదితరులు పాల్గొన్నారు

## పశువులకు మెరుగైన వైద్యం అందించాలి

**కర్లపాలెం, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** పశువులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పశు వైద్యశాలను శుక్రవారం ఆయన సందర్శించి పశువైద్యాధికారి రేచల్ దివ్య కు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యాధులు బారిన పడిన పశువులకు సకాలం లో వైద్యం చేయించి పాల ఉత్పత్తి తగ్గకుండా కాపాడుకోవాలన్నారు. అనారోగ్యం తో బాధపడుతున్న గేదెలు, మేకలు, గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని చెప్పారు. పశువుల ఉత్పత్తి కి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి అనే అంశం పై రైతులకు తగు సూచనలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిని రేచల్ దివ్య, షేక్ రేహంతున్నిసా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చికెన్,కోడిగుడ్లు వినియోగం పై అవగహన సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన పెదకాకానిగ్రామంలోని మెయిన్ సెంటర్



నందు జీబిఆర్ హేచరీస్ మరియు పెదకాకానిలోని ఎస్.ఎల్.సి బ్రాయిలర్ చికెన్ ఫ్రెష్ షాపు వారి ఆధ్వర్యంలో పెదకాకాని సెంటర్లో చికెన్-కోడిగుడ్లు వినియోగంపై గ్రామప్రజలకు అవగామన సదస్సు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్.ఎల్.సి.చికెన్ షాపు యాజమాని చిన్నమాట్లాడుతూ చికెన్,కోడిగుడ్లు ప్రోటిన్ కి సంబంధించిన అహరమని,చికెన్ ను కోడిగుడ్డును బాగా బాయిల్‌చేసి ఆహారంగా తీసుకోవచ్చుని తెలిపారు.మనకోళ్లకు వైరస్ సోకిందని తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు.అనంతరం గ్రామప్రజలకు ఎటువంటి అపోహలు లేకుండా బిర్యానీ రైస్‌తో చికెన్ కర్రీతో అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

### ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి : బోనబోయిన, గాదె

**గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** ఈ నెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న నగరంపాలెం లోని స్టాల్ గర్ల్స్ హై స్కూల్, సంపత్ నగర్ లో గల వైష్ణవి స్కూళ్లలో ఉన్న ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఉపాధ్యాయులు అందరితో కలిసి రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ని గెలిపించాలని వారిని అభ్యర్థించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఉన్న ఆలపాటి ని గెలిపించుకోవడం వలన టీచర్లకు వారివారి సమస్యల పరిష్కారానికి ఒక్క చక్కటి అవకాశం దొరుకుతుందని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి అత్యంత సన్నిహితంగా ఉండే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించుకోవడం వలన గ్రాడ్యుయేట్స్ అందులోను ముఖ్యంగా నిరుద్యోగులు మీ బంగారు భవిష్యత్తు కోసం మంచి దారి ఏర్పాటు చేసుకున్న వారు అవుతారని అన్నారు. అలాగే రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంతో రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కి తమ ప్రథమ ప్రాధాన్యత ఓటును 1 అంకె వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని మీ తరపున ప్రతినిధిగా మీ సమస్యలు పరిష్కరించుకునే వ్యక్తిగా ఎన్నుకోవాలని మీడియా ముఖంగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దిరాల మ్యాని , జనసేన పార్టీ గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు చిట్టాల త్రినాధ్, కార్పొరేటర్ ఎర్రంశెట్టి పద్మావతి, నగర కమిటీ సభ్యులు కటకంశెట్టి విజయలక్ష్మి, వార్డు అధ్యక్షులు బాలకృష్ణ, తాడికొండ కిషోర్, దలవాయి కిషోర్, సంజీవ్, జెట్టిబాబు, కృష్ణ, కోటేశ్వరరావు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుస్టేషన్‌లో జనసేన నాయకుల పిర్యాదు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : జనసేన నాయకులు పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, ఆర్కే యాదవ్, కృష్ణంశెట్టి గోవిందరావు, చిన్నపల్లి సాంబశివరావు, జయరాం, జానీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సైన్యం పేరుతో సోషల్ మీడియాలో డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కుటుంబంపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారని తెలిపారు. కుంభ మేళాలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌పై దారుణంగా పోస్టులు పెట్టడం శోచనీయమన్నారు. పోస్టులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి



అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### నడుము నొప్పికి శలభాసనం,భుజంగాసనం సంజీవిని లాంటివి

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** ఆధునిక జీవనంలో మానవులు నడుము నొప్పితో ఎక్కువ మంది బాధపడుతున్నారని,ఆధునిక అల్లోపతి వైద్యంతోపాటు యోగా నిపుణుల పర్యవేక్షణలో శరీరాన్ని వెనుకకు వంచే శలభాసనం,భుజంగాసనం గొప్పగా ప్రయోజనం చేకూరుస్తుందని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.ఎస్.కృష్ణవేణి అన్నారు.స్థానిక సంపత్‌నగర్‌లోని "ప్రకృతి యోగ సంజీవినీ ట్రస్ట్" యోగా హాల్లో అవగాహన యోగా కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ వడ్డే నరహరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణవేణి ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడుతూ యోగాసనాలు సరైన శిక్షణలో నేర్చుకొని నిత్య సాదనచేస్తే విశేష ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సైకాలజిస్టు నరహరి బాబు మాట్లా డుతూ యోగధ్యానంతో మానసిక ప్రవృత్తులు మారి వ్యక్తినిష్ట,ఆత్మగౌరవం,ఆధ్యాత్మికశక్తి పొందవచ్చన్నారు.

# రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలి: బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు రైతుల రిజిస్ట్రేషన్, యూరియా అమ్మకాలు, ఈ పంట,ఈ కేవైసీ మరియు లోన్ల మంజూరు పై కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో మండలాల వారి వివరాలపై ఆరా తీశారు. పీఎం కిసాన్ లో ఉన్నటువంటి డేటా వెబ్ ల్యాండ్ లో వచ్చిన డేటా కచ్చితంగా ఉందా లేదా సరిచూసుకొని వాటికి ఆమోదం తెలపాలని తహశీల్దార్లు ను ఆదేశించారు. వీఆర్వో, తహశీల్దార్ లాగిన్ ను తనిఖీ చేసి వాటిని వెంటనే ఆమోదించాలని మండల రెవెన్యూ అధికారులను వీక్షణ సమావేశం ద్వారా ఆయన ఆదేశించారు.ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అదనపు ధరలతో అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానులపై అధికారులు తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.



బయట మార్కెట్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఆదేశించారు. 40 కేజీల యూరియా బస్తా ధర రూ.256.50 లను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ ధరకు మించి విక్రయాలు చేస్తే సదరు వ్యాపారులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. అన్ని మండలాలలో యుద్ధ ప్రాతిపదికన తనిఖీలు చేసి నివేదిక తయారు చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పంట రిజిస్ట్రేషన్ విషయంపై ఆరా తీశారు. తక్కువ రిజిస్ట్రేషన్ చేయబడిన సంబంధిత మండల అగ్రికల్చర్ అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా కారణములను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సిసిఆర్సి కార్డుల మంజూరులో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోబడతాయని ఆయన ఆదేశించారు. రైతులకు రుణాల మంజూరు విషయంలో ఎంఏఓ లను శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. తీసుకున్న లోన్లను తిరిగి చెల్లించే విధంగా, రుణాల వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు లోన్ల మంజూరు విషయంలో బ్యాంకర్లకు భరోసా కల్పించాలని మండల వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

# సకాలంలో అద్దెలు చెల్లించని షాపులను సీజ్ చేస్తాం

**-నగర కమీషనరు పులి శ్రీనివాసులు**

**గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** గుంటూరు నగర పాలక సంస్థ కు చెందిన షాపుల అద్దెలు మార్చి నాటికి నూరు శాతం చెల్లించాలని, బాకీలున్న షాపులను సీజ్ చేయడానికి రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఐ.ఎ.యస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక లీలా మహల్ ఎదురుగా గల నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాపుల లీజు దారులు 202425 ఏడాదికి సంబంధించిన అద్దె మొత్తాన్ని కమీషనర్ ఛాంబర్ లో కమీషనర్ కి అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, లీలా మహల్ ఎదురు ఉన్న నగర పాలక సంస్థ 21 షాపుల లీజుదారులు పూర్తి అద్దె రూ. 10,99,245 చెల్లించారని, అలాగే మిగిలిన షాపింగ్ కాంప్లెక్స్ వాళ్లు కూడా అద్దెలు చెల్లించి నగరాభివృద్దిలో భాగ స్వాములు కావాలన్నారు. సకాలంలో అద్దెలు చెల్లించని షాపులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే కాంప్లెక్స్ ల వారీగా షాపుల అద్దెలు, బకాయిల పై వివరాలు తీసుకున్నామని, మార్చి 1 నుండి సమగ్ర యాక్షన్ ప్లాన్ చేపడతామన్నారు. సదరు కార్యక్రమంలో ఆర్.ఓ షాదిక్ బాషా, ఆర్.ఐ కాశియ్య, షాపుల లీజు దారులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధం

**-నగర కమిషనరు పులి శ్రీనివాసులు**



**గుంటూరు కార్పొరేషన్,ఫిబ్రవరి21, ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మార్చి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలులో ఉంటుందని, ప్రజారోగ్య రక్షణ దృష్ట్యా నగర ప్రజలు, వ్యాపార సంస్థలు నిషేధంకు నగరపాలక సంస్థకు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ (అమెండ్మెంట్ రూల్స్) 2021 ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ ప్లాస్టిక్ బ్యాగ్స్ (వదరపు) మీటర్ కి 60 గ్రాముల కన్నా తక్కువ బరువు) ఉత్పత్తి, స్టోర్ చేయడం, వినియోగం, విక్రయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ నిషేధించిందన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని కూడా నిషేధించడం జరిగిందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, క్యాండీ స్టిక్స్, ఐస్ క్రీమ్ స్టిక్స్, అలంకరణ కోసం వినియోగించే ధర్మాకోల్, ప్లాస్టిక్ ప్లేట్స్, కప్స్, గ్లాసులు, ఫోర్క్, స్పూన్స్, కత్తులు, స్ట్రాలు, ట్రేలు, స్వీట్ బాక్స్ ల్లో ప్యాకింగ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డ్ లు, సిగరెట్ ప్యాకెట్స్, 100 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కల్గిన ఫ్లెక్సీ బ్యానర్లు, స్టిరర్స్ వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ఉత్పత్తి, విక్రయం అమలులో ఉంటుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన పలు రకాల క్యాన్సర్స్, సంతాన ఉత్పత్తి సమస్యలు, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, ప్రజారోగ్య, పర్యావరణ రక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిషేధంకు సహకరించాలని కోరారు. నిషేద నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సైబర్ నేరగాళ్ళ అరెస్టు

- సైబర్‌నేరాలకు గురైనట్లయితే 1930 నెంబర్‌కు కాల్ చేయాలి
- కేసు దర్యాప్తులో విశేష కృషి చేసిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్‌డూడి

**బాపట్ల, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను ఆశ చూపించి ప్రజలను మోసం చేస్తున్న పాన్ ఇండియా సైబర్ నేరగాళ్ళను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరస్తులు వాట్సాప్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను తమ ప్రొఫైల్ పిక్చర్ గా డిపిగా ఉపయోగించి మోసాలకు పాల్పడ్డారన్నారు.ఈ కేసును సవాలుగా తీసుకుని ఎటువంటి ఆలస్యం చేయకుండా ఐటీ కోర్ బృందం మరియు జిల్లా పోలీసుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మోసగించడం జరిగింది. సమన్వయ పోర్టల్ పరిశీలించగా రాజస్థాన్ లో (7), ఉత్తర ప్రదేశ్ లో (3), మరియు జార్ఖండ్ లో (2) మొత్తం 12 ఐటీ కేసులలో నిందితుడి మొబైల్ నెంబర్ లింక్ చేయబడినది. నిందితులు గతంలో పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 159/2022) మరియు కడప 1టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 383/2022)లో సైబర్ మోసం కేసులలో జనవరి 2023లో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినప్పుడు, పోలీసులు అనేక బ్యాంకు ఖాతాలు మరియు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సమన్వయ పోర్టల్ శోధనలో 20 రాష్ట్రాలు మరియు 4 కేంద్రపాలిత ప్రాంతాలలో వీరి పై మొత్తం 213 ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి, సుమారు ..4 కోట్లు మోసం చేశారని తెలిపారు. జిల్లా ప్రజలని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ అపరిచితులను నమ్మి మోసపోవద్దని, సైబర్ నేరస్తులు రక రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, ఇటువంటి మోసాలను



ఇప్పటివరకు ఈ కేసులో ముద్దాయిల వద్ద నుండి రూ.1,90,000/ నగదు, 3 సెల్ ఫోన్లను 15 సిమ్‌కార్డులు, 2 ఏటిఎం కార్డులు, 4 బ్యాంకు పాస్‌పుస్తకాలను దర్యాప్తులో బాగంగా మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేశామని తెలిపారు. వీరిపై దేశంలో 6 రాష్ట్రలలోని పోలీస్ స్టేషన్ లలో 94 సైబర్ ఫిర్యాదులు నమోదు అయినట్లు, వీరు లక్షల రూపాయల మోసానికి పాల్పడినట్లు గుర్తించినట్లు తెలిపారు.బాధితులకు 5 ఫోన్ నంబర్‌లను ఉపయోగించి సైబర్ నేరస్థుల నుండి కాల్స్ వచ్చాయి. సమన్వయ పోర్టల్ లో శోధించగా అనుమానితులపై 36 ఫిర్యాదులు కనిపించాయి, మొత్తం ..16,02,403 నగదు దోచుకున్నారు. నిందితులు ఢిల్లీలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి వారి సైబర్ క్రైమ్ కార్యకలాపాలను నిర్వహించారు. కాల్ డేటా విశ్లేషించగా ఈ ఫోన్ నంబర్‌లకు అనుసంధానించబడిన 7 ఐఎంఈఐ నంబర్‌లను గుర్తించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కేసులో లోతైన దర్యాప్తు చేసి నేరస్థులు 96 సిమ్ కార్డులను ఉపయోగించినట్లు గుర్తించటం జరిగిందన్నారు. నిందితులు మొత్తం 96 సిమ్ కార్డులను ఉపయోగించి 132 మందిని మోసం చేశారు (ఏపిలో 107, తెలంగాణ 12 ఉత్తర ప్రదేశ్ 3, రాజస్థాన్ 7 జార్ఖండ్ 3) మొత్తం రూ.66,00,000/ అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నిత్యం పోలీస్ శాఖ ద్వారా అనేక రకాల అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవ్వరు అపరిచిత లింకులు పంపడం చెయ్యరన్నారు. ఎవరైనా ప్రభుత్వ పథకాల పేరుతొ మీకు కాల్ చేస్తే సంబంధిత అధికారులను సంప్రదించాలని, (లేదా) దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. అపరిచిత లింక్ లను క్లిక్ చెయ్యవద్దని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930 కు కాల్ చేసి తెలపాలని, సహాయం చేసేందుకు బాపట్ల జిల్లా టెక్నికల్ బృందం ఎల్లప్పుడు సిద్దంగా ఉంటారని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం కేసు దర్యాప్తులో, ఛేదనలో విశేష కృషి చేసిన చీరాల 2 టౌన్ సిఐ బి. నాగభూషణం, ఆర్.ఐ టి. శ్రీకాంత్, ఐ.టి కోర్ టెక్నికల్ టీం ఎస్.ఐ షేక్. నయాబ్ రసూల్, చీరాల 2 టౌన్ ఎస్.ఐ నాగశ్రీను, ఐ.టి కోర్ టెక్నికల్ టీం కానిస్టేబుళ్లు డి. సురేష్, కె. రాము, మహిళా కానిస్టేబుళ్లు ఐ. కీర్తి, డి. తబితలను జిల్లా ఎస్పీ అభినందించి, క్యాష్ రివార్డులను అందజేసినారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ మోయిన్, చీరాల 2 టౌన్ సిఐ బి. నాగభూషణం, ఆర్.ఐ టి. శ్రీకాంత్, ఐ.టి కోర్ టెక్నికల్ టీం ఎస్.ఐ షేక్. నయాబ్ రసూల్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

**బావట్ల,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రభుత్వం చేపట్టిందని,ప్రభుత్వ సేవల్లో నాణ్యత, ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వ సేవల్లో ప్రజాభిప్రాయంపై వివిధ శాఖల జిల్లా



అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలన్నింటిలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఐ వి ఆర్ ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానంలో ఆర్ టి జి ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంతృప్తి స్థాయి నమోదు ఆధారంగా జిల్లాకు, అలాగే ఆయా ప్రభుత్వ శాఖలకు గ్రేడ్ లు ప్రకటిస్తుందన్నారు. క్రమశిక్షణ, వినయంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించాల్సి ఉందన్నారు. ఉద్యమ స్ఫూర్తితో గ్రేడ్ విధానానికి తగినట్టుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉందని ఆయన పలు సూచనలు చేశారు. పింఛన్ పంపిణీ, అన్న క్యాంటీన్ లు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, మహిళల సంరక్షణపై ప్రజాభిప్రాయ సేకరణ మొదలుకానున్నదన్నారు. పోలీసుల సేవలు, రెవిన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్, వైద్య సేవలు, పురపాలక సేవలలో పన్నులు, ఇసుక విక్రయాలు, నిత్యవసర సరుకుల పంపిణీ, దీపం2 పథకం అమలు తీరు తదితరమైన సేవలపై ప్రజాభిప్రాయ సేకరణకు ఐ వి ఆర్ ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానం అమలవుతుందన్నారు. ప్రభుత్వ సేవలు పొందగోరే వారు ఎవరైనా తమ మొబైల్ ఫోన్ నుంచి ఫిర్యాదులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ సూచికలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వైద్య సేవల్లో బాపట్ల జిల్లా 13వ ర్యాంకులో ఉండగా అన్నా క్యాంటీన్ నిర్వహణలో 13వ ర్యాంక్, దీపం2 లో మూడో ర్యాంక్, చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో 15వ ర్యాంక్ లో ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నందున అధికారులు శ్రద్ధతో పనిచేయాలని మార్గదర్శనం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిబిఎస్ వ్యాధి చికెన్, మటన్ తినడం వలన రాదు

**-ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు**

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** జిబిఎస్ వ్యాధి చికెన్, మటన్ తినడం వల్ల రాదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు.



అవాస్తవాలను ప్రచారం చేయవద్దని తెలిపారు. చికెన్, మటన్ వంటివి తినడం వలన ఈ వ్యాధి రాదన్నారు. కోడిగుడ్లు, ఫిష్ వంటివి నిరభ్యంతరంగా తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యాధిపై పూర్తి స్థాయిలో అపోహాలను తొలగించేందుకు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో ఈ వ్యాధికి సంబంధించి కేసులు పెద్దగా లేవన్నారు. ఈ వ్యాధి పురాతన మైందని, జ్వరం, విరోచనాలు వంటివి వచ్చినప్పుడు మనిషి నీరసపడతాడని, కాళ్ళు, చేతులు కదపలేని పరిస్థితి ఉంటుందన్నారు. దీనిపై ఎటువంటి భయాందోళన అవసరం లేదన్నారు. 99 శాతం పైగా రికవరీ అవుతారన్నారు. నరాలపై ప్రభావం చూపడం వలన కొంత మనిషికి ఇబ్బంది కలుగుతుందన్నారు. పరిశుభ్రత లేకపోవడం వలన ఇటువంటి వ్యాధులు సంక్రమిస్తా యన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తినే ఆహారం బాగా ఉడికించి తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచించారు.

**శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

కోటప్పకొండరోడ్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ రోడ్డులో రెండవ రోజు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలతో ఆరోగ్యం ప్రతి ఒక రికీ లభిస్తుందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు.

# కమిషనరుకు వీడ్కోలు పలికిన ఉద్యోగులు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** సత్తెనపల్లి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రేడ్-3 నుండి గ్రేడ్-2 కమిషనర్‌గా, ఆ వెంటనే పదోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ జోనల్ కమిషనర్‌గా ప్రమోషన్ పొందిన కమిషనర్ కొలిమి షమ్మీను, ఆయన సతీమణిని శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు



శాలువాలు కప్పి సత్కరించడంతో పాటు పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మీ మాట్లాడుతూ తాను విజయవంతంగా విధులు నిర్వహించేందుకు సహకరించిన ఉద్యోగులందరి సహకారం మరువలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# 1960 సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి : న్యాయవాదులు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** న్యాయవాద చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ



రెండవ రోజు శుక్రవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చట్టం 1960 సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో విధులు బహిష్కరించి తాలూక న్యాయస్థానంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కంబాల అనీల్‌కుమార్, బి.ఎల్.చిన్నయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి, కొల్లా వెంకటేశ్వరరావు, దివ్వేల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్‌క ుమార్, కె.ఎన్.వి.హరిబాబు, చావా బాబురావు, ఎం.ఏడుకొండలు, షేక్.నాగూర్, గుజ్జర్లపూడి సురేష్, మదనమోహన్, గుర్రం పవన్‌కుమార్, బాదినేడి శ్రీనివాసరావు, చావా నాగరాజు, ఉడుమల వెంగళరెడ్డి, ఏసురత్నం, భవ్య, బయ్యవరపు నరసింహారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా చూడాలి : పల్నాడు కలెక్టరు



**నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామాలకు మంచినీటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటి విడుదలలో త్రాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రధానమైన రెండు రిజర్వాయర్‌లలో కొంత నీటి కొరత ఉందన్నారు. సాగునీటి విడుదలకు వారబందీ ప్రక్రియలో నీటిని విడుదల చేయాలన్నారు. అన్ని చెరువులలో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలన్నారు. జిల్లాకు ఎంత నీరు అవసరం ఉంది అనే విషయాలను నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువులలో నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాగుకు సంబంధించి రైతులకు పొదుపుగా నీటిని ఎలా వినియోగించాలో అవగాహన కల్పించాలన్నారు. లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు శ్యామ్‌ప్రసాద్, మురళీకృష్ణ, శ్రీహరి, ప్రేమ్‌కుమార్, మురళీ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బారీ మోజార్టీతో గెలిపించండి : ఆలపాటి సతీమణి మాధవి

**తెనాలి, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** సుదీర్ఘ క్రియాశీలక రాజకీయాల్లో కుటుంబంతో కంటే ప్రజలకు దగ్గరగా ఉంటూ, వారికి సమస్యలకే ఎక్కువ సమయం కేటాయిస్తూ ప్రజల మనిషిగా నేడు ఎన్నికల బరిలో ఉన్న తన భర్త ఆలపాటి విజయం కోసం పట్టభద్రులు ఓటు వేయాలని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి ఆలపాటి మాధవి పట్టభద్రుల ఓటును అభ్యర్థించారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం కొనసాగుతున్న క్రమంలో శుక్రవారం ఆలపాటి సతీమణి ఆలపాటి మాధవి తెనాలి పట్టణంలోని విద్యా సంస్థలలో ప్రచారం నిర్వహించి ఓటును అభ్యర్థించారు. తొలుత చెంచుపేటలోని శ్రీ చైతన్య స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు వాస్తవ పరిస్థితులను వివరించారు. తనకంటే కూడా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురించి తెనాలి, వేమూరు నియోజకవర్గ ప్రజలకు ఎక్కువ తెలుసని అన్నారు. క్రియాశీలక రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తారని గడచిన ఎన్నికల్లో పొత్తు ధర్మానికి కట్టుబడి, తెనాలి ఎమ్మెల్యే సీటును త్యాగం చేస్తారని ముఖ్యమంత్రి వర్యులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రజా క్షేత్రంలో నిలిపారని అన్నారు. పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎన్నారై క్యాంపస్‌లో సిఇఓ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఆలపాటి మాధవి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో మన నాయకుడిని, ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం సమిష్టిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై విద్యా సంస్థల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక సరీ ్వస్ కమీషన్ ఫిబ్రవరి 23వ తేదిన నిర్వహించబోయే పరీక్షను వాయిదా వేయాలని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి,హైకోరు ట న్యాయవాది గుమ్మా శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.సా ్థనిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023డిసెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో మహిళలు,దివ్యాంగులు,.మాజీ సైనికులు,క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడంపై రోస్టర్ పాయింట్లు తప్పుఉన్నాయని,రోస్టర్ పాయింట్లు సరిచేసి ప్రాథమిక పరీక్ష నిర్వహించాలని అభ్యర్థులు ఏపిపిఎస్‌సి ని కోరారు.ఏపి రాష్ట్రప్రభుత్వం 2023ఆగస్టులో జారీ చేసిన జీవోనెం.77కు విరుద్దంగా రోస్టర్ పాయింట్లు కేటాయించారు.ఏపిపిఎస్‌సి మరియు అప్పటి ప్రభుత్వం అభ్యర్థుల ఆవేదనను పట్టించుకోకుండా 25ఫిబ్రవరి 2024న ప్రాథమిక పరీక్ష నిర్వహించింది.ప్రధాన పరీక్షలను పలుసార్లు వాయిదా వేసుకుంటూ చివరికి 23ఫిబ్రవరి 2025న నిర్వహించడానికి సన్నాహాలుచేస్తుంది.సుప్రీంకోర్టు మార్గదర ్శకాలను కూడా పాటించకుండా ఏపిపిఎస్‌సి వ్యవహరిస్తుంది.రోస్టర్ తప్పుల వనల సుమారు 90వేల మంది మానసిక ఆందోళనకు గురవుతున్నారు.రాష్ట్రప్రభుత్వం తక్షణమే గ్రూప్ 2 అభ్యర్థులు ఆందోళనకు గురికాకుండా రోస్టర్ తప్పుల విషయంలో తగిన హామీ ఇచ్చి,ప్రధాన పరీక్షలను వాయిదా వేసి,రోస్టర్ తప్పులను సరిచేసి ప్రధాన పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.రోస్టర్ తప్పులను సరిచేయకుండా ప్రధాన పరీక్షలను నిర్వహిస్తే అభ్యర్థులకు చాలా మానసిక,ఆరి ్థక నష్టం,భవిష్యత్తు దెబ్బతింటుందని చెప్పారు.రాష్ట్రప్రభుత్వం మరియు ఏపిపిఎస్సీ ఇంత ఆందోళన పరిసి ్థతుల్లో ప్రధాన పరీక్షలు నిర్వహించాలి ్సన అవసరం ఏంటని ప్రశ ్నించారు.ఉద్యోగాల భర్తీ విషయంలో న్యాయపరమైన వివాదాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఒకవేళ మొండివైఖరితో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులకు మద్దతుగా భవిష్యత్తులో అండగా ఉండి సుప్రీంకోర్టు లో న్యాయ పోరాటం చేస్తాను అని చెప్పారు.ఈ నోటిపికేషన్‌లో ఏమైనా అవకతవకలు జరిగితే జ్యూడిషియల్ కమిటీ వేయించి అభ్యర్ ్థలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తాను అని తెలిపారు.

# సిద్దార్థలో ఘనంగా సుప్రజ్ఞ25 జాతీయస్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్

**పెనమలూరు ఫిబ్రవరి21,ప్రభాతవార్త :** విద్యార్థులు పెరుగుతున్న నైపుణ్యాల డిమాండ్ ను దృష్ఠిలో ఉంచుకొని కమ్యూనికేషన్‌స్కిల్స్ లో పరిశీలనాత్మక ఆలోచనాశక్తి పెంపొందించుకోవాలని ఉభయరాష్ట్రాల టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ రీజనల్‌హెడ్ పర్వీన్ అహ్మద్ అన్నారు.స్థానిక సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నందు రెండు రోజుల జాతీయ స్థాయి సుప్రజ్ఞ25 టెక్నోకల్చరల్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా ప్రారంభ మైంది. ఈ విజ్ఞాన సాంకేతిక పోటీలకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఈమె మాట్లాడుతూ ఏఐ,ఎంఎల్ లో ప్రత్యేకమైన నైపుణ్యాలు




పెరుగుతున్న దృష్ట్యా పరిశీలనాత్మక ఆలోచనలో జ్ఞానాన్వేషణను విద్యార్థులు సాగించాలని తద్వారా భవిష్యత్తులో ఆఫర్లు పెరుగుతాయని సూచించారు.పలురంగాలలో జరుగుతున్న సాంస్కృతిక, సాంకేతిక సాహిత్య పోటీలకు దేశ నలుమూలల నుండి 300మంది పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.సుప్రజ్ఞ25 బుక్‌ను డీన్‌ఆఫ్ ఇంజినీరింగ్ వెంకటరావు విడుదల చేసారు.సిద్దార్థ అకాడమీ ఎస్ఏజిటిఈ అధ్యక్షులు ఎం.రాజయ్య,రిజిస్ట్రార్ రవిచంద్,స్నేహ విద్యార్థులు పాల్గోన్నారు.

# కర్నాటకలో శాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కర్నాటక రాష్ట్రం మైసూరు లోని గీతా శిశు శిక్షణ సంఘ ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి ఫర్ ఉమెన్ శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ గ్లోబల్ సిటిజన్‌షిప్ ప్రోగ్రాం, శాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ప్రారంభించామని శాంసంగ్ ప్రతినిథులు ప్రకటించారు. సాంకేతిక పరిజ్ఞానంలో కొత్తతరం మహిళా నాయకులను ప్రోత్సహించడానికి తమ నిబద్దతను ఇది తెలుపుతుందన్నారు. సెప్టెంబర్ 2022లో ప్రారంభించిన ఎస్ఐసి కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, బిగ్‌డేటా, కోడింగ్ ప్రోగ్రాంతో సహా ప్రధాన సాంకేతిక నైపుణ్యాలపై దృష్టిసారించిన విస్తృత పాఠ్యాంశాలను కలిగి వుందని ఆసక్తి కల విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో శిక్షన పొంది వినూత్న ప్రాజెక్టులపై పనిచేయడానికి అవకాశం వుంటుందన్నారు.

# ఓటు ప్రాధాన్యతను గుర్తించి విధిగా ఓటు వేయండి

**-సబ్ కలెక్టర్ సంజనాసింహ**

**తెనాలి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఓటు వేయడం బాధ్యతని ఆ ఓటును వినియోగించుకునే క్రమంలో అధికారులకు సహకరించి పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు తోడ్పడాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో సబ్ కలెక్టర్ సంజనసింహ్ పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఉభయజిల్లాల పట్టభద్రుల ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు తెనాలిలో ఓటు అవగాహన కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి గాంధీచౌక్ వరకు స్వీప్ ర్యాలీని నిర్వహించారు. సబ్ కలెక్టర్ సంజన సింహ జెండా చూపించి ర్యాలీని




ప్రారంభించి, గాంధీచౌక్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 27వ తేదిన పట్టభద్రుల ఎన్నికల కు పోలింగ్ జరుగునున్న క్రమంలో ఓటు పట్ల ఓటర్లకు అవగాహన కల్పించే దిశగా స్వీప్ ర్యాలీ చేపట్టామన్నారు. తెనాలి రూరల్, అర్బన్ పరిధిలో 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉన్నదో, ముందుగానే తెలుసుకొని సకాలంలో ఓటు వేసి ఓటరు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటు ఆవశ్యకతను తెలియజేసే దిశగా అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మండల తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రతి ఇంటింకి స్లిప్పులు పంపిణీ జరుగుతుందన్నారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. చీఫ్ నోడల్ అధికారి సంజీవరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ ఎన్నికల కమీషన్ సూచనల మేరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వినియోగించుకోవాలన్నారు. ఆ రోజు ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఓటు అవగాహన ర్యాలీలో మున్సిపల్, రెవెన్యూ, కార్యాలయాల సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

22-2Pg5.qxd:22-2Pg5.qxd 01/01/01 8:07 AM Page 1



# ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా?

## డోజ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న వివిధ పార్టీలనేతలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అంతర్జాతీయ అభివృద్ధికి నిధులు అందచేసే యుఎస్ఎయిడ్ భారత్‌లో ఓటర్ టర్నౌట్ పెంచేందుకుగాను 21 మిలియన్ డాలర్ల నిధిని అందించిందని ఎలాన్‌మస్క్ చేసిన వ్యాఖ్యలు ఆపై వీటన్నింటిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన వైనంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో అమెరికా మితిమీరిన జోక్యం చేసుకుంటున్నదని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశాంగశాఖ ఈ 21 మిలియన్ డాలర్ల ఇండియా ఫండ్‌పై స్పందించింది. కాంగ్రెస్ బిజెపిలమధ్య మాటలయుద్ధం పెరుగుతుండటంతో ఆయన స్పందించారు. భారత ఎన్నికల ప్రక్రియలో బయటిశక్తుల జోక్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. అయితే అధికార బిజెపి 2012లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం భారత్ కీలక సంస్థల్లోకి చొరబాట్లను సమ్మతించిందని, జాతిప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్‌నేతలు కూడా ఘాటుగానే స్పందించారు. యుఎస్ ఎయిడ్ ద్వారా ఒక్క బిజెపి మాత్రమే లబ్దిపొందిందని అన్నారు. డోజ్ సంస్థ చీఫ్ టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ ఆడిట్‌లో అనేక ప్రభుత్వ ఏజెన్సీలకు వృధా నిధుల మంజూరును కోత విధించింది. సుమారు 486 మిలియన్ డాలర్లు ఎన్నికల కూటములు, ఎన్నికల ప్రక్రియను పటిష్టంచేసేందుకు వెచ్చించినట్లు చూపించడంతో వాటిని రద్దు చేసారు. మాల్డోవా లో సమ్మిళిత రాజకీయ ప్రక్రియలో భాగ స్వామ్యం కోసం 22 మిలియన్ డాలర్లు, 21 మిలియన్ డాలర్లు భారత్‌లో ఓటర్ల భాగస్వామ్యం పెంచే చైతన్యకార్యక్రమానికి వినియోగించినట్లు తేల్చింది. బిజెపికి చెందిన అమిత్ మాలవీయతోపాటు నలిన్‌కోహ్లీకూడా అమెరికా ఏజెన్సీ భారత్‌లో ఎన్నికల పనులకని 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించడంతోపాటు భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. అయితే 2010 నుంచి 2012మధ్యకాలంలో పనిచేసిన ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషి ఈ క్లెయిమ్‌లను ఖండించారు. బిజెపి నేతల వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం, మరింత పటిష్టంచేయడం వంటి వాటితోపాటు ఐఫ్ఆఎస్ వంటి సంస్థలతో ఎంఒయులు జరిగాయని, అవి ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని వనరులను శక్తివంతం చేయడంకోసం ఈ నిధులు వెచ్చిస్తాయన్నారు. యుఎస్ఎయిడ్ ఇచ్చిన నిధుల్లో ఎక్కువ శాతం రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థలు రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కే వెళ్లాయని ఆరోపించారు.

డోజ్ సంస్థ బం గ్లాదేశ్‌కు కూడా 29 మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు ప్రకటించింది. వీటిని కూడా రద్దుచేస్తామని ప్రక టించారు. తనను గద్దెనుంచి దించేందుకు విదేశీ శక్తుల హస్తం ఎంతో పని చేసిందని, ఒక ద్వీప్ కల్పం అప్పగించనందుకు అమెరికా తనను గద్దె నుంచి దించే కుట్రలు చేసిందని బంగ్లా మాజీ ప్రధాని హసీనా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇపుడు డోజ్ సంస్థ ప్రకటించిన నిధుల జాబితా తనను గద్దెదించేందుకు వినియోగించారని ఆమె ఆరోపించారు.



# కేంద్రం ఏ భాషను నిర్బంధం చేయలేదు..

## స్టాలిన్ లేఖపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కేంద్ర ప్రభుత్వం ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విదేశీ భాషపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థులు భాషాపరమైన మూలాలను తెలుసుకోకుండా పరిమితం చేసినట్లవుతుందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించిన మంత్రి తమిళ సంస్కృతి, భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యను రాజకీయం చేయవద్దని విజప్తి చేశారు. మోడీకి తమిళనాడు సిఎం లేఖ రాసిన నేపథ్యంలో మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది. సమగ్రశిక్షా పథకంకింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధాని మోడీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ప్రధానికి రాసిన లేఖలో జాతీయ విద్యావిధానం - 2020ని పూర్తిగా అమలుచేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజల మధ్య ఆవేదన, ఆక్రోశం కలిగించిందని తెలిపారు. సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయకపోతే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు దెబ్బతింటాయన్నారు. 2024,25వ ఏడాదికి రాష్ట్రానికి అందాల్సిన రూ.2.152 కోట్లను వెంటనే మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.



# దేశాల మధ్య వివాదాలు విచ్ఛిన్నానికి దారితీయెుద్దు

జి-20 విదేశాంగమంత్రుల సమావేశంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

**ప్రిటోరియా, ఫిబ్రవరి 21:** ఏ కోణంలో చూసినా ప్రపంచ రాజకీయ పరిస్థితి సంక్లిష్టంగానే ఉందని విదేశాంగమంత్రి జైశంకర్ పేర్కొన్నారు. రాబోయే కాలంలో కృత్రిమమేధ, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, డ్రోన్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అంశాల్లో భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం కచ్చితంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంఘర్షణ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిళ్లు, ఆహార భద్రత, కొవిడ్ మహమ్మారి సవాళ్లు, వాతారవణ ఆందోళనలను ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. జి-20 మన ఆసక్తులు, సంస్కృతులు, దృక్పథాల వైవిధ్యాన్ని సంగ్రహిస్తుందన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న విదేశాంగ మంత్రి జి-20 విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమస్యలను ఎదుర్కోవడంలో, ప్రపంచ దేశాల ఎజెండాను ముందుకు తీసుకువెళ్లడంలో జి-20 కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సమాఖ్యను కాపాడుకోవడం ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యమని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారి విచ్ఛిన్నానికి దారితీయకూడదని పేర్కొన్నారు.

**ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం:** పశ్చిమాసియా ఘర్షణలు, సముద్ర భద్రత, ఉక్రెయిన్ వివాదం, ఇండో-పసిఫిక్, యుఎన్ సంస్కరణలపై భారతదేశ వైఖరిని జైశంకర్ తెలిపారు. గాజా కాల్పుల విరమణ, బందీల విడుదలను దేశం స్వాగతిస్తోందని అన్నారు. భారత్ ఎప్పుడూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, మానవతా సహాయానికి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఘర్షణలు నెలకొంటున్న ఆయా ప్రాంతాల్లో శాంతి, సుస్థిరత నెలకొనడం ప్రపంచ దేశాలకు చాలా అవసరమని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచదేశాలు ఒకదానికి ఒకటి సహాయ,సహకారాలు అందించుకోవాలని, అంతర్జాతీయ చట్టంప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై జైశంకర్ మాటాడుతూ యుద్ధం నివారించడానికి ఇరుదేశాల అధినేతలు చర్చల్లో పాల్గొనాలని భారత్ చాలాకాలంగా సూచిస్తోంద న్నారు. భారత్ యుద్ధాన్ని ప్రోత్సహించదని, దౌత్యాన్ని సమర్థిస్తుందని పేర్కొన్నారు. ఈ సమస్యకు త్వరలో ముగింపు పలకాలని కోరుతున్నట్లు తెలిపారు.



# మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు!



**ముంబయి, ఫిబ్రవరి 21:** మహాయుతికూటమిలో అంతర్గత విభేదాలు పెరిగి పోతున్నాయి. అందుకు అనుగుణంగానే జరుగుతున్న కొన్ని సంఘటనలు ఇందుకు ఊతం ఇస్తున్నాయి. ప్రత్యేకించి డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండే, ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్‌లమధ్య దూరం పెరుగుతూ వస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని మహాయుతిలో బిజెపితోపాటు ఎన్సీపీ అజిత్ పవార్, ఏక్‌నాథ్‌షిండే శివసేనలు మిత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి అద్వితీయ మెజార్టీతో గెలిచినప్పటికీ అజిత్, షిండేలకు డిప్యూటి సిఎంలు కేటాయించిన బిజెపి హైకమాండ్ వీరిమధ్య చోటుచేసుకుంటున్న విభేదాలను మాత్రం సర్దుబాటు చేయలేకపోతోంది. నాయకులను బుజ్జగించలేకపోతోంది. తాజాగా ప్రభుత్వపరంగా ఏర్పాటు అయిన మూడు అధికారిక కార్యక్రమాల్లో ఏక్‌నాథ్‌షిండే పాల్గొనడకపోవడం నేతలమధ్య పొరపొచ్చాలు మరింతపెరుగుతున్నట్లు సూచిస్తోంది. థాణెజిల్లా బద్లాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభం కార్యక్రమంలో డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే పాల్గొనలేదు. మరాఠా కింగ్ జయంతి కార్యక్రమాల్లోను ఆయన పాల్గొనకపోవడం విభేదాలు మరింత పెరుగుతున్నాయి. అలాగే అంబేగాంవ్ బుద్రక్‌లో జరిగిన శివశృతి కార్యక్రమానికి కూడా రాలేదు. అలాగే ఆగ్రాఫోర్ట్‌లోజరిగిన చరిత్రాత్మక కార్యక్రమంలో కూడా షిండే పాల్గొనలేదు. ఈ మూడు కార్యక్రమాల్లోను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పాల్గొన్నారు. రానురాను ఈ విభేదాలు మరింత తారస్థాయికి చేరాయి. శివసేనకు చెందిన ఎమ్మెల్యేలకు వై కేటగిరీ సెక్యూరిటీ కవర్‌ను మహారాష్ట్రప్రభుత్వం ఉపసంహరించింది. హోంశాఖ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ చేతుల్లోనే ఉండటం ఇందుకు మరింత కారణం అయింది. ఈ చర్యతో శివసేన షిండేవర్గం తీవ్రంగా కలతచెందింది. 44 మంది ఎమ్మెల్యేలు, 11 మంది లోక్‌సభ ఎంపిలకు 'వై'కేటగిరీ భద్రతను కల్పించారు. ఆనాడు షిండే వర్గీయులు కావడంతో వీరిపై దాడులుజరగవచ్చున్న భావనతో వారికి భద్రతపెంచడంతోపాటు కీలకమైనవారికి కేబినెట్ బర్తలు కూడా ఇచ్చారు. ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికల్లో ప్రధానంగా లడ్కీబహిన్‌యోజన వివాదాలను పెంచింది. ఈ పథకానికి ముందు ముఖ్యమంత్రి అన్న పదాన్ని ఎన్సీపీ అజిత్‌వర్గం తన ప్రచార సామగ్రిలో తొగించింది. ఎన్సీపీ నేత అదితి తత్కారే, బిజెపి గిరీష్‌మహాజన్‌లను నాసిక్, రాయ్‌గడ్ ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించడం కూడా వివాదాన్ని మరింతపెంచింది. 2027 నాసిక్ కుంభమేళా సమీక్షాసమావేశానికి కూడా షిండే గైర్హాజరు అయ్యారు. సీనియర్ బిజెపి నాయకుడు ఆశీష్ షేలార్ మాట్లాడుతూ ఎలాంటి అసమ్మతి, అసంతృప్తిలేదని ప్రభుత్వం సజావుగా నడుస్తోందని, ఏకతాటిపై కూటమి పయనిస్తోందని ప్రకటించారు. షిండే కూడా పైపైకి ఎలాంటి కోల్డ్‌వార్ తమమధ్యలేదని చెప్పలేక చెపుతూ రావడంచూస్తుంటే మహాయుతిలో మహా లుకలుకలు బయలుదేరాయని స్పష్టం అవుతోంది.

# రాత్రికి రాత్రే బెంగళూరు నగరాన్ని మార్చేయలేం..

## కర్ణాటక డిప్యూటీ సిఎం వివాదాస్పద వ్యాఖ్యలు

**బెంగళూరు, ఫిబ్రవరి 21:** డిప్యూటి ముఖ్యమంత్రి డికెశివకుమార్ బెంగళూరును సాక్షాత్తూ దేవుడే దిగివచ్చినా బాగుచేయలేడని చేసిన వ్యాఖ్యలు ఇపుడు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. ఇటు నగరవాసులు రాజకీయ పార్టీల నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బెంగళూరు నగరాన్ని రాత్రికి రాత్రే మార్చేయలేం. ఈ మహానగరం ఏ రెండేళ్లకో, మూడేళ్లకో మారదు. ఒకవేళ దేవుడే తలుచుకున్నా అది సాధ్యపడదు. నగరం బాగుచేయాలంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో జరగాలి అని ఒక వర్క్‌షాపులో శివకుమార్ అన్నారు. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా బెంగళూరులోట్రాఫిక్‌జామ్ వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తుంటుంది. ఈ మధ్యకాలంలో అది మరీపెరిగిపోవడంతోపలువురు మేధావులుకూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా డిప్యూటిసీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రజల్లో అసహనం పెరిగింది. ఆయన మంత్రి అయి రెండేళ్లు అవుతోందని బలమైన నేతగా మీకు ఆహ్వానం పలికాం కానీ మా బతుకులు బలహీనంగా మారుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త ఆరిన్‌కేపిటల్ ఛైర్మన్ మోహన్ దాస్‌పాయ్ విమర్శించారు. ఫుట్‌పాత్‌ల పరిస్థితి సజావుగాలేదని, ఐదువేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని మెట్రోరైలు విస్తరించాలని మోహన్ దాస్ అన్నారు. బ్రాండ్ బెంగళూరు అంటూ నినాదం ఇచ్చిన వ్యక్తి ఈరోజు దేవుడుకూడా సరి చేయలేడంటూ వ్యాఖ్యానించడం దురదృష్ట కరమని బిజెపి వాదిస్తోంది. ప్రజలకు సేవచేసే అవకాశం దేవుడు ఇస్తే ఈప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బిజెపినేత మోహన్‌కృష్ణ విమర్శించారు. ఈ విమర్శలపై డికెఎస్ స్పందిస్తూ బెంగళూరు నగర సమస్యలను పరిష్కరించే బాధ్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే నగరంలో కొత్తరోడ్లనిర్మాణం, ట్రాఫిక్



సమస్యను తప్పించే ప్రణాళికతోకూడిన మినీ బుక్‌ను విడుదల చేసామని చెప్పారు.

# ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కాశ్ పటేల్ నియామకాన్ని గురువారం సెనెట్ ఆమో దించింది. ఈ నేపథ్యంలో కాశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు హాని చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ఎఫ్‌బిఐ తొమ్మిదో డైరెక్టర్‌గా నన్ను నియ మించడం ఎంతో గౌరవంగా ఉంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండికి కృతజ్ఞతలు. ఎఫ్‌బిఐకి ఎంతో ఘనచరిత్ర ఉంది. దేశ ప్రజలకు పారదర్శకంగా, జవాబు దారీగా ఉం డేందుకు బ్యూరో కట్టుబడి ఉంది. దేశం గర్విం చేలా ఎఫ్‌బిఐని పునర్నిర్మిస్తాం. అమెరికన్లకు ఎవరైనా హాని చేయాలని చూస్తే.. వారి అంతు చూస్తాం' అని ఆయన రాసు కొచ్చారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ డైరెక్టరుగా కాశ్ పేరును అలస్కాకు చెందిన రిపబ్లికన్ తోపాటు పలువురు డెమోక్రట్లు వ్యతిరేకించారు. అయితే 51-49ఓట్ల తేడాతో ఆయన నియా మకం జరిగింది. దీంతో ఈ పదవిని చేపట్టిన తొలి హిందూ, భారతీయ అమెరికన్‌గా ఆయన నిలిచారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు వీరవిధేయుడిగా కాశ్‌కు పేరుంది. పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్ లో ఉన్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఉగాండా నియంత ఈదీ అమిన్ బెదరింపుల కారణంగా అతడి తండ్రి అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూ యార్క్‌లోని గార్డెన్‌సిటీలో పటేల్ జన్మించారు. యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఒక లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో ఆయన మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.



# టెన్త్ విద్యార్థుల ఘర్షణ: కాల్పుల్లో ఒకరు మృతి

**పాట్నా, ఫిబ్రవరి 21:** పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్యవివాదం చోటుచేసుకుంది. మరుసటిరోజు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక దాడులకుపాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్థులు మృత దేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలుజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఒక్కరోజు కాకుండానే మాపై విమర్శలా?

## మాజీ సిఎం విమర్శలు తిప్పికొట్టిన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** బిజెపి ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ ఢిల్లీమాజీ సీఎం అతిశి చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖాగుప్తా కొట్టిపారేసారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేసారో చూసుకోకుండా అధికారంలోకి వచ్చి ఒక్కరోజుకూడా కాని మాపై విమర్శలు చేస్తున్నారేమిటి? మొదటిరోజే మేం కేబినెట్ సమావేశం నిర్వహించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్‌భారత్‌యోజనను అందుబాటులోకి తెచ్చాం. దాంతో ప్రజలకు రూ.10 లక్షల మేర వైద్యసహాయం అందనున్నది. ఈపథకాన్ని ఆప్ అమలుచేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికిలేదు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీ తన హక్కులన్నీ సాధిస్తుందని ముందు మీరు మీ పార్టీగురించి చూసుకోండి అని హితవు పలికారు. ఎంతో మంది మీ పార్టీని వీడాలని ఆసక్తితో ఉన్నారు. కాగ్ నివేదికను అసెంబ్లీలోపెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. మహిళలకు రూ.2500 నెలనెలా ఆర్థిక సాయం అందించేపథకం మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బిజెపి హామీ ఇచ్చిందని కానీ మొదటిరోజే ఉల్లంఘించిందని అతిశి విమర్శించారు. అయితే రేఖాగుప్తామాత్రం మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థికసాయం రూ.2500 జమచేస్తామని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికోసం ఒక్కరోజును కూడా వృథా చేయనని ఆమె అన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రవేశపెడతామని చెప్పారు.




# టారిఫ్‌ల దెబ్బకు బ్రిక్స్ మాటే వినిపించట్లేదు..

## కూటమిదేశాలపై ట్రంప్ వ్యంగ్యోక్తులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** బ్రిక్స్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. కూటమి దేశాలపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రపంచ రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్‌స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 150శాతం సుంకాలు విధిస్తామని పలుమార్లు తీవ్రంగా హెచ్చరించారు. తాజాగా బ్రిక్స్‌దేశాలపై మరోసారి ఆయన నోరుపారేసుకున్నారు. సుంకాలు విధిస్తామనగానే బ్రిక్స్ చెల్లాచెదురైపోయిందని వ్యంగ్యోక్తులు విసిరారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయాలని చూస్తున్నాయని అందుకు ప్రయత్యామ్నాయంగా కొత్తకరెన్సీని సృష్టించాలనుకున్నాయని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150శాతం సుంకాలు వేస్తామని తాను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయని తర్వాత ఆకూటమి మాటే వినిపించడంలేదని ట్రంప్ అన్నారు. ఇప్పటికే ట్రంప్ బ్రిక్స్ కూటమిపై ఘాటుగా స్పందించారు. బ్రిక్స్ ఒక చెడు ప్రతిపాదన తెచ్చిందని దీన్ని ఎవరూ అంగీకరించరని, డాలర్‌తో ఆటలాడితే 150శాతం సుంకాలు విధిస్తానని చేసిన హెచ్చరికతో ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకుసైతం భయపడుతు న్నారన్నారు. తాను ఈ వ్యాఖ్యలుచేసిన వెంటనే బ్రిక్స్ అంతం అయిందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కానీ మరేప్రాంతంలో అయినా కానీ అమెరికన్ డాలర్‌ను భర్తీచేసే అవకాశం బ్రిక్స్‌కు లేదని ఒకవేళ ఏదేశం అయినా ప్రయత్నిస్తే సుంకాలకు హాలోచెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సివస్తుందన్నారు. బ్రిక్స్‌కు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రె యిన్‌తో ఉద్ధం అనంతరం అనేక పశ్చిమ దేశాలనుంచి రష్యా ఆంక్షలను ఎదుర్కొనడంతో ఈ అంశంపై చర్చలు భారీగా సాగాయి.

# వారణాసి సమీపంలో రోడ్డు ప్రమాదం కర్ణాటక బీదర్ వాసులు దుర్మరణం



**వారణాసి, ఫిబ్రవరి 21:** మహాకుంభమేళాకు వెళుతూ ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. భక్తులుప్రయాణిస్తున్న క్రూయిజర్ వాహనం లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదంజరిగింద.ఇ ప్రమాదంలో మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి జిల్లాలోని మీర్జామురారా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌జిల్లాలోని లడగేరి ప్రాంతానికి చెందిన 14 మందిక్రూయిజర్ జీపులో మహాకుంభమేళాకు బయలుదేరారు. వారి వాహనాన్ని యుపిలోని వారణాసి జిల్లా మీర్జామురారా పోలీస్ స్టేషన్‌పరిధిలో రూపా పూర్‌గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రూయిజర్ జీపు లోని ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సహా మిగతా ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

# ట్రక్కును ఢీకొట్టిన బస్సు: నలుగురు మృతి, 30 మందికి గాయాలు



**కచ్(గుజరాత్), ఫిబ్రవరి 21:** కచ్‌జిల్లాలోని ముంద్రా ప్రాంతంలో ఒక ప్రయాణీకుల బస్సు, ట్రక్కు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతిచెందారు. మరో 30మందివరకూ తీవ్రగాయాలపాలయ్యారు. బస్సులో ప్రమాద సమయానికి 40 మందిప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించామని కచ్ ఎస్‌పి తెలిపారు. గత వారంలో కూడా ఒక టూరిస్టు వ్యాన్ ప్రయాణీకులతో మహాకుంభ్‌నుంచి తిరిగివస్తుండగా ఒక స్టేషనరీతో వెళుతున్న ట్రక్కును హైవేపైనే ఢీకొట్టింది. దాహోద్‌జిల్లాలో ఈసంఘటన జరిగింది. ఆ ప్రమాదంలో కూడా నలుగురు చినపోగా ఆరుగురు తీవ్రగాయాల పాలయ్యారు. ప్రస్తుతం ముంద్రా ప్రమాదంలో గాయపడిన అందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం
- ప్రజా సమస్యలు పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యత
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాంప్రసాద్ సిసోడియా

**నెల్లూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త –** కలెక్టరేట్ శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పిజిఆర్ఎస్ , రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లతో సమీక్ష చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత మాత్రమే డిస్పోస్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. .సమస్యలతో వచ్చే అర్జీదారులను వెయిట్ చేయించకుండా వారి పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యతని ఆయన పేర్కొన్నారు. రీసర్వే చేసిన భూముల కొలతలతో చిన్న చిన్న తేడాలుంటే రైతులను పిలిపించి నచ్చజప్పి వీలు ఉన్నంతవరకు పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. భూములు ఆక్రమణ గురైతే ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు.

చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలన్నారు.

కోర్టు కేసులను తేలికగా తీసుకోకుండా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్ అఫిడవిట్లు ఫైల్ చేయాలన్నారు. నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో ఉంది కాబట్టి ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, కమ్యూనికేషన్ ప్లాన్ పక్కాగా రూపొందించుకోవాలని ఉన్నారు. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల ప్రకారం సమస్యలు పరిష్కారం నాణ్యతగా ఉండేటట్లు చూస్తామని ,అఫిడవిట్ల ఫైల్ చేయడంలో జాప్యం లేకుండా ఆర్డీవో తాసిల్దారులకు ఆదేశాలు ఇస్తామని లీగల్ సెల్ ఏర్పాటు చేసి కేసుల సత్వర పరిష్కారం చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి జెసి వివరించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్, సూర్యతేజ, సబ్ కలెక్టర్ పూజ,డీఆర్ఓ జె.ఉదయ భాస్కర రావు, కావలి, ఆత్మకూరు ఆర్ డీ ఓ లు జిల్లా సర్వే అధికారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# గజపతినగరంలో దొంగల హల్‌చల్

**గజపతినగరం (విజయనగరం జిల్లా) ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** విజయనగరం గజపతినగరం పట్టణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేసారి ఎనిమిది వేర్వేరు షాపుల్లో భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రెండు లక్షల నగదు, ఎనిమిది లక్షల రూపాయల విలువ గల వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు. దీంతో గజపతినగరం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగలు ఒకే రోజు ఈ తరహా దొంగతనానికి పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసు స్టేషన్‌కి కూత వేటు దూరంలో హైవేపై గల ఈ ఎనిమిది దుకాణాల్లో ఒకేసారి దొంగతనాలు జరగడం పోలీసుల వైఫల్యమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట, మూడున్నర గంటల మధ్య దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు సిసి పుటేజీ ఆధారంగా తెలుస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 26వ నెంబర్ జాతీయ రహదారిపై గల సూపర్ ఎం మార్ట్, వెంకి మొబైల్స్, మినీ డిమార్ట్‌లతో పాటు మెంటాడ రోడ్డులో గల ఆర్కే ఫ్యామిలీ మార్ట్, హాసిని బట్టల దుకాణం, షూ మార్ట్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో షట్టర్లు లేపి దొంగలు లోపలకు ప్రవేశించారు. దొరికినదంతా దోచుకుపోయారు. ప్రధానంగా వెంకి మొబైల్స్ దుకాణంలో లక్షా యాభై వేల నగదు, ఐదు లక్షల రూపాయల విలువ చేసి సెల్ ఫోన్లు, ఆర్కే ఫ్యామిలీ మార్ట్‌లో ఇరవై వేల రూపాయలు నగదు, కొంత సామాగ్రి దొంగిలించుకుపోయినట్లు ప్రాథమిక సమాచారం. ఈ వరుస దొంగతనాల నేపథ్యంలో వ్యాపారుల్లో సైతం అభద్రతా భావం, భయాందోళనలు నెలకొన్నాయి.



సంఘటన స్థలాలను పరిశీలిస్తున్న బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ

శుక్రవారం ఉదయం స్థానికులు కొందరు దుకాణాల షట్టర్లు తెరిచి ఉండటం గమనించి సంబంధిత యజమానులకు సమాచారం అందజేయడంతో ఈ దొంగతనాల విషయం బయటకు వచ్చింది. ఆ తరువాత పోలీసులకు దుకాణాల యజమానులు సమాచారం అందజేయడంతో ఎస్.ఐ లక్ష్మణరావు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. ఆ తరువాత బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ సంఘటన స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి ఆరోపణలపై వివరణ కోరిన మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారుల నుంచి వివరణ కోరారు. ఆ సంస్థ ఎండీ దినేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ లతో ఆయన సచివాలయంలో సమావేశమై ఈ అంశాలపై ఆరా తీశారు. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను పూర్తిగా కనుమరుగు చేసేలా అధికారులు కుట్రలు పన్నుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతోందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎండీ దినేష్ కుమార్ ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను చంపేయాలనుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఫైబర్‌నెట్‌లో ఉన్నత ఉద్యోగులు రాజద్రోహానికి పాల్పడుతున్నారని జీవీ రెడ్డి ఆరోపించారు.

గత ప్రభుత్వానికి సహకరించే విధంగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క పైసా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టకపోగా, సంస్థకు నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని జీవీరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థ నష్టపోయిన ఆదాయాన్ని అధికారుల నుంచే రాబట్టేలా ప్రభుత్వాన్ని కోరతానన్నారు. ముఖ్యంగా ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ దినేష్‌రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఫైబర్‌నెట్ సంస్థలో జరుగుతున్న అవకతవకలు, ఉద్యోగుల పనితీరుపై ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి చేసిన ఆరోపణలపై శనివారం సాయంత్రంలోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఎండీ దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. మరోవైపు ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఏపీఎఫ్ఎస్ఎల్ ఛైర్మన్ జీవీరెడ్డికి కూడా మంత్రి కార్యాలయం లేఖ రాసింది. అయితే రెండు రోజుల్లోగా మొత్తం ఆధారాలు సమర్పిస్తానని జీవీ రెడ్డి మంత్రికి తెలియజేశారు.

# ఉత్తమ పోలీసు అధికారులకు సిఎం చంద్రబాబు అభినందన



అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులతో ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులను ఎక్స్ వేదిక ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. జార్ఖండ్ రాజధాని రాంచిలో ఆరు రోజుల పాటు 68వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో సత్తా చాటి నాలుగు స్వర్ణపతకాలు, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు సాధించడంతో పాటు టీం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాల పట్టికలో ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభాగంలో మూడు స్వర్ణ పతకాలసాధించిన రికార్డ్ సృష్టించిన ఎస్ఐ కె.కృష్ణమూర్తికి

ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇక జాతీయ స్ధాయిలో డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులన డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు.

మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో వారందరిని డీజీపీ సముచిత రీతిన సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు చెందిన 24 టీమ్‌లు పాల్గొనగా, డిఐజి కె.కె.ఎస్ అంబురాజన్ నేతృత్వంలోని అధికారులతో కూడిన బృందం పాల్గొందని తెలిపారు.

# శివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఒక్కో రోజుకు ఒక్కో వాహనం

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ఎన్నో వింతలు,ప్రతి రోజు ఓ వాహన సేవను నిర్వహిస్తారు. అయితే ఈ వాహనాలనే ఎందుకు వాడుతున్నారన్నది దేవస్థానం నిర్వాహకులు వివరిస్తూ వాహన మండపం వద్ద సమాచారం అందిస్తే బాగుంటుంది. ప్రతి రోజూ ఏదో వాహనంపై స్వామి అమ్మవార్లు వస్తారు. దర్శించుకుంటున్నామనే భావనేతప్ప ఈ వాహనంపై స్వామి అమ్మవార్లు ఎందుకు వస్తున్నారనే విషయం పలువురికి తెలియదు. అయితే స్థానిక అర్చకుల కథనం మేరకు వాహనాలకు సంబంధించిన సమాచారం ఇలా ఉంది. దేవతల్ని త్రిపురాసురుడనే రాక్షసుడు ఇక్కట్లు పెడుతున్నట్లు చెబుతున్నారు. వారి తపస్సులకు భంగం కల్గిస్తూ ఆధ్మాతిక కార్యక్రమాలను జరగనివ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ఆతన్ని సంహరించే శక్తి ఒక్క శివునికే ఉందని భావించిన ఋషులు దేవ దేవుని వేడుకున్నట్లు స్థలపురాణంలో పేర్కొన్నారు. మహాశివరాత్రి పది రోజులు ఒక్కొక్కరోజుకు ఒక్కొక్క ప్రధాన్యత ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రాత్రిని దేవరాత్రి అంటారు. త్రిపురాసురుని సంహరించుటకు సముద్రంలో అమృతమథనం కోసం దేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బాధ నుంచి కాపాడేది ఒక్క కైలాసనాథుడే అని చర్చించు కోవటాన్ని దేవరాత్రి అంటారు. హాలాహాలాన్ని ముక్కంటీశుడు భక్షించి దేవతలకు అమృతం పంచిన రాత్రి అనికూడా అంటారు.దేవతలందరూ సమావేశమై నిర్ణయించు కోవటానికి దేవరాత్రి అంటారు. అంటే శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ధ్వజారోహణం సందర్భంగా స్వామిని దేవతలు వేడుకోవటాన్ని వివరిస్తారు. ఆ రోజు స్వామి వారు వెండిపల్లకిలో దర్శన మిస్తారు. త్రిపురాసురుడు ఒక్క దేవతల్నే కాకుండా అన్ని వర్గాల వారిని వేధిస్తూ అల్లకల్లోలం సృష్టించటంతో ప్రకృతి ఆతని బారి నుంచి ఎలా బయటపడాలనే యోచన చేస్తున్నట్లు చెబుతారు. రెండవ రాత్రిని భూత రాత్రి అంటారు. భూతాలందరూ సమావేశమై తమ ఆరాధ్యదైవంమైన ముక్కంటీశుని ప్రార్థించటాన్ని భూత రాత్రి అంటారు. భోళాశంకరుడు భూతనాదుడంటారు. కాబట్టి తమ నాధుని వేడుకునే రాత్రిని భూత రాత్రి అంటారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు భూత నాధుడు 'భూతకీ వాహనం'పై దర్శన మిస్తాడు శివునికోసం ఘోర తపమాచరించి వరాలు పొందిన రావణాసురుడు సామవేదానికి అధిపతి అంటారు. గంధర్వులందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బారి నుంచి రక్షించాలని వేడుకునేందుకు తీర్మానించినట్లు చెబుతారు. ఈ సందర్భంగా రావణాసురుని దౌత్యంతో మూగజీవాలకు మోక్షమిచ్చిన ముక్కంటీశుని వేడుకోవటం అని అర్థం.ఈ రాత్రి ని గాంధర్వ రాత్రి అంటారు. అందుకు ఆ రోజు స్వామి 'రావణాసుర వాహనం'పై దర్శన మిస్తాడు. నాల్గవ రాత్రిని నాగరాత్రి అంటారు. నాగలోకంలోని నాగదేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుడనే రాక్షసుని బారి నుంచి తప్పించాలంటూ తీర్మానం చేయటాన్ని నాగరాత్రి అంటారు. పాములను హారాలుగా ధరించిన పరమేశ్వరుని వేడుకునేందుకు సమావేశం కావటాన్ని నాట్యాలకు ప్రతీతిగా చెబుతారు. ఆ రోజు రాత్రి అర్ధనారీశ్వరుడు 'శేషవాహనంపై' దర్శనమిస్తాడు. అన్ని వర్గాలు, సంస్థల అభ్యర్థన మేరకు సాగరమథనంలో మొదట వచ్చిన హాలా హాలాన్ని తాను మింగి పార్వతి దేవి ఒడిలో రెప్పకాలం పాటు విశ్రయించి నిద్రలేచిన సందర్భంగా శివయ్య మరణాన్ని జయించాడంటూ అన్ని వర్గాలు ఆనందో త్సాహాలతో సంబరాలు జరుపుకుంటారు. ధర్మస్వరూపుడు నంది. కాబట్టి నంది వాహనంపై కైలాసనాధుడు దర్శనమిస్తాడు. 'నంది సేవ' అంటారు.



ఉత్సవాలకు సిద్ధమైన బంగారు వాహనాలు

# రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మార్చి 1, 3వ తేదీల నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు అఫీషియల్ వెబ్‌సైట్ నుంచి సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధంచిన హాల్ టికెట్లను వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఏపీలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19 వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకుంది ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ కలిపి దాదాపు 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా వాట్సప్ లోనే హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పలు సేవలను ప్రభుత్వం అందిస్తోంది. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా ఎంతో సింపుల్‌గా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పదో తరగతి విద్యార్థులు సైతం వాట్సప్ లోనే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన 9552300009 నెంబర్ కి మీ ఫోన్‌లో హాయ్ (బీ) అనే వాట్సప్ లో మెసేజ్ చేయండి. సేవను ఎంచుకోండి అంటూ ఒక లింక్ వస్తుంది. ఆ లింక్ పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని సేవలు కనిపిస్తాయి. అందులో విద్య సేవలు అనే ఆప్షన్ ను సెలక్ట్ చేసుకోండి. అనంతరం ఇంటర్ ఫస్ట్ ఇయర్ లేదా సెకండ్ ఇయర్ హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ ఉంటుంది.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ అయితే పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీరు ఇంటర్ సెకండ్ ఇయర్ స్టూడెంట్ అయితే ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయాలి.

కొద్ది నిమిషాల్లోనే మీ హాల్‌టికెట్ వాట్సప్ కే వచ్చేస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవడమే. అంతే ఇలా ఎంతో సింపుల్ గా మీ ఫోన్ లోనే హాల్ టికెట్ ని డౌన్ లోడ్ చేసుకోవచ్చు.



హైదారాబాద్‌లో చేతి ఉత్పత్తులు విక్రయిస్తున్న శ్రీకాకుళం వాసి, ఇన్‌సెట్‌లో చంద్రబాబు

# అతడి కథ ఒక స్ఫూర్తి దాయక జీవిత పాఠం: సిఎం చంద్రబాబు

- హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ పోస్టును షేర్ చేసిన సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా(ఎక్స్)లో ఆసక్తికర పోస్టును పంచుకున్నారు. ఓ వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్ కు వలసవెళ్లి అక్కడే వెదురు బుట్టలు, విసనకర్రలు, కొబ్బరి ఆకులతో పలు ఉత్పత్తులు తయారు చేస్తూ జీవిస్తున్న వైనాన్ని హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ అనే సోషల్ మీడియా హ్యాండిల్ పోస్టు చేసింది. ఈ పోస్టును షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు... ఇది ఒక స్ఫూర్తిదాయక జీవితపాఠం అని కొనియాడారు. అతడి కథను పరిశీలిస్తే కష్టించి పనిచేసే స్వభావం, ఏపీ వాణిజ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కానీ, అతడు సొంతగడ్డను వదిలి అవకాశాలను వెతుక్కుంటూ వేరే ప్రాంతానికి వెళ్లడం తనను విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు.ఏదేమైనా ఆ వ్యక్తి పనితనం, ఆశావహ దృక్పథం బాగా నచ్చాయని. తన కలలను, కళను కలగలిపి వస్తువులుగా మలిచి జీవనం సాగిస్తుండడాన్ని ప్రగాఢంగా అభిమానిస్తున్నానని వివరించారు. "ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మించడానికి, అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఆ వ్యక్తిలా నైపుణ్యం ఉన్న వారు స్వస్థలంలోనే ఉంటే ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి - డిఆర్‌ఎంను కలిసిన ప్రజా ప్రతినిధులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** గుంతకల్లు పట్టణంలో సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న పలు రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ,స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,గుంతకల్లు మున్సిపల్ కమీషనర్ మొహమ్మద్ నయీమ్ అహ్మద్‌లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. శుక్రవారం డిఆర్ఎం గుప్తాను కలిసిన వారు గుంతకల్లు పట్టణంలోని పలు రైల్వే బ్రిడ్జిల నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా ధర్మవరం గేట్ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని గత పాలకులు కేవలం రాజకీయ లబ్ది కోసం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సంపాదించుకునేందుకు టెంకాయలు కొట్టి ధర్మవరం గేట్‌ను అభివృద్ధి పనులు మొదలు పెట్టామని చెప్పుకున్నారని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పట్టణంలో అనేక అభివృద్ది పనులు చేపట్టామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల సహకారంతో అభివృద్ధి పనులను మొదలు పెట్టామని తెలిపారు. అలాగే కసాపురం రోడ్డులోని రైల్వే బ్రిడ్జి ఎత్తును (హైట్) 5ఇంచులు పెంచి తొందరలోనే పనులు ప్రారంభించే కార్యక్రమం చేపట్టామని, హానుమాన్ సర్కిల్‌లో కూడా ఫ్లైఓవర్‌కి ప్రతిపాదనలు పంపామని ఖచ్చితంగా వీటన్నింటిని అభివృద్ధి చేసే బాధ్యత తాను,ఎంపి అంబికా లక్ష్మినారాయణ తీసుకుంటామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. మున్సిపాలిటీకి రైల్వే శాఖ చెల్లించవలసిన బకాయిల గురించి వారు డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత మేరకు భూసేకరణకు సంబంధించిన రూ.1.85కోట్లను చెల్లించేందుకు డిఆర్ఎం సూచన ప్రాయంగా అంగీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెదేపా నాయకులు నారాయణ స్వామి,మష్టూరు భాస్కర్,క్రిష్ణారెడ్డి,మున్సిపల్,రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై డిఆర్‌ఎంను కలిసిన ఎంపి అంబిక,ఎంఎల్‌ఏ జయరాం

# కెసిఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిల్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** విపక్ష నేత, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖ లైంది. ఫార్మర్స్ ఫెడరేషన్‌కు చెందిన విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. కేటీఆర్ దీనిపై స్పందించి కేసీఆర్ బదులు వేరేవాళ్లను అక్కడ పోటీ చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రజల కోసం పోరాటం చేయాలని కానీ అసెంబ్లీకే రాకుంటే అన ర్హుడిగా ప్రకటించాలని పిటిషన్‌లో తెలిపారు. 2023 డిసెంబరు 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటివరకు అసెం బ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగిం చాలని కోర్టును కోరారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని చెప్పారు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.



# 2027 నాటికి దగదర్తి ఎయిర్‌పోర్ట్ పూర్తి

- అథారిటీ అధికారులతో కలిసి భూములను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్

**దగదర్తి, (నెల్లూరు,) ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** 2027 నాటికి దగదర్తి ఎయిర్‌ఫోర్ట్ పూర్తవుతుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగతాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం ఎయిర్‌ఫోర్ట్ అథారిటీ అధికారులతో ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ్యులు బీద, ఎమ్మెల్యే దగుమాటిలు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతునన్న రైతులకు, యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందని అన్నారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు అనుసంధానం చేస్తూ నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంతో పెగనుందన్నారు. 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు భూమి పూజ చేస్తే వైసీపీ పాలనలో అడుగు ముందు పడని పరిస్థితి నెలకొందన్నారు. 1379 ఎకరాల్లో ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణానికి ప్లాన్ చేశారని, 700 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. మిగిలిన భూసేకరణ కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఎయిర్ ఇండియా అధికారులు టెండర్లు డీపీఆర్ మొదలైన పక్రియలను పూర్తి చేయాలని కోరారు. అన్ని పనులు పూర్తయితే త్వరలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్‌మోహన్‌నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పనుల శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుల సహకారంతో త్వరలో కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రామ్‌మోహన్‌నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, తెలుగు వాడు కావడం ఎయిర్‌ఫోర్ట్ పనులు వేగవంతమయ్యాయి. ఒక్క రోజు వ్యవధిలో అధికారులను ఢిల్లీ నుంచి ఇక్కడికి పంపడం రామ్‌మోహన్‌నాయుడు చొరువ, ఇండోసెల్, బీపీసీఎల్ సహా అనేక కంపెనీలు నెల్లూరు వైపు అడుగులు వేస్తున్నాయి. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా పరిశ్రమలు తీసుకురావడమే మా లక్ష్యం, ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణం నెల్లూరు జిల్లా వాసుల చిరకాల కల అని టీడీపీ ఎన్డీఏలో భాగస్వామ్యం కావడం రాష్ట్ర అభివృద్ధికి బలంగా దోహదపడుతుందని, భూములు కోల్పోతున్న ఈ ప్రాంత అభివృద్ధికి రైతులు ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దగ్గర ఉన్న భూములతో ఎయిర్‌ఫోర్టు పనులు ప్రారంభించవచ్చని, ఎయిర్‌ఫోర్ట్ భూముల సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. వీరితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీ

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సారధ్యంలో తొమ్మిది మంది అధికారులతో ప్రాజెక్ట్ కమిటీ ఏర్పాటైంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే బాధ్యతలను కమిటీ అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసారు. పెట్టుబడిదారులు,టెండర్లు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితరంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది.

22-2P g7exHMNWJQE.qxd:22-2P g7exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1



# ఇంజినీరింగ్‌లో పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

**నాలుగేళ్లల్లో 160 క్రెడిట్లు.. అదనంగా మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్లు**

**ఇంజినీరింగ్ సిలబస్ సవరణల కమిటీ సిఫారసులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లన్నింట్లోనూ ఒకే విధమైన క్రెడిట్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు. ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ ప్రకారం.. మొత్తం 160 క్రెడిట్స్ ఉండేలా సిలబస్‌ను రూపొందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ సిలబస్ సవరణ కోసం ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టరెడ్డి, వైస్ ఛైర్మన్1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ ఛైర్మన్2 ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్‌లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి సిలబస్‌ను సవరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. పరిశ్రమ మరియు ప్రపంచ అవసరాల నేపథ్యంలో సిలబస్ సవరణ అవసరాన్ని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఏకరీతి నిర్మాణం, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని.. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సంవత్సరాల పాటు 20 క్రెడిట్లతో మొత్తం 160 క్రెడిట్లు ఉండాలని.. అదనంగా మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్లు కేటాయించాలని. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ (డీఎస్), సైబర్ సెక్యూరిటీ (సీఎస్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కోర్సులతో కలపడం ద్వారా కోర్ శాఖలను బలోపేతం చేయాలని.. అన్ని యూనివర్సిటీలు/కాలేజీలు మైనర్/ హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టితో రెండవ, మూడవ సంవత్సరాల చివరిలో రెండు తప్పనిసరి క్రెడిట్ ఆధారిత పారిశ్రామిక ఇంటర్న్‌షిప్‌లుండాలని సూచించారు. ఇంజినీరింగ్‌లో వేగంగా నేర్చుకునేవారికి క్రెడిట్లను సంపాదించడంలో సౌలభ్యం ఉంటుందని.. విద్యార్థి 6వ లేదా 7వ సెమిస్టర్ చివరి నాటికి 160 క్రెడిట్లను పూర్తి చేయవచ్చని.. తద్వారా మిగిలిన సెమిస్టర్(లు)ను పారిశ్రామిక ఇంటర్న్‌షిప్/ప్రాజెక్ట్ కోసం పూర్తి సమయం కేటాయించవచ్చని సూచించారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో కనీసం నాలుగు పారిశ్రామిక /క్షేత్ర సందర్శనలు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను బోధించడానికి ప్రాక్టీస్ ప్రొఫెసర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ అవగాహన ఒప్పందాల ప్రకారం అధ్యాపకులు మరియు విద్యార్థుల మార్పిడిని ప్రోత్సహించాలని సిఫారసుల్లో పేర్కొన్నారు.



అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు

## పోలేపల్లి ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని పోలేపల్లిలో జరిగే ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సిఎంకు దేవాదాయ కమిషనర్ శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సిఎం పట్టువస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితులచే ఆశీర్వచనం అందుకున్నారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, దేవాలయ ఛైర్మన్ జయరాములు, ఇఒ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింలుగౌడ్, మేర్గు వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, యుగంధర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదంటూ గాంధీభవన్ వద్ద రైతుధర్నా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరం మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన చెందిన తోట యాదగిరి అనే వృద్ధ రైతు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకుని రుణమాఫీ తనకు చేయలేదని ధర్నా చేపట్టారు. తనకు రుణమాఫీ చేసే వరకు ఇక్కడ్నుంచి కదిలేది లేదని ఆ రైతు తేల్చిచెప్పాడు. తనకు మూడు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్నాయని రెండులక్షలు మాఫీచేస్తే నేను ఒక లక్షరూపాయలు కట్టుకొనేటోడినని అన్నారు. 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయిం చాను. కానీ ఇప్పటి వరకు బోనస్ రాలేదని ఆవేదన చెందారు. రైతుభరోసా మాప్రభుత్వం రాగానే పెంచిన మొత్తం ఇస్తదని చెప్పి ఇప్పుడు ఇంకా వేయడంలేదని ఇటు పెన్షన్లు కూడా రావడంలేదని ఆయన గాంధీభవన్ మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం దిగి వచ్చే వంకు నేను ఇక్కడ్నుంచి కదలను అంటూ భీష్మించుకొని కూర్చోన్నారు.. నేను అబద్ధ మాడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే అని రైతు తోట యాదగిరి తేల్చి చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామిని నిల బెట్టు కొన్నప్పటికి కొంతమంది ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంతో ప్రేరేపించబడి అదడదపడా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హామిలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయనే తప్పుడు ప్రచారంకు ఆకర్షితులై చాలా మంది రైతులకు రుణమాఫీ కాకలేదని భావించుకొని రేవంత్ సర్కార్‌పై ఆగ్ర హంతో ఉన్నారు. అవకాశం ఉన్నచోట ప్రతిపక్షాల బోధనలకు ప్రేరేపితులైన రైతులు నిరసన తెలుపుతున్నారు.





ఇండిగో విమాన సేవలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

## హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మదీనాకు ఇండిగో కొత్త విమానసేవలు ప్రారంభం

**హైదరాబాద్ (శంషాబాద్). ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జీఎంఆర్ హైదరాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి హైదరాబాద్ మదీనాకు కొత్త విమాన సేవలను శుక్రవారం ప్రారంభించింది. తొలి విమానం ఆనందోత్సాహం మధ్య సీనియర్ అధికారుల సమక్షంలో శుక్రవారం బయలుదేరింది. ఈ సేవ ప్రతివారం మూడు రోజులుపాటు ఉం టాయని తెలిపారు. ఈ విమానసర్వీసులు సోమ, గురు, శనివారం అందుబాటులో ఉంటాయి. గమ్యస్థానం చేరడానికి 5 గంటలు 47 నిమిషాలు. పడుతుందని వివరించారు. ఈ కొత్త సేవతో అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని స్పష్టంచేశారు. హైదరాబాదు అంత ర్జాతీయ విమానాశ్రయం సీఈఓ ప్రదీప్‌పనికర్ మాట్లాడుతూ, 'మదీనాకు ఇండిగో తొలి విమానాన్ని స్వాగతించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కొత్తమార్గం మా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, హైదరాబాదును ప్రపంచంలోని అత్యంత ప్రముఖమైన ఆధ్యాత్మిక నగరాలలో ఒకటైన మదీనాతో అనుసంధానించే ప్రత్యేక ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ కనెక్టివిటీని మెరుగు పరచడం, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల విస్తరణకు మద్దతు ఇవ్వడం ప్రయాణికులకు సులభమైన సేవలు అందించ డానికి కట్టు బడి ఉంటామని అన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియాలోని ప్రయా ణికులకు ఇప్పుడు హైదరాబాదులో అభివృద్ధి చెందుతున్న గ్లోబల్‌హబ్ ద్వారా మరిన్ని ప్రయాణ ఎంపికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

## ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 1,244

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,244 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 61 దరఖా స్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 1,007 దరఖాస్తులు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించారు.

## తెలంగాణకు కేంద్రం అన్యాయం

**ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్**





శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. కృష్ణా జలాలపై తెలంగాణ ఏపీ మధ్య జరుగుతున్న చర్చలు.. దానిపై కేంద్రం స్పందనపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి అన్నారు. కృష్ణా జలాల నీటి వివాదంపై గత పదేళ్ళు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదమన్నారు. గత పదేళ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మద్ధతు కోరిందని కోదండరాం మీడియాకు తెలియజేశారు.

## మార్చి 4, 5 తేదీల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణులకు వైవా

**షెడ్యూల్‌ను విడుదల చేసిన టిజిపిఎస్‌సి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) నవంబర్-2024లో నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు వైవాను నిర్వహించనుంది. నవంబర్‌లో లాంగ్వేజెస్ పరీక్షలకు హాజరై అర్హత సాధించిన వారికి మార్చి 4, 5 తేదీల్లో వైవా నిర్వహించాలని టీజీపీఎస్‌సీ నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను కమిషన్ శుక్రవారం జారీచేసింది. వైవాకి అర్హత సాధించిన వారి జాబితాను కమి షన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు మార్చి 4, 5 తేదీల్లో కమిషన్ కార్యాలయంలో వైవాకి గంట ముందుగా వివరాలను నమోదు చేసుకొని బయోమెట్రిక్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు చేతులకు మెహందీ వేసుకోవడం గానీ, తాత్కాలిక టాటూస్ వేసుకోవడం చేయవద్దని కమిషన్ సూచించింది.

## పిసిసి విస్తృతస్థాయి కార్యవర్గం సమావేశం వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సి ఉండగా దానిని వాయిదా వేశారు. శాసనమండలి ఎన్నికలు ఈ నెల 27న ఉండటంతో సమా వేశం వాయిదాను నిరవధికంగా వాయిదా వేశారు. విస్తృతస్థాయి సమావేశంలో చర్చించాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై ఒకరోజు ముందే పిసిసి చీఫ్ మహేష్ కుమార్ అధ్యతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రాదేశిక నియోజకవర్గం పరిదిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పాల్గొని ఎన్నికల గెలుపు కోసం వ్యూహరచనకు దశదిశను నిర్దేశించారు. ఈ నెల 23న జరగాల్సిన పిసిసి కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చారర్జిగా మీనాక్షి నటరాజన్ నియ మితులయ్యాక ఏర్పాటు చేసిన తొలి సమావేశం కావడంతో అత్యంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల బిజీ కారణంగా వాయిదా వేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎన్.మారేష్, జబ్బుల శ్రీనివాస్, సి.రాజేందర్, భూపేష్‌సాగర్ తదితరులు

## 12, 13 తేదీల్లో ఢిల్లీలో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు'

**యావత్ బిసిలు పాల్గొనాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట మార్చి 12, 12 తేదీల్లో ఢిల్లీలోని ఎపి భవన్‌లో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో కేంద్రమంత్రులు, ఎంపిలు, ఎపి, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 100 బిసి సంఘాల ప్రముఖులు పాల్గొంటారని, బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన జరగవలపిన చారిత్రాత్మక అవశ్యకత ఎంతైనా ఉందని, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే చోరవ తీసుకుని బిసి బిల్లు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, బిసి నేతలు సి.రాజేందర్, పీతాను ప్రసాద్, నడిపిన శ్రీనివాస్‌రావు, నీలం వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో టాప్10 బ్యాంకుల్లో స్థానం సంపాదించాలి

**ఎస్‌బిఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రపంచంలోని టాప్ 10 బ్యాంకుల్లో స్థానం సంపాదించే విధంగా ఎస్‌బిఐ సిబ్బంది పని చేయాలని, ఇందుకు ఖాతాదారులు సహకారం కూడా ఎంతో అవసరం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ చల్లా శెట్టి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్రంలోని (హైదరాబాద్) సర్కిల్లో 10 కొత్త (1. అలంపూర్ల్ రోడ్ 2. చిన్నం బావి 3. రాఘవేంద్ర కాలనీ (కొండాపూర్) 4. నియోపోలిస్ 5. కిష్టారెడ్డిపేట్ (పటాన్‌చెరు) 6. ఖాజాగూడ 7. ఉస్మాన్ నగర్ 8. కంగ్టి (నారాయణఖేడ్) 9. సుచిత్ర సర్కిల్ (కుత్బుల్లాపూర్) 10. నందిపేట్) శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో (హైదరాబాద్ సర్కిల్) పది కొత్త శాఖలను చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ రాజేష్ కుమార్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆ శాఖలు 2024లో దేశంలోని అత్యుత్తమ బ్యాంకుల జాబితాలో 4వ స్థానంలో ఉందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళ బాధ్యత సిబ్బందిపై ఎంతగానో ఉందన్నారు. ఈ నూతన బ్యాంకుల ఏర్పాటుతో రాష్ట్రంలో ఎస్‌బిఐ బ్రాంచ్‌ల సంఖ్య 1206కు చేరుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందేలా చేయడం, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాల్లోని ప్రజల పెరుగుతున్న బ్యాంకింగ్ అవసరాలను తీర్చడం వంటి చర్యలు బ్యాంకుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. కస్టమర్ మన విశ్వానికి కేంద్రమని, కస్టమర్ కేంద్రీకృతి, వ్యాపార వృద్ధి, స్థిరమైన వృద్ధి, ఉద్యోగుల కేంద్రీకృతి అనే నాలుగు ప్రాథమిక సూత్రాలపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. దేశ ఆర్థిక భవిష్యత్తును రూపొందించడంలో బ్యాంకు కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని సాధించేందుకు ఉద్యోగులు ఉత్తమ బ్యాంకుగా, అత్యంత విలువైన బ్యాంకుగా ఉండేలా చూసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. మరింత మంది ఖాతాదారులను చేర్చుకోవడం, అత్యున్నత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించడం వంటి కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు.





## కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసిన బిఆర్ఎస్

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టి లక్షా81వేల కోట్లు అప్పు తీసుకొచ్చినా కృష్ణాజలాల వాటా విషయంలో తెలంగాణకు బిఆర్ఎస్ అన్యాయం చేసిందని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులకు మంత్రులకు కృష్ణా ప్రాజెక్టులపై మాట్లాడే నైతికత లేదని అన్నారు. గత పదిసంవత్సరాలు బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణలో 100 టిఎంసిల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయ లేదని ఆయన అరోపించారు. ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధు లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజె క్టులు పూర్తి చేసుకొంటామని ఆయన తెలిపారు.

## యాదగిరిగుట్ట కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**భువనగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనంసింహ స్వామివారి బంగారు విమాన గోపురం మహా కుంభా భిషేకం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఏర్పా ట్లను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, దేవాదయ శాఖ, అర్ అండ్ బి, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఎక్సైజ్, మత్స్య శాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ట్రాన్స్ కో, డిపిఆర్ఓ, సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణ రెడ్డి, సీఈఓ శోభారాణి, ట్రాఫిక్ ఎసిపి ప్రభాకర్ రెడ్డి, డీఆర్డిఏ నాగిరెడ్డి, ఏ.ఓ జగన్మోహన్ ప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులను చితకబాదిన ఇంటర్ స్టూడెంట్లు

**రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో ఘటన**

**పట్టించుకోని డైరెక్టర్, ప్రిన్సిపాల్**

**గతంలోనూ ఘటన.. తల్లిదండ్రుల ఆందోళన**

**విద్యార్థులను గోప్యంగా ఆస్పత్రికి తరలించిన స్కూల్ సిబ్బంది**



**చొప్పదండి, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి చదువుతున్న విద్యార్థులను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ గోప్యంగా ఉంచి విద్యార్థులకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం వివరాల్లోకి వెళితే ఈనెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విద్యార్థులు 10 మంది కలిసి పదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులపై భౌతికంగా దాడి చేశారు ఈ దాడిలో కొందరికి గాయాలు కాగా రాత్రి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వాసనీయ సమాచారం ప్రిన్సిపల్ సైనిక్ స్కూల్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం సైనిక్ పాఠశాల కు చేరుకొని ఆందోళన నిర్వహించారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఆందోళన నిర్వహించారు సంఘటన స్థలానికి ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థులతో మాట్లాడారు గతంలో కూడా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను దాడి చేసిన సంఘటన కూడా చోటుచేసుకుంది మళ్లీ ఇలాంటి సంఘటనలు పునారవృతం అవుతున్నాయి ఇదిలా ఉండగా విద్యార్థులు కొందరు మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మద్యం సేవిస్తున్నారని సంఘటనలు కూడా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి ప్రిన్సిపల్ డైరెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులను పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు పిల్లలను విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పంపిస్తే క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రిన్సిపాల్ ను డైరెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## దోచి, దాచిపెట్టిన అధికారులపై వేగంగా విచారణ చేపట్టాలి

**ఆ అధికారుల వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు**

**చర్యలు తీసుకొనే సమయం ఆసన్నమైంది**

**పిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలోని అధికారుల తీరువల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆవేదన చెందారు. శుక్రవారం ప్రసారమాధ్యమ ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ దోచిపెట్టిన దాచిపెట్టి అధికారులపై వేగంగా విచారణ జరుగాలని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో పెత్తనం చేసిన అధికారులు ఇప్పుడూ ఉండటంతో ప్రతిపక్ష పార్టీతో కుమ్మక్కై ప్రభుత్వ సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో పదేళ్లు కీలకంగా వ్యవహరించిన అధికారులను పక్కన పెట్టాలని ప్రభుత్వ పెద్దలకు ఆయన సలహా ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైందని చాలాచోట్ల ఇది కనపడుతోందని ఆయన అన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగానే భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య జరిగిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు అవినీతి అధికారుల జబితా చేరిందని ఇక వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్ బాగోతం ఇంకా బయట పడటంలేదని ఆయన అండతోనే జిఎస్‌టి కుంభ కోణం జరిగిందిన ఆయన వివరించారు. అమయ్ కుమార్ లాంటి వారిపై చర్యలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణలో వేగం తగ్గడంతో 'రాజీ'పడ్డామనే ఆరోపణలు కాంగ్రెస్‌పై వస్తున్నాయని అన్నారు. సంధికాలం ముగిసింది ఇక అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైందని అన్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించినవారిని పక్కనపెట్టాల్సిన అవసరం ఉంది. అవినీతిపై విచారణ చేయాల్సిన అధికారులు కూడా దోషులు కావడంతో విచారణ ముందుకు సాగడంలేదు. సింగరేణిలో కల్వకుంట్ల కవితకు అన్ని రకాలుగా సహకరించిన అధికారి మా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలోప ఉన్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఎవరి బలం ఎంత?




**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించే ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఎడిషన్‌కు సంబంధించిన సమరం నాలుగో రోజులోకి ప్రవేశించింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిలో ప్రధాన జట్ల మధ్యే హోరాహోరీ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఏజట్టు బలం ఎంతెంత అనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే ఇది వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 8 టీమ్స్ పాల్గొనే టోర్నీ, కాబట్టి ఏ జట్టునూ తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఆతిథ్య పాకిస్తాన్, టీమిండియా చేతిలో బంగ్లాదేశ్ ఓటమి చవిచూసింది. ఇక ఎప్పటిలాగే టీమ్‌ఇండియా టైటిల్ ఫేవరెట్లలో ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్వదేశంలో రీసెంట్‌గా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఊపు మీదుంది. ఈ సిరీస్ తోనే సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ అందుకోవడంతో రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గిల్, అయ్యర్, రాహుల్ నిలకడైన ప్రదర్శన కలిసొచ్చే అంశం. అయితే బుమ్రా లేడనే ఆందోళన తప్పా, టమిండియా అన్ని రంగాల్లో బలంగానే కనిపిస్తోంది. ఇక 2023లో వన్డే వరల్డ్ కప్ చేజారడంతో ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీనైనా దక్కించుకోవాలని రోహిత్ సేన ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో భారత్ విజయంతో బోణీ కొట్టింది.

## వీటి మధ్యే హోరాహోరీ

ఇక ఉప ఖండేతర జట్లలో భారీ అంచనాలున్నది న్యూజిలాండ్ జట్టుపైనే. ఐసిసి టోర్నీల్లో కివీస్ ఎప్పుడూ నిలకడగా ఆడుతుంది. ఇటీవల ఆతిథ్య పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించి ట్రై సిరీస్ గెలవడం ఆ జట్టు విశ్వాసాన్ని పెంచేదే. బ్యాటింగ్‌లో విలియమ్సన్, కాన్వే, ఫిలిప్స్, మిచెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో శాంట్నర్, బ్రాస్‌వెల్, హెన్రీ, ఒరూర్క్ నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పుడున్నఊపులో ఫైనల్‌చేరగలదనే ధీమ కివీస్‌లో కన్పిస్తోంది. అలాగే ఆస్ట్రేలియా ఎల్లప్పుడూ ఐసిసి టోర్నీల్లో ఫేవరెట్ల లిస్ట్‌లో కచ్చితంగా ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం కంగారూలపై పెద్దగా అంచనాలు లేవు. కెప్టెన్ కమిన్స్‌తో పాటు హేజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, స్టార్క్, స్టాయినిస్ అందుబాటులో లేక ఆసీస్ బలహీన పడింది. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు తోడు లబుషేన్, మ్యాక్స్‌వెల్, షార్ట్, ఇంగ్లిస్, అబాట్, స్పెన్సర్ జాన్సన్, ఎలిస్ లాంటి ప్రతిభావంతులతో కూడిన కంగారూ జట్టు టోర్నీలో ఎక్కడిదాకా వెళ్తుందో చూడాలి. అలాగే ఫార్మాట్ ఏదైనా ఇంగ్లాండ్ ప్రస్తుతం ప్రపంచ మేటి జట్లలో ఒకటి. అయితే భారత పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లు కోల్పోవడం ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసాన్ని కొంత దెబ్బ తీసేదే. అయినా సరే, సాల్ట్, డకెట్, బట్లర్, బ్రూక్, రూట్, లివింగ్‌స్టన్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుంది. రషీద్ రూపంలో మేటి స్పిన్నర్ అందుబాటులో ఉన్నా అతడికి సహకరించే స్పిన్నర్లు లేరు.

ఆర్చర్, సకిబ్ మహమూద్, వుడ్‌లతో కూడిన పేస్ విభాగం కూడా సరైన ఫామ్‌లో లేదు. ఇక దురదృష్టాన్ని వెంటబెట్టుకుని ఐసిసి టోర్నీలకు వస్తుందని పేరున్న సౌతాఫ్రికా ఈసారి కథ మార్చాలనుకుంటోంది. ఇటీవలే అరంగేట్రం చేసిన బ్రీట్జ్‌కే ఫామ్‌లో ఉన్నాడు. మార్‌క్రమ్, వాండర్ డసెన్, క్లాసెన్, మిల్లర్ లాంటి సీనియర్లు బ్యాటింగ్‌లో ఆ జట్టుకు పెద్ద అండ. పేస్‌లో రబాడ మీదే జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఎంగిడి ఫామ్‌లో లేదు. స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షంసి రాణించడం ఎంతో కీలకం.



## పింక్ లేడీస్ కప్‌లో.. భారత్ మహిళల జట్టు శుభారంభం

### జోర్డాన్‌పై 2-0తో విజయం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక పింక్ లేడీస్ కప్-2025లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. షార్జాలో జరిగిన తమ తొలి పోరులో స్వీటీ దేవీ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో జోర్డాన్స్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున ప్రియాంక దేవి (23వ నిమిషంలో), మనీషా (54వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు దూకుడు కనబర్చింది. తొలి అర్ధభాగంలో వచ్చిన అవకాశాన్ని ప్రియాంక దేవి సద్వినియోగ పర్చుకుంటూ జోర్డాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించి భారత్ ఖాతా తెరిచింది. కాసేపటికే స్కోరు పెంచే అవకాశం వచ్చినా దాన్ని మనీషా సరిగ్గా వినియోగించుకోలేక పోయింది. ద్వితీయార్థంలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా మనీషా గోల్ కొట్టి జట్టుకు విజయం ఖాయం చేసింది. క్రిస్పిన్ ఛెత్రి భారత మహిళల కోచ్ ఎంపికైన అనంతరం భారత్ జట్టుకు ఇదే తొలివిజయం కావడంవిశేషం.

జోర్డాన్ పదేపదే ప్రతి దాడులకు ప్రయ త్నించినా, స్వీటీ దేవి, పూర్ణిమ కస్తూరితో కూడిన రక్షణ శ్రేణి వాటిని సమర్ధవంతంగా అడ్డుకుంది. తెలం గాణ అమ్మాయి గుగులోతు సౌమ్య ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత యంగ్ ప్లేయర్ లిషమ్ బబీనాదేవి అంతర్జాతీయ అరంగేట్రంచేసింది. తదుపరిపోరులో ఈనెల 23న రష్యాతో భారత్ తలపడుతుంది.



## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో.. సెమీస్‌కు భారత్ స్టార్ బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఎటిపి-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. దోహాలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ జంటను బోల్తా కొట్టించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రోహన్ బోపన్న (భారత్)- నునో బోరెజెస్ (పోర్చుగల్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఇంటిదారి పట్టింది. ప్రపంచ నంబర్వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)-మాట్ పావిక్ (క్రొయేషియా)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-డోడిగ్ 2-6, 6-3, 10-8తో విజయం సాధించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-డోడిగ్ ఆరు డబుల్ ఫాల్టు చేసింది.అయితే సూపర్ టైబ్రేక్‌లో యూకీ-డోడిగ్ ద్వయం పైచేయి సాధించింది. జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్పూల్ (బ్రిటన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-బోర్జెస్ 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్స్‌లో ఓటమి పాలయ్యారు.

## రంజీ ట్రోఫీలో.. ప్రతీకారం తీర్చుకున్న విదర్భ

### ముంబైపై గెలిచి ఫైనల్లోకి ఎంట్రీ



**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ-2024-25 చివరి అంకానికి చేరింది. ఈ సీజన్లో తొలి ఫైనల్ బెర్త్ అధికారికంగా ఖరారైంది. రెండో సెమీ ఫైనల్లో ముంబైని ఓడించి విదర్భ వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్‌కు చేరింది. గత సీజన్ ఫైనల్లో ముంబై చేతిలో ఎదురైన పరాభవానికి విదర్భ ఈ సీజన్ సెమీస్‌లో ప్రతీప్రకారం తీర్చుకుంది. నాగపూర్‌లోని క్రికెట్ మైదానంలో జరిగిన సెమీ ఫైనల్లో ముంబైపై విదర్భ 80 పరుగుల తేడాతో గెలుపొందింది. విదర్భ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై 325 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే5, యశ్ ఠాకూర్, పార్థ్ రేఖడే తలో 2 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టారు. ముంబై ఇన్నింగ్స్‌లో ఎవ్వరూ భారీస్కోర్లు చేయలేదు. ముంబై ఓటమి ఖరారైన తర్వాత శార్దూల్ ఠాకూర్ (66) అర్ధ సెంచరీ సాధించాడు. షమ్స్ ములానీ (46)సాయంతో శార్దూల్ ముంబైని గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. స్టార్ బ్యాటర్లు అజింక్య రహానే (12), శివమ్ దూబే (12), సూర్య కుమార్ యాదవ్ (23) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆకాశ్ ఆనంద్ ఈ సారి 39 పరుగులకు ఔటయ్యాడు. యువ ఆటగాళ్లు ఆయుశ్ మాత్రే (18), సిద్దేశ్లాడ్ (2) నిరాశపరిచారు. ఆఖర్లో తనుశ్ కోటియన్ (26), మోహిత్ అవస్తి (26), రాయ్‌స్టన్ దయాస్ (23) కంటితుడుపు చర్చగా బ్యాట్స్ ఝులిపించారు. అక్షయ్ వాడ్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసిఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే 5 వికెట్లతో రాణించగా, షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ దయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. అనంతరం బరిలోకి దిగిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే ఆలౌటైంది. స్టార్ బ్యాటర్లు, టీమిండియా ప్లేయర్లు అజింక్య రహానే (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివమ్ దూబే (0) దారుణంగా విఫలమయ్యారు. ఆకాశ్ ఆనంద్ (106) అద్భుతమైన పోరాటపటిమ కనబర్చి సూపర్ సెంచరీతో ముంబైపరువు కాపాడాడు.విదర్భ బౌలర్లలో పార్థ్ రేఖడే4, యశ్ ఠాకూర్, హర్ష్ దూబేతలో 2, దర్శన్ నల్కండే, భూటేచెరో వికెట్ పడగొట్టారు.

## అంగరంగ వైభవంగా ఫార్ములావన్

### మార్చి 16 నుండి మెల్‌బోర్న్‌లో కార్ల రేసింగ్



**న్యూఢిల్లీ:** ఫార్ములావన్ 75వ వార్షికోత్సవ సీజన్ ఆరంభ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. నలుపు రోడ్డుపై వాయువేగంతో కార్లు నడుపుతూ అభిమానులను అలరించే రేసర్లు ఈ ఈవెంట్లో రెడ్ కార్పెట్‌పై అభిమానులకు చేతులూపుతూ దర్శనమిచ్చారు. 24రేసులతో కూడిన 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఆరంభ కార్యక్రమంలో 2025 సీజన్లో పోటీపడే 20 మంది డ్రైవర్లు తమ కార్లతో పాటు పాల్గొన్నారు. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ స్టేజి మీదకు వచ్చిన సమయంలో ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సుదీర్ఘ ఎఫ్1 చరిత్రలో ఇలాంటి వేడుక జరగడం ఇదేతొలిసారి కాగా, ఇందులో భాగంగా బ్రిటన్ సింగర్ కేన్ బ్రౌన్ మ్యూజిక్ షో ఆహుతులను కట్టిపడేసింది. కనీవినీ ఎరగని రీతిలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫార్ములావన్ మరింత విస్తరించడంలో భాగంగానే హాలీవుడ్ సినిమా స్థాయిలో ఈ వేడుకు నిర్వహించారు. దీనిపై హామిల్టన్ స్పందిస్తూ 'చాలా ఉత్సాహంగా ఉంది. కొత్త సీజన్లో మరింత వేగంగా దూసుకెళ్లాలని చూస్తున్నా. అందుకు కావాల్సిన శక్తి ఉంది. కొత్త జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్తేజంతో ముందుకు సాగుతా' అని అన్నాడు.

# వాణిజ్యం

## ఫోన్‌పే ఐపిఒకు సెబి గ్రీన్ సిగ్నల్

**ముంబై, ఫిబ్రవరి 21:** గడచిన కొన్ని రోజులుగా దేశీయంగా స్టాక్ మార్కెట్లలోకి వస్తున్న క్రేజీ ఐపీవోల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదొడుకుల్లో ఉండటం కూడా రిటైల్ పెట్టుబడిదారులను మార్కెట్లకు కొంత దూరంగా ఉండేలా చేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త కంపెనీలు తమ ఐపీవో ఫ్లోటింగ్ ప్లాన్స్ రివీల్ చేస్తున్నాయి. అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ యాజమాన్యంలో పనిచేస్తున్న 'ఫోన్‌పే' సంస్థ చాలా కాలంగా తన ఐపీవోను తీసుకురావటం కోసం అవసరమైన సన్నాహాలను చేస్తున్న సంగతి తెలిసిందే. చివరిగా 2023లో ఇన్వెస్టర్ల నుంచి ఫండింగ్ అందుకున్న కంపెనీ విలువ అప్పట్లో 10 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు విస్తరించటంతో ఈ విలువ మరింతగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీ మార్కెట్లో పేటీఎం, నావీ, గూగుల్ పే వంటి ఇతర పోటీదారులను కలిగి ఉంది. వాస్తవానికి సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ 2022 డిసెంబరులో తన బిజినెస్ ఆపరేషన్స్ ఇండియాకు మార్చేసింది. దీని కారణంగా కంపెనీ దాదాపు 8000 కోట్ల మేర భారీ పన్ను చెల్లింపులను చేపట్టాల్సి వచ్చింది. దీని కారణంగా నాన్ పేమెంట్ సేవలను కంపెనీ పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకుంది. అయితే ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్లో ఐపీవో ఫ్లోట్ చేయటానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కంపెనీ తన ప్లాన్ ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. కంపెనీ తన ఐపీవోకి సంబంధించి సన్నాహక చర్యలను ప్రారంభించినట్లు ఫోన్‌పే ఒక ప్రకటనలో తెలిపింది.




దీని ద్వారా కంపెనీ తన వ్యాపారాన్ని భారతీయ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఈ ఏడాది కంపెనీ తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ ఐపీవో ప్లాన్ మంచి మైలురాయిగా నిలుస్తుందని తెలుస్తోంది. కంపెనీ తన డిజిటల్ సేవల ద్వారా ప్రస్తుతం దేశంలో కోట్ల మంది ప్రజలకు సేవలను అందిస్తూ దగ్గరైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రస్తుతం కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించటానికి అనుకూలంగా ఉన్నట్లు యాజమాన్యం భావిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 73 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో కంపెనీ మెత్తం ఆదాయం రూ.5064 కోట్లుగా నమోదైందని బెంగళూరు టెక్ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ తన నికర ఆదాయం రూ.197 కోట్లుగా నమోదు చేసి నష్టాల నుంచి బయటకు వచ్చింది.

## చాట్‌జిపిటి యాక్టివ్ యూజర్లు 400 మిలియన్లు

**ముంబై, ఫిబ్రవరి 21:** ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ చాట్‌బాట్ చాట్‌జిపిటి వినియోగించే వారి సంఖ్య రోజురోజులూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జిపిటికి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది డిసెంబరుతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలా మందికి చేరువైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓపెన్‌ఎఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబరులో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జిపిటిని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు, కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబరుతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబెర్, మోర్గాన్ స్టాన్లీ, టి-మొబైల్స్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఓపెన్ ఎఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలా మంది డెవలపర్లు ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ మోడళ్లను వారి సొంత యాప్‌లలో వినియోగిస్తున్నారు. దీంతో ఈసేవల్ని వినియోగించే డెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఎఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. ఇదిలా ఉండగా, కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. చైనాకు చెందిన ఎఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ కూడా తన ఎఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది. అయినప్పటికీ, చాట్‌జిపిటికి మాత్రం తన యూజర్ల సంఖ్యను ఏ మాత్రం కోల్పోకుండా పెంచుకుంటుండడం విశేషం.




## కియా '1380 ఇవి6' కార్లు రీకాల్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ వాహన తయారీ సంస్థ కియా మోటార్స్ తన 'ఇవి6' కోసం స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది. 2022 మార్చి 3 నుంచి 2023 ఏప్రిల్ 24 మధ్య తయారైన మొత్తం 1,380 యూనిట్లలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఈ రీకాల్ ప్రకటించడం జరిగింది. కియా 'ఇవి6' ఎలక్ట్రిక్ కార్లలో ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో 12వి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేసే లోపం కారణంగా రీకాల్ ప్రకటించింది. ఈ సమస్య కారణంగా 2024లో కూడా కంపెనీ 1138 యూనిట్లకు రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోమారు రీకాల్ జారీచేసింది. ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ 12వి బ్యాటరీ ఛార్జింగ్, పనితీరును మెరుగుపరు స్తుంది. ఇది కారులోని లైట్స్, వైపర్లు, మ్యూజిక్ సిస్టమ్ వంటి వాటికి శక్తిని ఇస్తుంది. కార్లలో ఈ లోపాన్ని కంపెనీ ఉచితంగానే పరిష్కరిస్తుంది. అయితే సంబంధిత వాహనాల యజమానులను నేరుగాసంప్రదించి వాటిని అప్‌డేట్ చేస్తామని కంపెనీ పేర్కొంది. ప్రభావిత వాహనాల కస్టమర్లు అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసుకోవడానికి, సంబంధిత కియా డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు. ఇతర వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేయవచ్చు.



## ట్రంప్‌తో ఆపిల్ సిఇఒ భేటీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపిల్ సిఇఒ టిమ్‌కుక్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌజ్‌లో సమావేశమయ్యాయి. చైనాలో ఆపిల్ తన తయారీ ప్లాంట్ నుంచి భారీగానే వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికాకూ ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా-చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్‌తో భేటీ అవ్వడం చర్చనీయాంశం అయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్ని చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది చైనాలో ఉత్పత్తి అవుతూ అమెరికాలోకి వస్తున్న ఆపిల్ ఉత్పత్తులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఇది కంపెనీ ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఈ సుంకాల నుంచి ఆపిల్ ఉత్పత్తులను రక్షించడం తన ప్రాథమిక లక్ష్యంగా కుక్ భావించారు. దాంతో ట్రంప్‌ను ప్రత్యక్షంగా కలిసి టారిఫ్ మినహాయిం పులు కోరినట్లు తెలిసింది. అయితే గతంలో మాదిరి కాకుండా ఈ సారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. వాణిజ్య సమస్యలతో పాటు ఆపిల్ గోప్యతా విధానాలపై ట్రంప్, టిమ్‌కుక్‌ల మధ్య చర్చ జరిగింది. సమర్థంగా చట్టాలను అమలు చేసేందుకు న్యాయ బద్ధమైన సంస్థల కోసం కొన్ని ఐఫోన్లను అన్‌లాక్ చేయాలని ప్రభుత్వం ఎప్పటి నుంచో వాదిస్తోంది. ట్రంప్ ఈ అంశాన్ని లేవనెత్తడంతో కుక్ వినియోగదారుల గోప్యతకు కట్టుబడి కన్నట్లు తెలియ చేశారని తెలిసింది.



## సెన్సెక్స్, నిఫ్టీలకు నాలుగో రోజూ నష్టాలే..

**ముంబై, ఫిబ్రవరి 21:** దేశీయ స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రాఅండ్ మహీంద్రా 6శాతం టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్ట పోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 75,612.61 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలోరూపాయి విలువ 7 పైసలు నష్టపోయి రూ.86.71 నికిపైగా



వద్ద నిలిచింది.మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరే షన్ వంటి షేర్లు నష్టపోయాయి. టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఏసియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడయింది.

## కొత్త 'ఇవి' పాలసీ వదంతులు ..టాటా, మహీంద్రా షేర్లు డౌన్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త 'ఇవి' పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి. దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈ నేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త 'ఇవి' పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిఫ్టీ ఆటో సూచి 2శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6శాతం, టాటా మోటార్స్ 2 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం 'ఇవి' కార్ల మార్కెట్లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగి ఉన్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14